www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 247 | సోమవారం | 26 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రైతు కన్నీటిని కడతేరుద్దాం



సమితులు ఐక్యంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేసి రైతాంగాన్ని కష్టాల నుంచి గట్టెక్కించాలి

చెక్కుల ద్వారా వానాకాలం పెట్టుబడి సాయం, యాసంగికి ప్రీపెయిడ్ కార్డుల ద్వారా

1.42 కోట్ల ఎకరాల సాధారణ భూమితో పాటు 20 లక్షల ఎకరాల అసైన్డ్‌కు ఆర్థిక సాయం

బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయింపు

- రైతు సమితుల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రకటన

రైతు సమితుల సభ్యులకు భవిష్యత్తులో గౌరవ వేతనం 6

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతు సమితులు ఐక్యమత్యంతో ప్రణాళికబద్ధంగా పనిచేస్తూ రాష్ట్ర రైతాంగం కన్నీళ్లను కడతేర్చాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అన్నారు. వానాకాలం నుంచి రైతులకు ఎకరాకు రూ. 4 వేలు ఇచ్చే ఆర్థిక సాయాన్ని చెక్కుల ద్వారా పంపిణీ చేస్తామని, యాసంగి (నవంబరు) నుంచి ప్రీ పెయిడ్ కార్డుల ద్వారా ఇస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.42 కోట్ల ఎకరాల భూమితో పాటు 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూమికి కూడా ఆర్థిక సాయం చేస్తామని స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న మరో మూడు లక్షల ఎకరాలను కలుపుకుని నికరంగా 1.65 కోట్ల ఎకరాలకు వానాకాలంలో పెట్టుబడి అందజేయనున్నట్లు సిఎం తెలిపారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ప్రాంగణంలో ఆదివారం 13 జిల్లాలకు చెందిన మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సుకు హాజరైన సిఎం కెసిఆర్ రైతు సమితి సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తూ పైవిధంగా స్పష్టత ఇచ్చారు. రైతు సమన్వయ సమితి సభ్యులకు వారి బాధ్యతలపైనా, ప్రభుత్వ విధానాలపైనా దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు (చైర్మన్)గా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులను వెలువరించనున్నట్లు తెలిపారు. రైతు సమితుల్లో సభ్యులకు కల్పించిన చోటు రాజకీయ పోస్టు కాదని, సిపాయిల్లా పని చేయాలన్నారు. రాష్ట్ర సమితి (కార్పొరేషన్)కు రూ.6 వేల నుంచి రూ.7 వేల కోట్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం తరువాయి 6లో



రాష్ట్ర రైతు సమితి అధ్యక్షుడిగా సుఖేందర్ రెడ్డి

రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు(చైర్మన్)గా గుత్తా సుఖేందర్ రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులను వెలువరించనున్నట్లు సిఎం తెలిపారు.



రైతుకు సీతకున్నంత దుఃఖముంది. ఆదాయం రెట్టింపు అనేది బూటకం. అందులో ఏమీ లేదు.
- సిఎం కెసిఆర్



ఇంటి తవ్వకాలలో బయల్పడిన ఫిరంగి

మన తెలంగాణ/ హైదరాబాద్/ చార్మినార్: ఇంటి నిర్మాణం కోసం తవ్విన గోతిలో నిజాం కాలం నాటి ఫిరంగి బయటపడింది. హైదరాబాద్ పాతబస్తీ డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ వెంకన్న నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌కు చెందిన ఆనంద్ తన ఇంటి నిర్మాణానికి ఆదివారం గోతులు తవ్వుతుండగా అందులో చిన్న తరువాయి 6లో

కథగా, కల్పనగా కనిపించి మాయమైన ఓ దొరసాని

శ్రీదేవి ఇక లేరు



అశేష అఖిల భారత చలనచిత్ర ప్రేక్షక హృదయ సామ్రాజ్యాన్ని ఎదురు లేకుండా దశాబ్దాల పాటు పరిపాలించి అతిలోక సుందరిగా ముద్ర వేసుకున్న నటీమణి శ్రీదేవి శనివారం రాత్రి దుబాయ్‌లో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. 3 లో

దుబాయ్‌లో పూర్తయిన పోస్టుమార్టం, భౌతిక కాయం నేడు ముంబయికి రాక

కుంచెపోటు



నిరుద్యోగ భృతి వస్తే మనకు ఉద్'యోగం' లేనట్లేనా..?

మిడ్ మానేరు నుంచి గోదావరి నీళ్లతో చెరువులను నింపే యత్నాలు

10 లో

కాలేజీ భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యా యత్నం

హైదరాబాద్ షేక్‌పేట నారాయణమ్మ కాలేజీలో ఘటన

మన తెలంగాణ/ హైదరాబాద్ / పంజాగుట్ట: కాలేజీ భవనంపై నుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు



లు తెలిపిన వివరాల ప్రకారం షేక్‌పేట్‌లోని నారాయణమ్మ కాలేజీలో అండమాన్ నికోబార్ ఐలాండ్ కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన షామ్‌దిన్ (22) యువతి బీటెక్ తరువాయి 6లో


హైవేల విస్తరణకు లైన్ క్లియర్

ఒకటి, రెండు మాసాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి



మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ కొలిక్కి వస్తోంది. హైదరాబాద్ మినహా దాదాపు జిల్లాలన్నింటిలోనూ హైవే విస్తరణ పనులను నేషనల్ హైవే అథారిటీ సహకారంతో రోడ్లు, భవనాల శాఖ చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్‌హెచ్ –167 జడ్చర్ల – హగ్గరి (3,659 కి.మీ), పటాన్ చెరువు నుండి జహీరాబాద్, హుస్నాబాద్ మీదుగా కర్నాటకలోని కల్‌బుర్గి వెళ్లే తరువాయి 6లో

త్వరలోనే హైదరాబాద్‌లో శ్రీదేవి సంతాపసభ : మంత్రి తలసాని




మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రముఖ సినీ నటి శ్రీదేవి సంతాప సభ త్వరలో హైదరాబాద్ లో చిత్రరంగ ప్రముఖుల సమక్షంలో నిర్వహించ నున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శ్రీదేవి ఆకస్మిక మృతి పట్ల ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనతో విడుదల చేశారు. శ్రీదేవి అభినయం ఎవరికి సాటిరాదని పేర్కొన్నారు. ఆమె అసాధారణ నటి అని అభివర్ణించారు. ఆమె ఎందరికి స్ఫూర్తిని కలిగించారని, ఆదర్శంగా నిలిచారని అన్నారు. శ్రీదేవి సినీరంగంలో బాలనటిగా చిత్ర రంగ ప్రవేశం చేసి, అలనాటి అగ్ర నటులు అయిన ఎన్.టి.రామారావు, నాగేశ్వరరావు, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్ బాబులతోపాటు అనేకమంది నటులతో అనేక చిత్రాలలో నటించి తన నటనతో అభిమానులను మెప్పించినదని పేర్కొన్నారు. శ్రీదేవి మృతి చిత్ర పరిశ్రమకు కాకుండా ఆమె అభిమానులకు కూడా తీరని లోటని మంత్రి వివరించారు.

సినీ కోడైరెక్టర్ రాజశేఖర్ అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : సినిమాలో రాణించాలని ఎన్నో కలలతో హైదరాబాద్ చేరిన ఓ యువతిని అవకాశాలిప్పిస్తానని నమ్మించి మోసం చేసిన సినీ కో డైరెక్టర్ రాజశేఖర్‌ను బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. శ్రీకాకుళంకు చెందిన యువతి (20) సినిమాల్లో నటించి, మంచి పేరు, సెలబ్రిటీ హోదా, డబ్బు సంపాదించాలని ఎన్నో కలలతో గత ఏడాది ఆగస్టులో హైదరాబాద్ చేరుకున్న తర్వాత ఘన్‌పూర్‌కు చెందిన సినీ కో డైరెక్టర్ పి.రాజశేఖర్ సీరియళ్లలో మంచి పాత్రలిప్పిస్తానని నమ్మించి ప్రేమ, పెళ్లి పేరు చెప్పి లోబర్చుకుని మాట తప్పడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాజశేఖర్ చేతిలో మోసపోయిన బాధితురాలు అతనితోనే పెళ్లి జరిపించాలని వేడుకుంటుంది. న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తానని అంటోంది. మరో అమ్మాయి మోసపోకుండా ఉండాలనేది తన కోరిక అని బాధితురాలు పేర్కొంది.

బదిలీల షెడ్యూల్ ప్రకటించండి



మనతెలంగాణ/హైదరాబాద్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని ఎస్‌టియుటిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందంగౌడ్‌లు డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా షెడ్యూల్ ప్రకటించకపోతే ఆందోళన తప్పదని స్పష్టంచేశారు. ఆదివారం జరిగిన ఎస్‌టియు 71వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాల నిర్వహణకు సరిపడా నిధులు ఇవ్వాలని కోరారు. పాఠశాలలను జూన్ 1 నుంచి ప్రారంభిస్తున్నందున జూన్ 12 వరకు ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎస్ విధానం రద్దు, పండిట్, పిఇటిల ఉన్నతీకరణ తదితర తీర్మానాలు చేశారు.

ప్రేక్షకుల్లో ఆమెది చెరగని ముద్ర

మన తెలంగాణ/హైదరాబాద్: సినీ వినీలాకాశంలో ధృవతారలా ఒక వెలుగు వెలిగిన గొప్ప నటి శ్రీదేవి అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ అన్నారు. శ్రీదేవి అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె తన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే శ్రీదేవి మృతి పట్ల ఎంపి బండారు దత్తాత్రేయ తన ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు ఆయన ట్విట్ చేశారు.

ఎంఆర్‌పిఎస్ బంద్‌కు మద్దతు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మార్చి 13న ఎంఆర్‌పిఎస్ నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం ప్రభు త్వం ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఎస్‌సి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లు పెట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని సిఎం కెసిఆర్ స్వయంగా ప్రకటించి ఏడాది గగిచినా అమలుచేయలేదన్నారు.

2న బిసి సంఘాల విస్తృత స్థాయి సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి నిధులు పెంచాలని, బిసి నివేదికను వెంటనే అమలు చేయాలని మార్చి 2న హైదరాబాద్‌లో బిసి కుల సంఘాలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో బిసిలకు జరిగిన అన్యాయం, బిసి కమిషన్‌కు చట్టబద్ధత, రాష్ట్ర బడ్జెట్ తదితర అంశాలపై విస్తృతస్థాయి సమావేశంలో చర్చిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు రూ. 20వేల కోట్లు, బిసి సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, బిసి ఎంఎల్‌ఎలు, మంత్రులు ఇచ్చిన నివేదికను అమలు చేయడానికి ప్రభుత్వం విధాన ప్రకటన చేయాలని తెలిపారు.

ముదిగొండ నుంచి 'తెలంగాణ ఆత్మగౌరవ యాత్ర'

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క తలపెట్టిన 'తెలంగాణ ఆత్మగౌరవ యాత్ర'ను రైతులకు బేడీలు వేసిన ముదిగొండ నుండి తుమ్మిడి హాట్టి వరకు నిర్వహించనున్నట్లు తెలిసింది. దళితులపై దాడి జరిగిన నేరెళ్ళ మీదుగా ఈ యాత్రను నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం తెలంగాణకు జీవనాధారమైన ప్రాణహిత ప్రాజెక్టుకు అంబేడ్కర్ పేరును లేకుండా చేస్తోందని, తుమ్మిడి హాట్టి వరకు యాత్ర చేయడం ద్వారా ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని ఆయన భావిస్తున్నారు. మరోవైపు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు కల్పిస్తే ఈ ప్రభుత్వం లాకుంటుందని, నెరెళ్లలో ఇసుక మాఫియా ఆగడాలను ప్రశ్నించంచినందుకు దళితులపై దాడి జరిగిన విషయం తదితర అంశాలను తన యాత్రలో ప్రముఖంగా ప్రచారం చేయాలని మల్లు భట్టివిక్రమార్క నిర్ణయించుకున్నారు.

కాంట్రాక్ట్ ఏజెన్సీ రద్దు!

- **పారిశుద్ధ్య పనుల నుంచి తొలగించడానికి సన్నద్ధమైన మున్సిపల్‌శాఖ**
- **ఇక జిహెచ్ంఎసి విధానమే అమలు**
- **శానిటేషన్ వర్కర్స్ గ్రూప్‌తోనే పనులు**



మన తెలంగాణ/హైదరాబాద్: పురపాలికల పరిధిలో పారిశుద్ధ్య పనులను చేపడుతన్న కాంట్రాక్ట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్ఎంసి) తరహా సానిటేషన్ వర్కర్స్ గ్రూప్(ఎస్‌డబ్ల్యుజి) విధానాన్ని అమలు చేసేందుకు మున్సిపల్ శాఖ సన్నద్ధమైంది. దీనికి సంబంధించి మార్గదర్శకాల ప్రకారం పారిశుద్ధ్య పనులను చేపట్టాలని స్థానిక పురపాలికలను మున్సిపల్ శాఖ ఆదేశించింది. కొత్త విధానాన్ని అమలు చేసే ముందు ప్రస్తుతం పురపాలికల పరిధిలోని కాంట్రాక్ట్ ఏజెన్సీల సంఖ్య, వాటి పరిధిలో పని చేస్తున్న కార్మికుల సంఖ్యతో పాటు కాంట్రాక్ట్ కాలపరిమితికి సంబంధించిన వివరాలను సేకరిస్తోంది. కాంట్రాక్ట్ ఏజెన్సీ గడువు ముగిసిన తర్వాత ఈ విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఒకవేళ కాంట్రాక్ట్ ఏజెన్సీ గడువు ఎక్కువగా ఉంటే ఏం చేయాలనే అంశాన్ని అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది.క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపర్చాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలని మున్సిపల్ శాఖ ఇటీవల ఒక జీవోను జారీ చేసింది. పురపాలికల పరిధిలో ఏడుగురు కార్మికుల చొప్పున ఎస్‌డబ్ల్యుజి ఏర్పాటు చేయనుంది. స్థానిక పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పారిశుధ్య కార్మికులతో ఎస్‌డబ్ల్యుజిని ఏర్పాటు చేయడం, ఆ గ్రూపు పేరుతో, వ్యక్తిగతంగా బ్యాంక్‌ఖాతాలను తెరిపించనుంది. 2017 జూన్ వేతన రోల్‌లో ఉన్న కార్మికులను మాత్రమే పరిగణలోకి తీసుకోనుం ది. ఒక్కో కార్మికునికి 40 నుంచి 80 ఫీట్ల రహదారి వరకు పారిశధ్య పనులు అప్పగించేలా మార్గదర్శకాల్లో మున్సిపల్ శాఖ స్పష్టం చేసింది. కొన్ని పురపాలికల పరిధిలో కాంట్రాక్ట్ ఏజెన్సీలు కార్మికుల విషయ లో తప్పుడు లెక్కలు చూపుతున్నాయని, వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదనే ఆరోపణల నేపథ్యంలో కొత్త విధానం ద్వారా వేతనాలు నేరుగా వారి ఖాతాలోనే జమచేయనున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

బయోమెట్రిక్ విధానమే : జిహెచ్ంఎసి తరహా బయోమెట్రిక్ విధానం ద్వారానే పారిశుధ్య కార్మికుల అటెండెన్స్ ఉంటుంది. కార్మికుని బయోమెట్రిక్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. పురపాలికల పరిధిలోని శానిటరీ జవాన్ లేదా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎప్పటికప్పుడు కార్మికుల పనితీరును పరిశీలిస్తారు. అలాగే స్థానిక అధికారులు కూడా కార్మికుల హాజరుశాతంతో పాటు పారిశుధ్యపనులను పర్యవేక్షించాల్సి ఉంటుందని మున్సిపల్ శాఖ స్పష్టం చేసింది.

28 నుంచి పిఇసెట్ దరఖాస్తులు

మనతెలంగాణ/హైదరాబాద్: ఫిజికల్ ఎడ్యు కేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పిఇసెట్)కు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారం భం కానుంది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేయనున్నట్లు పిఇసెట్ కన్వీనర్ వి.సత్య నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 7వ తేదీ నుంచి పిఇసెట్ పరీక్షలు జరుగనున్న ఏప్రిల్ 10 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు సమర్పించవచ్చు. రూ.500 అపరా ధ రుసుంతో ఏప్రిల్ 17 వరకు, రూ.2 వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు, రూ.5 వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు లు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 20 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు.

రమేష్‌బాబు మృతి పట్ల చంద్రబాబు సంతాపం

మన తెలంగాణ/హైదరాబాద్ : సీనియర్ పాత్రికేయులు, న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఎం.డి గుత్తికొండ రమేష్‌బాబు మృతికి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో రమేష్‌బాబు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.


అదనపు హజ్ కోటా కోసం ముమ్మర ప్రయత్నం

- **హజ్ కమిటీ చైర్మన్ మసి ఉల్లాఖాన్**

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి అదనపు హజ్ కోటా కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలంగాణ హజ్ కమి టి చైర్మన్ మసిఉల్లాఖాన్ తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్, డిప్యూటి సిఎం మహమూద్ అలీల ద్వారా కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీకి లేఖతోపాటు అవసరాలు, వివరాలను పంపించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రం అదనపు హజ్ కోటా ఇచ్చినట్లయితే వెయిటింగ్‌లో ఉన్న చాలామందిని హజ్‌కు పంపే అవకాశం లభిస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి త్వరలోనే కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేయనున్నారని, సిఎం రాసిన లేఖను స్వయంగా అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హజ్ కమిటి బడ్జెట్‌ను పెంచిందని, హజ్ క్యాంపులు నిర్వహించడానికి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని వివరించారు. హజ్ యాత్రీకులకు ప్రత్యేక క్యాంపులు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నామని, జిల్లాల నుండి వచ్చే యాత్రీకుల ప్రయాణ ఖర్చులు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మక్కాలోని హైదరాబాద్ రుబాత్‌లో సాధ్యమైనంత ఎక్కువ మందికి వసతి సౌకర్యం కల్పించేలా రుబాత్ నాజీర్ మొహమ్మద్ అల్ షరీఫ్ తో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఎక్కువ మంది కి వసతి సౌకర్యం కల్పించేందుకు నాజిమ్ అంగీకరించినట్లు తెలిపారు.

ఎంసెట్‌కు తగ్గుతున్న ప్రాధాన్యత

- **ఈ సారి తొలిసారి ఆన్‌లైన్‌లో పరీక్షలు**
- **పెరగనున్న దరఖాస్తు ఫీజు**



మనతెలంగాణ/హైదరాబాద్ : ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులతోపాటు బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్, బియుఎంఎస్, యోగా, సిద్ధ లాంటి ఆయుష్ కోర్సులు తొలగిపోవడంతో ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యతో పాటు ప్రాధాన్యత కూడా తగ్గుతోంది. ఇంతకాలం ఎంసెట్‌లో ఉన్న ఈ కోర్సులు 'నీట్'లోకి వెళ్ళిపోవడంతో ఇంజనీరింగ్, ఫార్మసీ, బి.ఎస్సీ(అగ్రికల్చరల్), వెటర్నరీ కోర్సులు మాత్రమే మిగిలాయి. ఇందులో బి.ఎస్సీ(అగ్రికల్చరల్), వెటర్నరీ కోర్సులకు డిమాండ్ ఉన్నా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు మాత్రం పెద్దగా డిమాండ్ లేదు. ఇంజనీరింగ్‌లో ప్రముఖ కళాశాలలు మినహా మిగిలిన కళాశాలల్లో ప్రతీ ఏటా సీట్లు మిగిలిపోతున్నాయి. ఎంసెట్ ద్వారా ఇంజనీరింగ్‌కు హాజరయ్యే విద్యార్థుల కంటే కళాశాలల్లోని సీట్లే ఎక్కువగా ఉంటున్నాయి. ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సీటు గ్యారంటీ పరిస్థితే గత కొన్నేళ్ళుగా కొనసాగుతోంది. అయితే ఈ ఏడాది నుంచి బిఎస్‌సి(ఫారెస్ట్రీ) ప్రవేశాలను ఎంసెట్ ద్వారానే చేపట్టాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది.

ఇఎసెట్‌గా మారని పేరు :ఎంసెట్ (ఇఎఎంసిఇటి–ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడిసిన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)లో నుంచి ఎం(మెడిసిన్) తొలగిపోయినా ఎంసెట్‌గా పరిగణిస్తోంది ప్రభుత్వం. ఎంసెట్‌ను ఈ ఏడాది తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో దరఖాస్తు రుసుం పెరగనుంది. గత ఏడాదితో పోల్చితే 50 నుంచి 70 శాతం వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఆన్‌లైన్ పరీక్షలకు ఒక్కో విద్యార్థికి సుమారు రూ.400లను టిసిఎస్‌కు చెల్లించాల్సి ఉంటుంది. జిఎస్‌టి అదనం. గత ఏడాది ఎంసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు ఫీజు రూ.500 (ఎస్సీ,ఎస్టీలు రూ.250) ఉండగా, ఈ ఏడాది రూ.800 వరకు నిర్ణయించే అవకాశం ఉంది. సోమవారం జెఎన్‌టియుహెచ్‌లో జరుగనున్న ఎంసెట్ కమిటీ సమావేశంలో దరఖాస్తు రుసుంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, ముగింపు తేదీలు నిర్ణయించి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ బాధ్యతను ఉన్నత విద్యామండలిటిసిఎస్‌కు అప్పగించింది.

పెరుగుతున్న 'ఉపాధి'హామీ

- **రెట్టింపు నిధులు, పనిదినాలు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి**



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొత్తగా ప్రవేశపెట్టిన హరితహారం వంటి పథకాలతో గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు పెరిగాయి. ఉపాధి హామి పథకం కింద కేంద్రం ఇస్తున్న నిధులను, పనిదినాలను రెట్టింపు చేయాలని ఇటీవల రాష్ట్ర పంచాయతిరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం గత ఆర్థిక సంవత్సరం రాష్ట్రానికి రూ. 1793.84 కోట్లు విడుదల చేయగా ఈ ఏడాది రూ. 2526.78 కోట్ల విడుదల చేసింది. మిగులు నిధులతో కలుపుకుని మొత్తం రూ. 2944.79 కోట్లకు చేరుకుంది. గతేడాది రూ. 2033.26 కోట్ల విలువ చేసే పనులను పూర్తి చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 2534.14 కోట్ల విలువైన పనులను పూర్తి చేసింది. పరిపాలనాపరమైన ఖర్చులు తగ్గుతూ పనులు పెరిగి కూలీలకు చెల్లించే మొత్తం పెరుగుతోంది. గతేడాది పనులు పూర్తి చేసిన 15 రోజుల వ్యవధిలోనే 82.29శాతం చెల్లింపులు పూర్తి కాగా ఈ ఏడాది కొంత మెరుగుదల కనిపించింది. గతేడాది 23.45 లక్షల పనులను చేపట్టగా వీటిలో 13.20లక్షల పనులే పూర్తయ్యాయి.మరో 10.25 లక్షల పనులు కొనసాగుతున్నాయి. ఈఏడాది చేపట్టిన 15.23లక్షల పనుల్లో ఇప్పటి వరకు 11.08 లక్షల పనులు పూర్తైయ్యాయి. రాష్ట్రంలో మొత్తం 67.87 లక్షల మేరకు జాబ్‌కార్డులు జారీకాగా చురుకుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 61.9 లక్షలుగా తేలింది. వీరిలో 16.73 శాతం ఎస్సీలు, 12. 63 శాతం ఎస్టీలు ఉన్నట్లు కేంద్ర మంత్రికి ఇటీవల హైదరాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర అధికారులు వివరించారు. వ్యవసాయానికి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని వస్తున్న డిమాండ్ల కారణంగా పనిదినాలను కూడా పెంచాలని రాష్ట్ర అధికారులు ఆ విజ్ఞప్తిలో పేర్కొన్నారు.

రెండవ రోజు టిఆర్‌టి ప్రశాంతం

- **చాలా కేంద్రాలలో 100 శాతం హాజరు నమోదు**

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్షలు (టిఆర్‌టి) రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం ఒఎంఆర్ విధానంలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన పరీక్షకు చాలా కేంద్రాలలో 100 శాతం హాజరు నమోదు కాగా, కొన్ని కేంద్రాలలో 97 శాతం నుంచి 99 శాతం వరకు హాజరు నమోదైందని టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షలకు కూడా చాలా కేంద్రాలలో 100 శాతం హాజరు నమోదు కాగా, కొన్ని కేంద్రాలలో 97 శాతం నుంచి 99 శాతం వరకు హాజరు నమోదైందని పేర్కొన్నారు. ఈ పరీక్షలను తాము కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించడంతో పాటు స్పెషల్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించారన్నారు.

నేడు 10 కేంద్రాలలో ఆన్‌లైన్ పరీక్షలు: టిఆర్‌టి సోమవారం పరీక్షలు సిబిఆర్‌టి విధానంలో జరుగనున్నాయి. ఈ పరీక్షలకు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హెచ్ఎండిఎ పరిధిలోని 10 కేంద్రాలలో నిర్వహించనున్న స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్)కు 6,985 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్, సోషల్ స్టడీస్) పరీక్షలకు హెచ్ఎండిఎ పరిధిలోని 5 పరీక్షా కేంద్రాలలో 4,912 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తగ్గుముఖం పట్టిన విద్యుత్తు వృథా

- **నిర్ధారణకు వచ్చిన డిస్కంలు**
- **డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా వల్లే సాధ్యమైనట్లు వెల్లడి**



మనతెలంగాణ/హైదరాబాద్:డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా చేస్తుండడంతో లీకేజీలు, నష్టం తగ్గుముఖం పట్టినట్లు డిస్కంలు నిర్ధారణకు వచ్చాయి. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా 'డిస్ట్రిబ్యూడెట్ జనరేషన్' విధానంలో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వలన, వికేంద్రీకరణ పద్ధతిలో సరఫరా చేయడంవలన గ్రిడ్‌పై భారం తగ్గిందని, విద్యుత్ వృథాను అరికట్టగలిగినట్లు డిస్కం ఇంజనీర్ల విశ్లేషణలో వెల్లడైంది. అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర జెన్‌కో ఉత్పత్తి చేయడమూ, వివిధ మార్గాల్లో పలు పరిశ్రమలు విద్యుత్‌ను కొనుగోలు చేస్తుండడంతో (ఓపెన్ యాక్సెస్) గ్రిడ్ లైన్లలో గరిష్ట స్థాయిలో విద్యుత్ సరఫరా కావడంవల్ల లీకేజీలు తగ్గినట్లు స్పష్టమైంది. గ్రిడ్ నిండుగా విద్యుత్ సరఫరా అవుతున్నందువల్ల 'ఓపెన్ యాక్సెస్' నష్టాలు కూడా తగ్గాయని ఇంజనీర్లు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ నష్టం గణనీయంగా తగ్గి సగటున 3.35% స్థాయిలో నమోదైనట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థ బలోపేతానికి ట్రాన్స్ కో రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి మిషన్ భగీరథకు, వ్యవసాయానికి తొలుత 9 గంటలు, ఇప్పుడు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి అనువుగా మౌలిక సదుపాయాలను సమకూర్చడం, సాగునీటి ప్రాజెక్టుల కోసం కొత్త సబ్‌స్టేషన్లు, సరఫరా వ్యవస్థను నిర్మించడం తదితర పలు కారణాల వల్ల గ్రిడ్ గరిష్ట సామర్థ్యానికి సరిపోయేలా విద్యుత్‌ను సరఫరా చేయడంతో ఈ నష్టాల్ని తగ్గించుకోగలిగినట్లు అధికారులు వివరించారు. దీనికి తోడు డిస్ట్రిబ్యూషన్ జనరేషన్ పద్ధతిలో రాష్ట్రమంతటా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చి మూడు వేల మెగావాట్లకు పై చిలుకు సౌర, పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఎక్కడ ఉత్పత్తి అయిన కరెంటును ఆ ప్రాంతాల్లోనే వాడుతున్నందువల్ల సరఫరా, పంపిణీ నష్టాలు చాలా వరకు తగ్గాయని నొక్కిచెప్పారు. గతేడాది ఆగస్టులో గరిష్టంగా 3.54 శాతం మేరకు ఉన్న విద్యుత్ నష్టం క్రమంగా తగ్గుతూ డిసెంబరు నాటికి 3.17%కు చేరుకుందని, ఈ ఏడాది జనవరిలో 3.16%కి, ఫిబ్రవరిలో 3.02%కి తగ్గినట్లు వివరించారు. మార్చి నుంచి కూడా ఇదేవిధంగా నష్టాలు తగ్గుతూ ఉంటాయని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

సరఫరాకాలం	నష్టాలు
ఏప్రిల్ 2017	3.35
మే	3.50
జూన్	3.29
జూలై	3.44
ఆగస్టు	3.54
సెప్టెంబరు	3.50
అక్టోబరు	3.41
నవంబరు	3.28
డిసెంబరు	3.17
జనవరి 2018	3.16
ఫిబ్రవరి 2018	3.02
మార్చి 2018 (అంచనా)	3.02



ఆమెకు ఎలాంటి హృద్రోగ సమస్యలు లేవు : సంజయ్ కపూర్

దుబాయ్: అలనాటి నటి శ్రీదేవి గుండెపోటుతో మరణించారు. మేనల్లుడి వివాహం నిమిత్తం కుటుంబంతో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి శనివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. తన హోటల్ గదిలో శ్రీదేవి స్పృహకోల్పోయి కన్పించినట్లు ఆమె బంధువు సంజయ్ కపూర్ మీడియా ద్వారా వెల్లడించారు. వెంటనే దుబాయ్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు చెప్పారన్నారు. అయితే శ్రీదేవికి ఎలాంటి హృద్రోగ సమస్యలు లేవని గుండెపోటుతో చనిపోయిందంటే నమ్మలేకపోతున్నామని సంజయ్ తెలిపారు. శ్రీదేవి మరణవార్త విని వెంటనే దుబాయ్ బయలుదేరినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై దుబాయ్‌లోని భారత రాయబారి నవదీప్ సింగ్ స్పందించారు. కాగాశ్రీదేవి మృతితో ఆమె పెద్ద కుమార్తె జాన్వి కపూర్ తల్లడిల్లుతున్నారు. పెళ్లి వేడుక కోసం దుబాయ్ వెళ్లిన శ్రీదేవి గుండెపోటుతో అక్కడే మృతి చెందారు. ఈ వేడుకకు ఆమె తన భర్త బోనీ కపూర్, రెండో కుమార్తె ఖుషీ కపూర్‌తో కలిసి వెళ్లారు. జాన్వి 'దఢక్' సినిమా షూటింగ్ కోసం ముంబయిలోనే ఉండిపోయారు. దాదాపు అందరు బంధువులు పెళ్లి వేడుకల కోసం దుబాయ్‌కు వెళ్లారు. దీంతో జాన్వి ఇంట్లో ఒకటే ఉన్నారట. తల్లి మరణవార్త విన్న తర్వాత జాన్వి కుప్పకూలిపోయారు. ఆమెకు ధైర్యం చెప్పడానికి దర్శక, నిర్మాత కరణ్‌జోహార్ లోఖండ్‌వాలాలోని శ్రీదేవి ఇంటికి వెళ్లారు.

స్మృతి చిత్రాలు











శ్రీదేవి ఇక లేరు

● దుబాయిలో గుండెపోటుతో ఆకస్మిక మృతి ● శోకసంద్రంలో చిత్రపరిశ్రమ







దుబాయ్: అందానికి అందంగా నిలిచిన ప్రముఖ నటి శ్రీదేవి దుబాయ్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులతో మేనల్లుడి పెళ్లి వేడుకకు దుబాయ్‌కు వెళ్లిన శ్రీదేవి శనివారం అర్ధరాత్రి తరువాత ప్రాణాలు కోల్పోయారు. అప్పటివరకూ అక్కడున్న వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వెళ్లిన శ్రీదేవి ఆ తరువాత గుండెపోటు రావడంతో కుప్పకూలి చనిపోయినట్లు వెల్లడైంది. ఆమెను స్థానిక రషీద్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు.ఆదివారం తెల్లవారు జామునే ఈ విషాద వార్త తెలియడంతో దేశ విదేశాలలోని కోట్లాది మంది అభిమానులు తల్లడిల్లిపొయ్యారు. పలువురు సినిమా ప్రముఖులతో పాటు సామాన్యుల వర కూ అంతా చాలా సేపటి వరకూ ఈ వార్త నిజంకాదనే భా వించారు. అయితే బాల నటిగా వెండితెరకు వచ్చి, పదహారేళ్ల అమ్మాయిగా, తరువాత పాతికేళ్ల పడతిగా, ప్రేయసిగా, గృహిణిగా ఎన్నో వైవిధ్య భరిత చిత్రాలలో నటించి హీరోయిన్లలో తిరుగులేని సూపర్ స్టార్‌గా మారిన శ్రీదేవి ఇక లేరనే విషయం నిర్ధారణ అయింది. 55 సంవత్సరాల శ్రీదేవి ఆకస్మిక మరణాన్ని కుటుంబ సభ్యులు ధృవీకరించారు. భర్త బోనీకపూర్, కూతురు ఖుషీతో కలిసి పెళ్లి వేడుకకు వెళ్లిన సమయంలోనే శ్రీదేవి తిరిగిరాని లోకాలకు వెళ్లారు. జగదేకవీరుడు అతిలోక సుందరి సినిమాలో దేవకన్యగా నటించిన శ్రీదేవి మానవా అనే పలకరింపుతో , పలు చిత్రాలలో కంటి చూపులతో ఒలికించిన సోయగాలతో కోట్లాది మందిని అభిమానులుగా మలుచుకున్నారు. దక్షిణాదికి చెందిన ఈ నటి బహుభాషా నటిగా వెలిగి, బాలీవుడ్‌లో కూడా తన ఆధిక్యతను చాటుకున్నారు. మేనల్లుడు మోహిత్ మర్వా పెళ్లికి హాజరయ్యేందుకు శ్రీదేవి దుబాయ్ వెళ్లారు. 1978లో సోల్వా సావన్ సినిమాతో శ్రీదేవి బాలీవుడ్‌లో ప్రవేశించారు. బాలనటిగా కూడా తెలుగు, తమిళ సినిమాలలో నటించిన శ్రీదేవి ప్రముఖ తెలుగు, తమిళ, హిందీ సినిమా హీరోలతో జంటగా నటించి అందరిని మెప్పించారు. సోల్వా సావన్ తరువాత ఆమె ఐదేళ్లకు హిందీలో హిమ్మత్ వాలా సినిమాలో జితేంద్రతో హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా బ్రహ్మాండమైన రీతిలో విజయం సాధించడంతో ఇక ఆమె వెండితెరపై బంగారంగా మెరిసింది. ఆమె నవ్వులు జలతారు అంచుల వెన్నెలలుగా మారాయి. కమల్‌హాసన్‌తో ఆకలి రాజ్యం , మూంద్రాం పిరై (వసంతకోకిల)సినిమాలో నటించిన శ్రీదేవి అమితాబ్ బచ్చన్‌తో కూడా పలు చిత్రాలలో నటించారు. వసంత కోకిలలో బుద్ధిమాంద్యం ఉన్న యువతి పాత్రలో జీవించిన శ్రీదేవికి పలు అవార్డులు వచ్చాయి. లోకం తెలియని మనస్సుతో ఉండే ఒక యువతి హావభావాలు, ఆమె ప్రకృతి పట్ల కనబరిచే ఆత్మీయత వంటి వాటిని తన నటనా ప్రతిభతో శ్రీదేవి పండించింది. ప్రేమాభిషేకం సినిమాలో శ్రీదేవి పాత్ర అందరినీ ఆకట్టుకుంది. తెలుగులో అత్యధికంగా హీరో కృష్ణతో జంటగా నటించిన శ్రీదేవి తరువాత యువహీరోలతో కూడా జోడిగా జోరుగా నటించింది. రామ్ గోపాల్ వర్మ సినిమా క్షణక్షణంలో ఆమె నటన వెండితెరకు జిలుగులను అందించింది. హిందీలో శ్రీదేవి ఉంటే సిరి పంటనే అనే పేరు తెచ్చుకున్నారు. సిరిమల్లెపువ్వా సిరిమల్లె పువ్వా అనే పాట, నీ కళ్లు చెపుతున్నాయి. అనే పలు పాటలు ఆమె అందానికి చరణాలుగానే నిలిచాయి. భాషాతీతంగా అందరి గుండెల్లో గుచ్చుకున్నాయి. హిందీలో మవాలీ, తోఫా, మిస్టర్ ఇండియా, చాందినీ వంటి సినిమాలు ఆమెను సూపర్ స్టార్‌గా నిలిపాయి. వసంతకోకిల సద్మాగా హిందీలో వచ్చింది. ఛాల్‌బాజ్ వంటి పలు సినిమాలు ఆమె ప్రతిభకు అద్దం పట్టాయి. గత ఏడాది ఆమె చివరి సినిమా వచ్చింది మామ్ అనే ప్రతీకార ఇతివృత్తపు సినిలో శ్రీదేవి నవాజుద్దీన్ సిద్ధిఖీ, అక్షయ్ ఖన్నాతో కలిసి నటించారు. అంతకు ముందు ఇంగ్లీషు వింగ్లీష్ సినిమాలో మధ్య తరగతి మహిళగా ఇంగ్లీషు నేర్చుకోవాలనేతపన గల మహిళగా ఆమె చేసిన నటనకు ఆద్యంతం మంచి స్పందన దక్కింది. ఈ సినిమా కూడా మంచి లాభాలను తెచ్చిపెట్టింది. కేవలం దక్షిణాది సినిమాలకే పరిమితం కాకుండా ఆమె బాలీవుడ్ ప్రవేశంతో యావద్భారత ప్రఖ్యాత నటిగా పేరొందారు. తమిళ సినిమాలో బాల నటిగా 1969లో తునైవాన్ సినిమాలో తొలిసారిగా సినిమాలో నటించారు. తరువాతి ఏడాదే హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. శ్రీదేవికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు జాహ్నవీ కపూర్ ప్రస్తుతం హిందీ సినిమాల ద్వారా సినిమా రంగానికి పరిచయం అవుతోంది. ముంబైలో ఒక సినిమా షూటింగ్‌లో జాహ్నవీ ఇప్పుడు ఉన్న సమయంలోనే భర్త బోనీ, చిన్నకూతురు ఖుషీ వెంట ఉన్నప్పుడే శ్రీదేవి మృతి చెందారు. గుండెపోటుతో కుప్పకూలి చనిపోయినట్లు తొలుత వార్తలు వెలువడినప్పటికీ కుటుంబ సభ్యులు ఆ తరువాత ఆమెకు గుండె సంబంధిత జబ్బులు ఏమీ లేవని, ఇంతకు ముందెన్నడూ ఈ సమస్య రాలేదని తెలిపారు. షారూక్ ఖాన్ హీరోగా రాబోయే జీరో సినిమాలో శ్రీదేవి ప్రత్యేక పాత్రలో నటించారు. ఆమె పాత్ర చిత్రీకరణ చాలా రోజుల క్రితమే పూర్తి అయింది. ఈ సినిమా ఈ ఏడాది విడుదల అవుతుంది.




రాష్ట్రపతి, ప్రధాని ప్రముఖుల సంతాపాలు

ప్రముఖ నటి శ్రీదేవి మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ ఇతర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. విభిన్న విశిష్ట పాత్రలను పోషించి ఆమె వెండి తెరకు ఖ్యాతి తెచ్చారని ప్రశంసించారు. ఆమె అకాల మరణం తనను కదిలించివేసిందని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. తెలుగు నటిగా ప్రఖ్యాతి వహించిన శ్రీదేవి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎందరో అభిమానులను సంపాదించుకున్న నటి శ్రీదేవి మరణం దిగ్భ్రాంతిని కల్గించిందని ఇరువురు సిఎంలు తెలిపారు. పద్మశ్రీ పురస్కారం పొందిన శ్రీదేవి మృతి పట్ల విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, ప్రముఖ నటి హేమామాలిని, పశ్చిమ బెంగాల్ సిఎం మమత బెనర్జీ సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ముంబైకి భౌతికకాయం ?


పెళ్లి వేడుకకు వెళ్లి ఆకస్మికంగా మృతి చెందిన శ్రీదేవి భౌతిక కాయాన్ని దుబాయ్ నుంచి ముంబైకి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లు భారతీయ ఎంబసీ వర్గాలు తెలిపాయి. అర్ధరాత్రి పెళ్లి వేడుక తరువాత ఆమె కుటుంబ సభ్యులతో కలిసి జుమైరా ఎమ్మిరేట్స్ టవర్స్ హోటల్‌లో బస చేశారు. అర్ధరాత్రి బాత్రూంలో కళ్లు తిరిగి పడిపోయినట్లు, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెంది ఉన్నట్లు గుర్తించారని వెల్లడైంది. గుండెపోటుతోనే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఆమె పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టు మార్టం నివేదిక ఇవ్వడానికి 24 గంటలు పడుతుందని వెల్లడైంది. దీనితో ఆమె మృతదేహం తరలింపులో జాప్యం జరిగింది. దుబాయ్‌లోని భారతీయ దౌత్యవర్గాలు కలుగచేసుకుని భౌతికకాయాన్ని భారత్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం శ్రీదేవి భౌతిక కాయం ప్రత్యేక విమానంలో ముంబై చేరుకుంటుంది. అంత్యక్రియలు జుహులోని శాంతాక్రజ్ శ్మశానవాటికలో జరుగుతాయి. ఇప్పటికే ఆమె తుది దర్శనం కోసం వేలాది మంది శ్రీదేవి చార్‌బంగ్లా నివాసం వద్ద గుమికూడారు. శ్రీదేవి ఇంటి నుంచి భౌతిక కాయాన్ని తొలుత మెహబూబా స్టూడియోకు తరలిస్తారు. అక్కడ ప్రముఖులు, అభిమానుల నివాళుల తరువాత శ్మశాన వాటికకు ఊరేగింపుగా భౌతికకాయాన్ని తరలిస్తారని వెల్లడైంది.

స్టార్‌డమ్‌కు ప్రతిరూపం : కమల్



టీనేజ్ నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని చూశాను. స్టార్‌డమ్‌కు ఆమె అర్హురాలే. ఆమె చనిపోయిందని తెలియగానేఆఖరిసారి నేను శ్రీదేవిని కలిసిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారి నా కళ్ల ముందు మెదిలాయి. 'సద్మా' చిత్రంలోని లాలిపాట ఇంకా వినపడుతూనే ఉంది. మనం శ్రీదేవిని చాలా మిస్సవుతాం' 'ఓ అమాయక అమ్మాయి నుంచి అద్భుతమైన మహిళగా ఆమె ఎదిగిన తీరుకు సాక్ష్యం నేను.

లెజెండ్‌ను కోల్పోయింది: రజనీ



అతిలోక సుందరి శ్రీదేవి మృతి వార్త తనకు దిగ్భ్రాంతికి గురిచేసిందని తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీదేవి మంచి నటి అని, ఒక మంచి స్నేహితురాలిని కోల్పోయానని, చిత్ర పరిశ్రమ ఒక లెజెండ్‌ను కోల్పోయిందన్నారు. శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆమె సినిమాలు చూస్తూ పెరిగాం



శ్రీదేవి సినిమాలు చూస్తూ పెరిగాం.ఆమె లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నా. నాకు మాటలు రావడం లేదు. ఎలా స్పందించాలో తెలియడం లేదు. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.'

ఆకస్మిక మరణం కలచివేసింది



'శ్రీదేవి మృతి నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె నటనకు, స్వభావానికి పెద్ద అభిమానిని. ఆమె కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలుపుతున్నా. ఆమె లక్షలాధి మంది అభిమానుల్లో ఒకడిగా నివాళులర్పిస్తున్నా. ప్రేమ, గౌరవంతో మిమ్మల్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకునే ఉంటాం మామ్'.

షాక్‌కు గురయ్యా : హేమమాలిని



'శ్రీదేవి చనిపోయారని తెలిసి షాకయ్యాను. అసలు అనుకోలేదు. ఆమె నటనతో పరిశ్రమలో చాలా మందిని ప్రభావితం చేశారు. అద్భుతమైన నటి. చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది.'

అనుబంధం మరువలేనిది



'శ్రీదేవితో నా అనుబంధం ఈనాటిది కాదు. నా సూపర్ హిట్ సినిమాల్లో ఎక్కువగా హిందీలో రీమేక్ చేసింది బోనీ కపూరే. ముంబయి వెళ్ళినప్పుడల్లా శ్రీదేవి ఇంటికి వెళ్లకుండా ఎప్పుడూ వెనుదిరగలేదు. అటువంటి మంచి మనిషి, అద్భుతమైన నటి.

పెరుగుతోన్న రైతుల ఆత్మహత్యలు

లోపభూయిష్ట విధానాలే కారణం

ఆత్మహత్యల నివారణకు సమిష్టి పోరు

మానవతావాదులు, స్వచ్ఛంధ సంస్థల పిలుపు



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా యని, లోపభూయిష్టమైన ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని, రైతుల ఆత్మహత్యలను నిలువరించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పాలకుల విధానాల్లో ఎలాంటి మార్పు లేదని మానవతావాదులు, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. 'కేరింగ్ సిటిజన్ కలెక్టివ్' ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని తెలుగు విశ్వవిద్యాల్యంయలో రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలతో 'ఆత్మీయ సమ్మేళనం' ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మానవతావాదులతో పాటు పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. సీనియర్ సంపాదకులు, మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ పొత్తూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యల నివారణ పట్ల ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు రైతులకు సంబంధించిన అంశాలను తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలన్నారు. ప్రస్తుతం అందుతున్న సహాయం సరిపోవడంలేదని, అందరికీ అందడం లేదని ఆయన ఆరోపించారు. బాధితులను గుర్తించి అర్హులైన వారికి సచ్ఛంధ సంస్థలే సహాయం అందించడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. ఆత్మీయ సమావేశ చొరవ తీసుకున్న సిసిసిని ప్రశంసించారు. పదవీ విరమణ చేసిన ఐఎఎస్ అధికారి కెఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఆత్మహత్యలకు అనేక కారణాలున్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి మొదటిసారిగా నివేదికను అందించానని తెలిపారు. కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వమే అయినా నివేదికలోని అంశాలను అమలు చేసే పరిస్థితిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో వ్యవసాయానికి ఇంత భారీగా పద్దులను కేటాయించినట్లు చేస్తున్న ప్రకటనలతో రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. రైతులకు రుణ మాఫీ కల్పించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నానని, ఇటీవల కాలంలో సాకారమవుతోందని అన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రవీందర్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ నినాదం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, నేటి ప్రజాప్రతినిధులు సమాజం కోసం పనిచేయడం లేదని విమర్శించారు. కేరింగ్ సిటిజన్ సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ రమా మెల్కోటే మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావానికి దారి తీసిన పరిస్థితులతో పాటు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మృతి చెందిన రైతుల కుటుంబాలు నష్టపరిహారం కోసం ఎదురు చూసే పరిస్థితులు తలెత్తరాదని, ఆత్మహత్యలే జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం యావత్తు రైతాంగం సమిష్టి ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా రైతాంగాన్ని ముందుకు నడిపించేందుకు స్వచ్ఛంధ సంస్థలు చొరవ చూపాలన్నారు. ప్రముఖ యాంకర్, సినీ నటి ఝాన్సీ వ్యాఖ్యతగా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు బాధితులకు కొంత మొత్తంలో నగదును చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు కొండల్‌రెడ్డి, కిరణ్ విస్సా, భానుజా, బెజవాడ విల్సన్‌లతో పాటు మరింత మంది మాట్లాడారు.

లక్ష్యాన్ని అధిగమించిన భూ రిజిస్ట్రేషన్

● **పన్నుల వసూళ్లలో గతేడాదికంటే మెరుగు**

మన తెలంగాణ హైదరాబాద్ : వివిధ రకాల పన్నుల వసూళ్లలో లక్ష్యానికి చేరువకాలేకపోయినా భూముల రిజిస్ట్రేషన్లు, ఎక్సయిజ్ ఆదాయంలో మాత్రం రాష్ట్రం అంచనాలను మించి ఫలితాలను సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి మూడు వేల కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా పది నెలల కాలం (జనవరి 2018 నాటికి)లోనే రూ. 331.83 కోట్ల మేర (111.06%) అదనపు ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలానికి ఈ రంగం నుంచి ఆర్జించిన ఆదాయం రూ. 2921.38 కోట్లు (లక్ష్యంలో 68%) మాత్రమే. గత ఆర్థిక సంవత్సరానికి మొత్తం లక్ష్యం రూ. 4292 కోట్లు కాగా రూ. 3821.66 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి మాసాల్లో మరో రూ. 900 కోట్లు ఆర్జించవచ్చని అంచనా. అదే విధంగా ఎక్సయిజ్ ఆదాయం సైతం ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ. 9000 కోట్లు మాత్రమే ఆర్జించాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేయగా జనవరి చివరి నాటికే (పది నెలల కాలానికి) రూ. 15000 కోట్లు దాటింది. ఈ రెండు రంగాల నుంచి సమకూరిన ఆదాయం లక్ష్యంకంటే ఎక్కువగానే ఉంది. కాగ్‌కు సమర్పించిన గణాంకాలను పరిశీలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి సేల్స్ టాక్స్ (పెట్రోలియం ఉత్పత్తులు, పొగాకు తదితరాలు) ద్వారా రూ. 46,500 కోట్లను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నా పది నెలల కాలానికి రూ. 20,882 కోట్లు మాత్రమే ఆర్జించింది. గతేడాది జూలై నుంచి జిఎస్టి అమలులోకి రావడంతో పది నెలల కాలానికి రూ. 9063 కోట్ల మేరకు ఆదాయం లభించింది. జిఎస్టితో పాటు వ్యాట్‌ను కలుపుకున్నట్లయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పది నెలల కాలానికి రూ. 29946.33 కోట్లు సమకూరినట్లయింది. లక్ష్యంలో 66.4% మాత్రమే పన్ను వసూలైంది. రానున్న రెండు నెలల్లో నెలవారీ సగటు ప్రకారం వ్యాట్, జిఎస్టీ వసూళ్ళు అంచనా మేరకు రూ. 5000 కోట్లు ఉన్నా ఇంకా పదివేల కోట్ల రూపాయల మేరకు వ్యత్యాసం ఉంటుంది. ఇక కేంద్రం నుంచి రుణం, గ్రాంట్ల రూపంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ. 26069 కోట్ల మేరకు పొందాలని వేసుకున్న అంచనాలో ఇప్పటికేరూ. 24140 కోట్ల మేరకు (92.5%) సమకూర్చుకుంది. రాష్ట్ర బడ్జెట్ అంచనాల ప్రకారం వివిధ రకాల ఆదాయ వనరుల ద్వారా రూ. 1.44 లక్షల కోట్ల మేరకు సమకూర్చుకోవాలని ప్రభుత్వం అంచనా వేసుకోగా ఇప్పటివరకు రూ. 99360 కోట్లు మాత్రమే సాధ్యమైంది. రాష్ట్రానికి రావాల్సిన రుణాలను వసూలు చేసుకోవడంలో కేవలం 1.28% ప్రగతి మాత్రమే నమోదైంది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి రూ. 5807 కోట్లను వసూలు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా కేవలం రూ. 74 కోట్లను మాత్రమే వసూలు చేయగలిగింది. రెవిన్యూ వసూళ్ళలో గతేడాదికంటే స్వల్ప మెరుగుదల కనిపించినా లక్ష్యానికి మాత్రం దూరంగానే (58.47%) ఉంది. ఇక ఖర్చులు మాత్రం గతేడాది కంటే స్వల్పంగా పెరిగాయి. గతేడాది ఇదే పది నెలల కాలానికి రూ. 81709 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయగా ఈసారి మాత్రం రూ. 87565 కోట్లను ఖర్చు చేసింది. ఉద్యోగులకు వేతనాలు, అప్పులపై వడ్డీల చెల్లింపుకు గతేడాదికంటే ఎక్కువ ఖర్చు చేసినందున మొత్తం ఖర్చులో ఈ పెరుగుదల కనిపించింది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి రూ. 4571 కోట్ల మేర రెవిన్యూ మిగులును ప్రభుత్వం అంచనా వేసినా పది నెలల కాలానికి ఇది రూ. 3643 కోట్ల లోటులో ఉంది. గతేడాది సైతం 11 నెలల పాటు రెవిన్యూ లోటు కనిపించినా చివరి నెలలో ఆర్జించిన ఆదాయంతో మిగులు సాధ్యమైంది. ఈ సంవత్సరం కూడా ఇది పునరావృతం అవుతుందని ఆర్థికశాఖ అంచనావేస్తోంది.






పురుషోత్తమరెడ్డి ఇంట్లో ఎసిబి సోదాలు

రూ. 50లక్షల ఆభరణాలు స్వాధీనం

మన తెలంగాణ/హైదరాబాద్:హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి ఇంట్లో ఆదివారం ఎసిబి అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.50 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలు, వజ్రాలు, రూ.20 లక్షల విలువైన చీరలు, రూ.70 వేలు విలువైన విదేశీ మద్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌లో ఉన్న పురుషోత్తమరెడ్డిని 23వ తేదీన ఎసిబి అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. మూడు రోజుల విచారణలో ఆదాయానికి మించిన ఈ కేసు దర్యాప్తులో ఎసిబి అధికారులు కొంత పురోభివృద్ధి సాధించారు. బ్యాంక్ లాకర్‌లో లభించిన నగల దుకాణాల రసీదులకు సంబంధించి ఆభరణాలు లభించినట్లయింది. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బినామీ పేర్లపై పెట్టిన పెట్టుబడులకు సంబంధించిన అంశాలకు సంబంధించి అతని నుంచి కొంత మేర సమాచారం రాబట్టారు. పురుషోత్తమరెడ్డిని 28వ తేదీ వరకు ఎసిబి అధికారులు విచారించనున్నారు.చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై సోమవారం ఎసిబి ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరుగనుంది.



జీవితానుభవ శిల్పి


ఆర్వీ రామారావ్
9676999856

మునిపల్లె రాజు ప్రత్యేకత ఏమిటంటే కథా రచనలో ఆయన శిల్పం కాలక్రమంలో అలవడింది అనడం కన్నా మొదటి నుంచే ఉత్తమ శిల్పం కనిపిస్తుందనడం న్యాయం. ఆయన రచన పదునెక్కడానికి ఆయన దృక్పథంలోని స్పష్టత ఎంత కారణమో విస్తృత అధ్యయనం అంతకన్నా ఎక్కువ కారణం. అధ్యయనం లోపిస్తే కథ పలచబారుతుంది అనే వారు. రచనకు సిద్ధాంత ప్రాతిపదిక చాలా అవసరమని చెప్తూనే అది నినాదప్రాయం కాకూడదనే వారు. రచయిత అనుభూతికి, అనుభవానికి పదును పెట్టేది శిల్పం అని రాజు అనే వారు. శిల్పం అలవడడానికి దగ్గరి దారి అధ్యయనమేననే వారు. ఆయన రాసింది 70 కథలు, ఒకే నవల, రెండు వ్యాస సంకలనాలు. కాని అవి రచయితలకు పాఠ్య గ్రంథాలు.


సమాజ వాస్తవికతను చిత్రించే రచయితలు, వాస్తవికతకు ఏ మాత్రం సంబంధం లేకుండా ఊహాలోకాల్లో విహరించే రచయితలు అని విభజన రేఖ గీసి చర్చించవలసిన రోజులకు కాలం చెల్లి దశాబ్దాలు గడిచింది. సమాజ చిత్రణకు అనుసరిస్తున్న విధానం ఏమిటి అన్నదే ప్రస్తుత సాహిత్యానికి తూనిక రాళ్లు. ఎందుకంటే ఊహాలోకాల్లో ఓలలాడించే సాహిత్యకారుల అవశేషాలు ఇంకా అక్కడక్కడ మిగిలే ఉన్నా వారిని పట్టించుకోవాల్సిన దశను సమాజం ఎప్పుడో దాటేసింది.

ఫిబ్రవరి 24వ తేదీన కన్ను మూసిన ప్రసిద్ధ కథకుడు మునిపల్లె రాజు సాహిత్య రంగంలో జరిగిన ఈ వాదవివాదాలకే కాదు రెండు ప్రపంచ యుద్ధాలకు, సాహిత్య రంగంలో గత మూడు దశాబ్దాలుగా వచ్చిన స్త్రీవాద, మైనారిటీవాద, దళిత వాదాలను ప్రత్యక్షంగా చూసిన వారు. ప్రపంచీకరణ భూతం ఊపిరి సలపనివ్వకుండా ఆవహిస్తున్న దశకు ఆయన ప్రత్యక్ష సాక్షి.

మునిపల్లె రాజు 1930ల ఆర్థిక మాంద్యం వల్ల కుదేలైపోయిన ఆర్థిక వ్యవస్థ దుష్ప్రభావాలను స్వయంగా అనుభవించారు. మునిపల్లె రాజు తండ్రి వ్యాపారం చేసే వారు. కలిగిన కుటుంబమే. కాని 1930 నాటి ఆర్థిక మాంద్యం ఆయన వ్యాపారాన్ని కుంగదీసింది. సంపద మాయమైంది. ఆ దిగులుతోనే మునిపల్లె రాజు తండ్రి అకాల మృత్యువు కాటుకు బలయ్యారు. రాజు కుటుంబం అభ్యుదయ భావాలున్నది. రాజు తండ్రి సామాజిక ఉద్యమాల అభిమాని. సామాజికరాజకీయ రంగంతో సంబంధం ఉన్న కుటుంబం. వితంతు పునర్వివాహాలను, కళావంతుల సంస్కరణను సమర్థించిన సంప్రదాయం ఉన్న కుటుంబం.

మునిపల్లే రాజు పుట్టింది తెనాలికి దగ్గర్లోని గరికపాడులోనైనా చదువు కోసం పొన్నూరు, తెనాలి మొదలైన చోట్ల గడిపారు. తెనాలి ఆ రోజుల్లో సాంస్కృతిక కేంద్రం. సాహితీ రంగంలో దిగ్గంతలైన గుడిపాటి వేంకటాచలం, కొడవటిగంటి కుటుంబ రావు, జి.వి.కృష్ణా రావు, త్రిపురనేని గోపీచంద్ వంటి వారికి ఆటపట్టు. మునిపల్లె కుటుంబానికి వీరందరితో సంబంధాలు ఉండేవి. కొడవటి కుటుంబరావు అన్నయ్య వెంకట సుబ్బయ్య అప్పటికే హిమాలయాలకు వెళ్లిపోయారు. కాని ఆ విషయం విన్న రాజు పదే పదే ఆ విషయం ప్రస్తావిస్తూ ఉండే వారు. రాజు అన్నయ్య మునిపల్లె పిచ్చి రాజు వీర కమ్యూనిస్టు. సమాజ సేవకు అంకితమైపోయారు. పిన తండ్రి కొడుకు మునిపల్లె రామా రావుదీ అదే తంతు. విద్యాభ్యాసానికి బెనారస్ వెళ్లి కమ్యూనిస్టుగా తిరిగొచ్చిన బాబతు. తండ్రి మరణం తర్వాత మునిపల్లెను పేదరికం ఆవహించినా ఆలోచనల్లో సంపద్వంతమైన వాతావరణమే ఉంది. మార్క్సిజం దగ్గర నుంచి సకల తాత్విక ధోరణుల గురించిన చర్చలు ఆయనకు వినిపించేవి.

గ్రామీణ జీవితంలో వస్తున్న మార్పులు, చదువుకోసమో, ఉపాధికోసమో పట్టణాలకు జనం తరలిపోవడం, మానసిక అంతస్సంఘర్షణ, వివాహేతర సంబంధాలు, కులాంతర వివాహాల ప్రభావం, స్వాతంత్ర్య పోరాట కాలంలో కొన్ని వర్గాల త్యాగం మొదలైనవన్ని రాజు గమనించారు. ఇంట్లో చాలా పుస్తకాలు అందుబాటులో ఉండేవి కనక ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. తండ్రి మరణం తర్వాత ఒంటరి తనం వెంటాడింది. అంతర్ముఖుడిగా మారిపోయారు. కాని నిరాశలో కూరుకుపోకపోవడం రాజు తాత్విక బలానికి సంకేతం. నైరాశ్యం దరిజేరకుండా పుస్తకమే ఆలవాలమైంది. తన, తన కుటుంబ పరిస్థితి గురించి దీర్ఘాలోచన చేసే వారు. 'నేనెవరిని, నా అస్తిత్వం ఏమిటి' అన్న మధనం ఆయనకు చిన్న నాటే అలవడింది. అదే మానవ జీవిత తత్వాన్ని గ్రహించడానికి ఉపకరించింది. ఈ చింతనే ఆయన సాహిత్యంలో సామాజిక వాస్తవికతను, ఉదాత్త తాత్వికతను మేళవించడానికి తోడ్పడింది. ఆయన తాత్విక ధోరణిలో మార్క్సిజం నుంచి ఆధ్యాత్మికవాదం దాకా అనేక పాయలు కనిపిస్తాయి. కాని ఆయన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆలోచనా గాఢత కనిపిస్తుందే తప్ప భావవాద చాయలు ఉండవు.



మునిపల్లె రాజుకు చిన్ననాటి మూకీ సినిమాల నుంచి నేటి అధునాతన చలన చిత్రాల దాకా ఆసక్తే. సత్యాగ్రహం చేసే వారి మీద పోలీసుల ప్రతాపం చూసి తల్లడిల్లి పోయే వారు. భగత్ సింగ్ లాగా బ్రిటిష్ వారిని దేశం నుంచి పారదోలాలన్న భావన వ్యక్తం చేసే వారు.

రాజు తండ్రి రంగస్థల ప్రియులు. స్థానం నరసిమ్హా రావు, మాధవ పెద్ది వెంకట్రామయ్య, తురగా పుండరీకాక్షుడు, మీసాల కృష్ణుడు, బెల్లంకొండ సుబ్బా రావు, రామ తిలకం, వేమూరి గగ్గయ్య మొదలైన వారి నటనా వైదుష్యం రాజుకు నిత్యకృత్యంగా తెలుసు. మరో వేపున వంట మనిషి లక్ష్మి దేవమ్మ చేత ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలు పాడించుకుని వినే వారు. బాబాయి వెంకటప్పతో కలిసి చలం ఇంటికెళ్లినప్పుడు అక్కడున్న పుస్తకాలు చూసి మురిసిపోయే వారు. చెడుగుడు ఆటలో దిట్ట. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు జమ్మలమడక రామ మూర్తి ప్రోత్సాహంతో సాహితీ సృజన మీదకు దృష్టి మళ్లింది. చింతా దీక్షితులు కథను అనుసరించి కథ రాసి చదువుకునేటప్పుడు వెలువరించే వివేక వర్ధని లిఖిత పత్రికలో ముద్రించారు.

కుటుంబ పోషణ భారం పైనబడడంతో విశాఖ పట్నం వెళ్లి మిలిటరీ హోటల్లో పనికి కుదిరారు. అదే చివరకు ఆయనను రక్షణ శాఖ ఉద్యోగిని చేసింది. అక్కడ సైనికులతో కలిసి మెలిసి ఉండే వారు. ఇంగ్లీషు సైనికాధికారులతో చర్చించే వారు. బ్రిటిశ్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన కెప్టెన్ స్మిత్ తో జరిపిన సుదీర్ఘ సంభాషణల గురించి నోట్స్ రాసి పెట్టుకున్నారు. సినిమా చూసినా, పుస్తకం చదివినా ఇలా నోట్స్ రాసుకోవడం మునిపల్లె రాజుకు అలవాటు. కాని అవి దాచే అలవాటు మాత్రం లేదు. దాచకపోవడం డబ్బు విషయంలో కూడా లేదు. డబ్బు ఏమైనా మిగిలితే గుప్త దానాలు చేసే వారు. రెండో కంటికి తెలియకుండా పేద విద్యార్థులను ఆదుకునే వారు. లక్షలాది మందికి బీమా సదుపాయం లేనప్పుడు తనకెందుకు అని జీవితాంతం బీమా తీసుకోలేదు. రెండు జతల దుస్తులకన్న ఎక్కువ కుట్టించుకోవడం పాపం అనుకునేంత సాదా సీదా మనస్తత్వం మునిపల్లె రాజుది.

ఉద్యోగ రీత్యా దేశంలోని వివిధ ప్రాతాలలో తిరిగినందువల్ల ఆయనకు తెలుగు సాహిత్యం కన్నా విదేశీ సాహిత్యం ఎక్కువగా చదివే అవకాశం వచ్చింది. రష్యన్ ప్రసిద్ధ రచయితలతో పాటు ఇల్యా ఎహ్రెన్ బర్గ్, ఆప్టన్ సిక్లేర్, గోర్కీ, జేంస్ జాయ్స్ మొదలైన వారి రచనలన్నింటినీ చదివేశారు. అనిసెట్టి సుబ్బారావు సన్నిహిత మిత్రుడు. ఆయన బిచ్చగాళ్ల పదాలు, విశ్వనాథ సత్యనారాయణ కిన్నెరసాని పాటలు, దాశరథి మంజీర అంటే ప్రాణం. తెలంగాణ సాయుధ పోరాటం మీద మునిపల్లె రాజు నవయుగ పత్రికలో మునీంద్ర పేరుతో పెద్ద గేయం ప్రచురించారు.

మునిపల్లె రాజు ప్రత్యేకత ఏమిటంటే కథా రచనలో ఆయన శిల్పం కాలక్రమంలో అలవడింది అనడం కన్నా మొదటి నుంచే ఉత్తమ శిల్పం కనిపిస్తుందనడం న్యాయం. ఆయన రచన పదునెక్కడానికి ఆయన దృక్పథంలోని స్పష్టత ఎంత కారణమో విస్తృత అధ్యయనం అంతకన్నా ఎక్కువ కారణం. అధ్యయనం లోపిస్తే కథ పలచబారుతుంది అనే వారు. రచనకు సిద్ధాంత ప్రాతిపదిక చాలా అవసరమని చెప్తూనే అది నినాదప్రాయం కాకూడదనే వారు. రచయిత అనుభూతికి, అనుభవానికి పదును పెట్టేది శిల్పం అని రాజు అనే వారు. శిల్పం అలవడడానికి దగ్గరి దారి అధ్యయనమేననే వారు. ఆయన రాసింది 70 కథలు, ఒకే నవల, రెండు వ్యాస సంకలనాలు. కాని అవి రచయితలకు పాఠ్య గ్రంథాలు.

ఆయన కుటుంబ నేపథ్యం, విస్తృత అధ్యయనం ఆయన జ్ఞాన సంపన్నుడయ్యేలా చేసింది. తద్వారా అలవడిన సంస్కారం ఆయనను పరోపకారిగా, ప్రేమాస్పదుడిగా, మానవతవాదిగా దిద్ది తీర్చింది. రచయిత వర్తమానానికే కాదు భావి తరాలకు కూడా బాధ్యత వహించాలి అనే వారు మునిపల్లె రాజు. ●

ఆర్థిక సంక్షోభం



బ్యాంకుల జాతీయీకరణ
ప్రజల భాగస్వామ్యంతో బ్యాంకుల ఎదుగుదల
మూలధన విలువలు ఇంతింతలుగా పెరుగుదల
యం.యల్.ఎ, యం.పి. మంత్రుల ద్వారా రుణ వితరణ
ప్రభుత్వరంగ సంస్థలలో బహునాయకత్వం రాజకీయ జోక్యం
ప్రభుత్వరంగ పరిశ్రమలు ఖాయిలా పడి దివాళా
ముంచిన నాయకులే మంత్రులు, ముఖ్యమంత్రులుగా
తళతళా రాజకీయ నాయకుల, మంత్రుల,
సహాయాల ద్వారా కార్పొరేట్‌ల అభివృద్ధి
చాప కింద నీరులా కనిపించని పరిస్థితి
బంగారం తాకట్టు పెట్టే దీనత్వం
ఎల్‌పిజితో 51శాతం కన్నా తక్కువగా వైద్యం
లొసుగులతో హర్షద్, పారీఖ్ వైఖరులతో దైన్యం
నల్లధనపు మూటలతో ఆర్థికరంగం కుదేలు.
ఇంటికి తెస్తాం అభివృద్ధి చేస్తాం, వాగ్దానాల వాడి
నోట్ల రద్దు బ్యాంకుల ఎఫ్.డి.లపై రుద్దిన దుర్దినాల
మోడీ సహారా, మాల్యా, నీరబ్‌ల దోపుకపు దాడి
కుదేలై కూలబడుతున్న బ్యాంకుల గాడి
భరోసా తప్పి నమ్మకం కోల్పోయిన ఆర్థిక వ్యవస్థ
లక్ష రుణానికి యక్ష ప్రశ్నలతో సామాన్యుడి అవస్థ
వేల కోట్ల రూపాయలతో ఉడాయించే మోసగాళ్ళ చే దురవస్థ
నమ్మని నిజం, బ్యాంకులు నిర్ధనం.
వెనుకటి వేలిముద్రలకై పయనం
రిజిస్ట్రేషన్ వ్యవస్థ కుంభకోణాల మయం
వెనుకటి రీతిగా కాగితాలు రాయించుకునేదిశగా జనం.
చేతులు, ఒళ్లు కాలాక ఆకులు పట్టుకునే ప్రభుత్వ ప్రయత్నంలో
లక్షల కోట్లు కొల్లగొట్టుబడుతున్నా ప్రభుత్వం అలసత్వం
దేశంలో దొంగలు పడ్డారని యువ ఉద్రేకాల సమరం
మతతత్వాల ప్రభుత్వ వత్తాసుతో దేశం అతలాకుతలం
కులమతాల చిచ్చులాటలతో దేశానికి పడ్తున్న చీడ
ఏ దారిన ఎటుపోతుందో తెలియని ఈ దేశపు జాడ

డా॥ కాసర్ల రంగారావు
9866837741

పునరుత్థానం

సాధనా సంపత్తి సమస్తం నీ స్వాధీనం
సకలాస్త్ర శస్త్ర సైన్యం సర్వత్రా సమాయత్తం
మా పిట్ట ప్రాణాలు ఏమూలకు?
నిను తేరిపారజూచే ప్రశ్నే ఏమేరకు?
అయినా భయపడే వీలుండని జలపాతం మాబతుకు
అనాదిగా కొనసాగే కొలిమిలోని ఇనుము
పీల్చి పిప్పి చేస్తూ ఈసడింపుగా నువు పిలుచుకొనే అలగాజనం
విచ్చు కత్తుల పహారాలో పట్టుపాన్పులపైనా
కునుకు పట్టని పనికిమాలిన సరుకు నువ్వు
వెచ్చనెత్తుటి ప్రవాహమై ఎచ్చటాగని ప్రాణ శక్తి మేము
ప్రతి క్షణం ప్రమాదాల్లో పచ్చని పల్లె పట్టులం మేము
బలిదానం పునరుత్థానం పరంపరాగత జీవన విధానం మేమే!

రాము ఇటిక్యాల్ 8106561671

కథానికల్లో పాఠకుడుంటాడు

ముఖాముఖిలో అంబల్ల జనార్ధన్

తన మూలాలు తెలంగాణలో ఉన్నా, పుట్టి పెరిగింది ముంబయి మహానగరంలోనే. అక్కడ ఇష్టంతో తెలుగు భాషాభ్యాసం చేసి, తెలుగు వారి జీవితాల్ని ఆకళింపు చేసుకొని, తెలుగు కథా ప్రక్రియలో తనదైన శైలిలో దూసుకుపోతున్న ముంబయి వాసి అంబల్ల జనార్ధన్. ఆయన అనేక కథలు రాశారు. అవన్నీ ఆయన జీవితానుభవం నుండి దూసుకువచ్చినవే. వాటికి పోటీలల్లో బహుమతులు వచ్చాయి. మరాఠీ భాషలో అనువాదితాలై పాఠ్యపుస్తకాల్లో చేర్చనైనాయి. అంబల్ల జనార్ధన్‌కు ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ, మరాఠీ, తెలుగు భాషల్లో ప్రావీణ్యం ఉంది; ఐనా తెలుగులోనే కథలు రాయడానికి ఇష్టపడతారు. కథలు, కవిత్వం రాయడంలో నిపుణత సాధించిన ఆయన ముంబయి మహానగరాన్ని, తెలంగాణ పల్లె జీవితాన్ని సమానంగా గౌరవిస్తాడు. ముంబయిలో స్థిర నివాసియై తెలుగు భాషా సేవలో నిమగ్నమవుతున్న అంబల్ల జనార్ధన్‌తో మన తెలంగాణ 'కలం' పేజీ కాస్సేపు ముచ్చటించింది.

? ముంబయి నగరంలో పుట్టి పెరిగిన మీకు తెలుగు భాషాభ్యసనం ఎట్లా జరిగింది?

! ఔను, ముంబయి నడిబొడ్డులోని లోయర్ పరేల్ ప్రాంతంలో 1950లో పుట్టాను. బట్టల మిల్లుల రణగొణల మధ్య పెరిగాను. నేను పుట్టకముందే మా తల్లిదండ్రులు నిజామాబాద్ జిల్లానుండి పొట్ట చేత పట్టుకొని ముంబయికి తరలివెళ్లారు. అంటే నేను ముంబయికి చెందిన వాడినే. నా చదువు రెండవ తరగతి దాకా స్థానిక మునిసిపల్ పాఠశాలలోనే సాగింది. మూడవ తరగతిలో నుండి పదకొండో తరగతిదాకా మాత్రం ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఉన్నత పాఠశాలలో సాగింది. అక్కడ తెలుగు, ఇంగ్లీషు భాషల్లో విద్యాభ్యాసం చేయించేవారు. అట్లా నా విద్యా జీవిత భవనం నిటారుగా నిలబడింది.

? చుట్టూ మరాఠీ భాషా ప్రభావం ఆవరించినా, తెలుగుపై ఎట్లా మక్కువ పెంచుకున్నారు?

! నా చిన్నప్పుడు పేదరికమే. తెలుగు వారన్నా, తెలుగు భాషన్నా మక్కువ ఎక్కువ. ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నా తెలుగు పత్రికల్ని, పుస్తకాల్ని ఇష్టంగా చదివేవాణ్ణి. మా చాల్లో (బిల్డింగ్‌లో) ఒకాయన వారపత్రికలు తెప్పించి చదివేవారు. ప్రతి మూడు నెలలకోసారి అవి చెత్తపేపర్ల వాడికి తూకానికి అమ్మేవారు. నేనా పత్రికల్ని అదే తూకం ధరకు కొని చదివేవాడిని. అలా తక్కువ ఖర్చులో ఎక్కువ పత్రికలు చదివే వీలు కలిగేది. చిన్నప్పుడే స్కూల్లో పాటలు, గేయాలు రాసి పాడేవాడిని. తెలుగు సినీ పాటలకు పారడీలు రాసికూడా పాడేవాన్ని. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో చురుకుగా పాల్గొనేవాడిని.

?రచనా రంగంవైపు ఆసక్తిని ఎట్లా పెంచుకున్నారు?

! బ్యాంకు ఉద్యోగం పొందాక కొంత ఆర్థికంగా స్థిరపడ్డాను. తెలుగు పుస్తకాల్ని కొని చదివే వాడిని. క్రమంగా రచనలు, ముఖ్యంగా కథానికలు రాయాలనే సంకల్పం బలపడింది. అనుకోకుండా ఓసారి వై.ఆర్.గాంధీ గారిని ఓ సాహితీ సమావేశంలో కలుసుకున్నాను. వారు నడిపే ''రచయితల జర్నలిస్టుల నికేతనం(రజని)''లో సభ్యత్వం తీసుకుని, వారిచ్చిన అభ్యాసాలు పూర్తిచేసి, రచనలు చేయడంలోని మెళకువలు తెలుసుకున్నాను. తర్వాత కాళీపట్నం రామారావుగారిని పరిచయం చేసుకున్నాను. అట్లా మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీ పాద, బుచ్చిబాబు, గోపీచంద్, ఉన్నవ లక్ష్మినారాయణ, చలం, కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, కారా, చాసో, జ్యేష్ట వంటి వారి రచనల్నిబాగా చదివాను. తర్వాత కథల్ని రాసి పత్రికలకు పంపాను. అచ్చయ్యాయి. కొన్ని లిఖిత ప్రతుల్ని విహారి, చంద్రశేఖర్ ఆజాద్ గారలు చూసి మరికొన్ని సూచనలు చేశారు. అట్లా కథా రచనలో కొంతపట్టు దొరికింది.

? ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, గుజరాతీ భాషల్లో కూడా మీకు ప్రావీణ్యత ఉన్నా, తెలుగులోనే ఎందుకు కథల్ని రాస్తున్నారు?

! నా మాతృభాష తెలుగు. ఏ రచయితకైనా మాతృభాషలోనే అభివ్యక్తి, ప్రభావవంతంగా ఉంటుందనేది నా గట్టి నమ్మకం. ఇక కథలు సామాన్య పాఠకులకు సులభంగా అర్థమౌతాయి. వారు చదివే కథల పాత్రల్లో తమను తాము చూసుకుంటారు. అట్లా కథా రచన ద్వారా పాఠకులకు దగ్గరవుతాం.


అంబల్ల జనార్ధన్

? ముంబయి కథలు, మనోల్ల ముంబయి కథలు మీకు మంచి పేరు తెచ్చాయి. వాటి నేపథ్యం వివరిస్తారా?

! ముంబయి నిజ స్వరూపాన్ని పాఠకులకు, ముఖ్యంగా మహారాష్ట్ర బయట ఉన్న వారికి చూపించాలనుకొని కథారచన ప్రారంభించాను. తెలుగువాళ్లు కట్టుబట్టలతో ముంబయికి వచ్చి కొన్ని వేల కోట్లకు పడగలెత్తిన వారున్నారు. ఎదురైన ప్రతికూల పరిస్థితులను తమ కనుకూలంగా మలచుకొని విజయం సాధించిన తెలుగు వారెందరో ఉన్నారిక్కడ. గత పాతిక సంవత్సరాలలో, ముంబయిలోని మన తెలుగు వారి జీవితాలను చిత్రించిన యాభైఆరు కథానికలతో 'మనోల్ల ముంబయి కథలు' సంపుటిని ఈ మధ్యే వెలువరించాను. 1998లో ప్రచురించిన నా 'బొంబాయి కథలు' పాఠకుల, సమీక్షకుల నుండి ఎంత ఆదరణ పొందిందో, 2017 లో వెలువడిన 'మనోల్ల ముంబయి కథలు' కూడా ఆ స్థాయిలోనే ఆదరణ పొందింది.

? మీరు తెలంగాణా నేపథ్యంగా రాసిన కథల గూర్చి చెప్పండి?

! తెలంగాణ ప్రాంతంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి ప్రాంతాల ప్రజల జీవితాల్లోకి చొచ్చుకొని పోయి వారి కథలను, వ్యథలను నాదైన శైలిలో ఆవిష్కరించి, పాఠకులకు పరిచయం చేశాను. యాభై వరకున్న ఆ కథల్ని ఓ సంపుటిగా తెచ్చే ప్రయత్నంలో ఉన్నాను. ముఖ్యంగా ''లగ్గం సంబురం'' కథానిక చాలా బాగా పాపులరైంది. అది చదివిన ప్రసిద్ధ రచయిత సింగమనేని నారాయణ 'నువ్వు పుట్టినప్పటినుంచి బొంబాయిలో ఉన్నావు కదా! తెలంగాణ ప్రాంతంలో జరిగే పెళ్లి పద్ధతుల గురించి అంత బాగా ఎలా రాశావు' అన్నాడు. అది నాకు మంచి ప్రశంస.

? మీకు మంచి గౌరవాన్ని పెంపొందించిన కథల గూర్చి చెబుతారా?

! నిజామాబాద్ జిల్లాలోని 'దొంకల్' అనే గ్రామ నేపథ్యంగా రాసిన 'చమురు దీపం' కథానిక, 1995లో 'అమృత్ కిరణ్' పక్ష పత్రిక పోటీల్లో వచ్చిన 1605 కథల్లో రెండో బహుమతికి ఎంపికైంది. ఆ కథను మహారాష్ట్ర ప్రభుత్వ పుస్తక ప్రచురణ ఎంపిక కమిటీకి నచ్చి దాన్ని 'బాలభారతి' ఎనిమిదవ తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా చేర్చారు. దాదాపు ఇరవై ఏళ్లుగా ఆ కథ, ప్రతి ఐదేళ్లకు వంతుల వారీగా ఎనిమిదవ, తొమ్మిదవ తరగతి పాఠ్యపుస్తకాల్లో చేర్చబడుతుంది. అంతేకాదు, ఆ కథ, మరాఠీ పుస్తక ప్రచురణ విభాగం వారి దృష్టికి వచ్చి, దాన్ని సోలాపూర్‌లో ఉంటున్న డా॥బొల్లి లక్ష్మి నారాయణగారిచే మరాఠీలోకి అనువదింపచేయించి, మరాఠీ ఏడవ, ఎనిమిదవ తరగతి ''ఉత్తం సంస్కార్ కథా'' వాచకంలో చేర్చారు. అలా ఓ తెలంగాణ నేపథ్యంగా రాసిన కథానికను , కొన్ని లక్షల మరాఠీ విద్యార్థులు చదువుతున్నారు. ''శ్రీకారం'', ''స్వయం ఉపాధి'', ''బయలు బతుకు'' కథానికలు ఐదేళ్లకోసారి, వంతుల వారీగా మహారాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల తెలుగు వాచకాల్లో చేర్చబడినాయి.

? తెలుగు మరాఠా భాషలతో, ప్రాంతాలతో సంబంధమున్న మీకు ఏ ప్రాంతం అంటే ఇష్టం?

! ఒకసారి 2010లో 'ముంబయి మరాఠీ సాహిత్య సంఘ్' వారు, వారి 75 సంవత్సరాల అమృత మహోత్సవ వేడుకలకు ఓ తెలుగు రచయితగా నన్ను ఆహ్వానించారు. 'మరాఠీతో నా అనుబంధం' అనే అంశంపై మాట్లాడమన్నారు. అప్పుడు నేను మరాఠీభాషలో ప్రసంగిస్తూ – 'నాకు తెలంగాణ దేవకమ్మ ఐతే, ముంబయి నా యశోదమ్మ, ఇద్దరు తల్లులూ నాపై అశేషమైన ప్రేమ వర్షం కురిపించి ఆశీర్వదించారు. అందుకే నాకు ఇద్దరు తల్లులపై అనుపమాన అనురాగం' అన్నాను. అది అక్షరాలా నా హృదయాంతరాల్లోంచి వచ్చిన స్పందన. ●

ముఖాముఖి: డా॥పల్లేరు,
9441602605

బిసి కవిత్వ సంకలనానికి కవితలు


మహాత్మాజ్యోతిబాపూలే ఆలోచనలు విస్తరించు కుంటూ దేశ వ్యాపితంగా బిసి చైతన్యం పదునెక్కుతుంది. ఈ నేపథ్యంలో గతం నుంచి భవిష్యత్తుకు తెలుగు సమాజంలోని బిసిలు ఐక్యతతో అడుగులు వేయవలసి ఉంది. బిసి తాత్త్విక చింతనతో ఎవరి కులమూలాల నుంచి వాళ్లు రాసుకోవలసి ఉంది. తమ కులవృత్తుల, సంస్కృతుల చరిత్ర, సామాజిక అంశాల నేపథ్యంలో బిసి కవుల నుంచి కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. బృహత్తర బిసి సంకలనం తీసుకు రావాలన్న తలంపుతో ఈ పనికి పూనుకోవటం జరిగింది. మార్చి 25వ తేదీలోపుగా మీ కవితలను పంపించవలసిందిగా కోరుతున్నాం. జూలూరు గౌరీ శంకర్, ఎం.ఎస్.కె.టవర్స్, ఫ్లాట్‌నెంబర్ –410, స్ట్రీట్ నెంబర్ – 11 హిమాయత్ నగర్ – 500026, చిరునామాకు కవితలు పంపగలరు.

రామకోటీశ్వర రావు స్వీయ చరిత్ర




పుటలు : 444
వెల రూ. 200
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము
హైదరాబాద్ – 500004

మూడు తరాల తెలంగాణ కథ



గౌ.సం॥ డా॥ నందిని సిధారెడ్డి
పుటలు : 720
వెల రూ. 300/–
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము
హైదరాబాద్ – 500004

తెలంగాణలో భావ కవితా వికాసం



సం॥ సామిడి జగన్‌రెడ్డి
పుటలు : 638
వెల రూ. 700/–
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము హైదరాబాద్ – 500004

శత కవిసమ్మేళనం

తెలంగాణ యాసను, భాషను గౌరవింపజేయాలనే ఉద్దేశంతో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శత కవి సమ్మేళనం నిర్వహించబోతున్నారు. పాల్గొనే కవులు తమ స్వీయకవితలలో తెలంగాణ మాండలికాలను ఉట్టిపడే విధంగా రాయాలి. ఆసక్తి గల కవులు తమ పేర్ల నమోదుకై మార్చి ఒకటవ తేదీ లోపు 944098801 సెల్‌లో సంప్రదించాలి.

'తెలంగాణ పల్లె' కవితల పోటీ

వసుంధర విజ్ఞాన వికాస సమితి మండలి గోదావరిఖని వారు, తెలంగాణ రాష్ట్ర స్థాయి కవితల పోటీని నిర్వహిస్తున్నారు. సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఈ పోటీలో 'తెలంగాణ పల్లె' అంశంపై కవితల పోటీని ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన ఐదు కవితలకు బహుమతులంటాయి. ఎ4 సైజు కాగితంపై ఒకవైపే కవిత 20 లైన్లకు మించకుండా రాయాలి. దీనితో పాటు హామీ పత్రం, పాస్‌పోర్ట్‌సైజు ఫోటో జతపరిచి మార్చి 10వ తేదీలోగా, కట్కూరి శంకర్, 11–2–495, హనుమాన్ నగర్, యైటింక్లయిన్ కాలనీ, గోదావరిఖని, రామగుండం (మం), 505211కు పంపాలి. వివరాల కోసం 91827 77409, 9989078568, 9849950188 నెంబర్లలో సంప్రదించవచ్చు.

కవితా సంపుటుల పోటీ

పెన్నా రచయితల సంఘం పక్షాన 2016–17 సంవత్సరాలలో ప్రచురితాలైన కవితా సంపుటులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల కవులు తమ కవితా సంపుటులు, నాలుగేసి ప్రతులు మార్చి 15లోగా గుండాల నరేంద్రబాబు, 21–1–890, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు – 524004 కు పంపించాలి. వివరాలకు 9493235992 సంప్రదించవచ్చు.

వందేళ్ళ గ్రంథాలయాల్ని తెలుపండి

తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు వారు, వందేళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలయాల చరిత్రను గ్రంథస్థం చేసే సంకల్పంతో ఉన్నారు. ఇప్పటికి కొన్ని గ్రంథాలయాల పేర్లు ఇంకా తెలియవలసి వున్నది. తెలంగాణ ప్రాంతంలో ఇంకా తెలియరాని గ్రంథాలయాల ఫోటోలు, పత్రికల వార్తలు, వ్యాసాలు, సావనీర్లు, పుస్తకాలు, ప్రత్యక్ష సాక్షుల జ్ఞాపకాలు వగైరా సమాచారముంటే తెలుపవలసిందిగా తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా॥ అయాచితం శ్రీధర్, సెల్ నెం. 98498 93238 కోరుతున్నారు.




విజేత

సక్సెస్ ఫార్ముల


మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
26 ఫిబ్రవరి, 2018
www.manatelangana.news

అందరికంటే భిన్నంగా ఆలోచిస్తూ.. సాహసాలు చేస్తూ ప్రత్యేకంగా అందరి దృష్టి తమవైపు పడేలా చేసుకుంటోంది నేటి యువత. అలాంటికోవకు చెందిన పెద్దినేని సాయితేజ సాహసమే నా ఊపిరి అంటున్నాడు! భగభగమండే లావాలతో బద్దలయ్యే అగ్నిపర్వతాలనెక్కి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఇలాంటి విన్యాసాలు అతితక్కువ మంది చేయగలుగుతారు..అలాంటి వారిలో ఒకరు సాయితేజ. సాహస క్రీడలపై ఆసక్తి చూపుతూ అగ్నిపర్వతాలు అధిరోహించే దిశగా అడుగులు వేశాడు. ఇండియాలోనే తొలి అగ్నిపర్వతారోహకుడిగా రికార్డు సాధించాడు. హైదరాబాద్‌కి చెందిన పెద్దినేని సాయితేజ(25) ఇండోనేషియాలోని బాలీ ద్వీపంలో ఉన్న 'గునుంగ్ అగుంగ్' అగ్నిపర్వతాన్ని అధిరోహించి చరిత్ర సృష్టించాడు. సముద్ర మట్టానికి తొమ్మిది వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ అగ్నిపర్వత్వాన్ని 2018 జనవరి 10న కేవలం 48 గంటల సమయంలోనే అధిరోహించాడు. ప్రమాదకరమని భావిస్తే సాహస క్రీడల్లో భారతీయులకు గుర్తింపు రావడం ఎలాగని ఆలోచించి.. అగ్నిపర్వతాల అధిరోహణను ఎంచుకున్నానని అంటున్నాడు.



సాహసమే ఊపిరి

ట్రెయినింగ్‌లో శిక్షణ తీసుకోవాలంటే వేల రూపాయలు కావల్సివస్తుంది. మరోవైపు తల్లిదండ్రులు వద్దన్నా తన ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకొని తొలి అడుగు వేసాడు. చివరికి విజయం సాధించాడు. ఇండోనేషియాలోని అతి ప్రమాదకరమైన అగ్నిపర్వతాల్లో ఒకటైన అగుంగ్ పర్వతం. అక్కడి మొత్తం లావాతో కప్పబడిన పెద్ద పెద్ద అగ్ని జ్వాలలు ఉంటాయి . కాలు జారితే ప్రాణాలతో తిరిగి వస్తామన్న నమ్మకం ఉండదు. సామాన్య ఉష్ణోగ్రత కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ వేడికి శరీరంపై నీటి బుడగలు ఏర్పడి శరీరం అంతా విపరీతమైన మంటలు వస్తుంటాయి. భయంకరమైన పర్వతం నుండి అగ్నిబాంబులు పేలుతూంటాయి. లావా ఉప్పొంగుతుంటే అగ్ని పర్వతం ఎక్కడమనేది సాధ్యంకాని పని. ఎలాంటి సహాయకులు, శిక్షకుల సహకారం లేకుండానే సాయితేజ పర్వతారోహణ చేశాడు. తొలి భారతీయుడిగా ప్రపంచానికి పరిచయం అయ్యాడు. 2017, మేలో ఇండోనేషియాలోని దుకోనో అగ్నిపర్వతాన్ని అధిరోహించాడు. దుకోనో భయంకరమైన, క్రియాశీల అగ్నిపర్వతం. దానిలో లావా బాంబులు పేలుతూనే ఉంటాయి. దుకోనోపై సైంటిఫిక్ డేటా అంతగా దొరకదు. ఎందుకంటే ఇది ఇండోనేషియాలోనే మారుమూల ప్రాంతంలో ఉంటుంది. తనకు లావా అంటే భయమని, ఆ భయాన్ని పోగొట్టుకునేందుకే తాను ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. దుకోనోను అధిరోహించడం అంత తేలికైన పనేం కాదు. ఏ మాత్రం పొరపాటు జరిగినా ప్రాణాలకే ముప్పు. తనకు సాహసాలు చేయడమంటే ఇష్టమని, 11ఏళ్ల నుంచే ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తేజ తెలిపారు. బీటెక్‌లో చేరి ఆ తర్వాత డ్రాపౌట్ అయ్యాడు. టెక్ అనలిస్టుగా కూడా విధులు నిర్వహించాడు. అంతేగాక, ఓ ఔత్సాహిక కంపెనీని స్థాపించాడు. ఐటీలో చేసిన సేవకు గానూ తనకు ఏపీ సీఎం చంద్రబాబు రూ.లక్ష చెక్కును కూడా అందించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకతోపాటు ఇతర కొత్త ప్రాంతాలను సందర్శించినట్లు సాయితేజ చెప్పాడు. అగ్నిపర్వతారోహణలో మొదటి భారతీయుడిగా నిలవాలన్న సంకల్పంతో దానిపై చాలా కాలం అధ్యయనం చేశాడు. ఇంతకుముందు ఎవ్వరు దానిపై ఈ సాహసం చేయలేదని తెలుసుకున్నాడు. అంతే తాను ప్రయత్నించి విజయం సాధించాడు.







జిమ్‌కి వెళ్తున్నారా...

ఆరోగ్యంపై శ్రద్ధ ప్రతిఒక్కరిలో ఎక్కువైంది. కొందరు ఇంటివద్దే వాకింగ్, యోగా, ధ్యానం లాంటివి చేస్తుంటారు. మరికొందరు జిమ్‌కి వెళ్లి ట్రైనర్ పర్యవేక్షణలో వ్యాయామం చేస్తారు. అయితే జిమ్‌కు వెళ్లేవారు తమ వెంట తీసుకెళ్లే బ్యాగులో ఏమేం వస్తువులు ఉండాలో ఒక-సారి తెలుసుకుందాం....

* బ్యాగులో కచ్చితంగా ఓ వాటర్ బాటిల్ ఉండాలి. ఎక్కువ వ్యాయామం చేయడం వల్ల శరీరం డీ హైడ్రేషన్‌కు గురవుతుంటుంది. మధ్య మధ్యలో నీళ్లు తాగుతూ ఉండాలి.
* మరో ముఖ్యమైన విషయం ఏమంటే లోదుస్తుల ఎంపిక. ఈ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ చేసినా ఆకృతి దెబ్బతినే అవకాశం ఉంటుంది. * అందకని ప్రత్యేకించి జిమ్‌కోసం రూపొందించిన ఇన్నర్‌వేర్‌ని ఉపయోగించాలి.
* జిమ్‌లో మ్యూజిక్ పెడుతుంటారు. ఒకవేళ అవి మీకు నచ్చకపోవచ్చు. ఇయర్‌ఫోన్స్ తీసుకెళ్లడం వల్ల మీకు నచ్చిన పాటల్ని వినొచ్చు.
* వ్యాయామం తర్వాత సులభంగా తినడానికి పండ్లూ, ఎండు ఫలాలు ఇలా ఏదో ఒకటి బ్యాగులో పెట్టుకోవాలి.
* కాస్త పలచని తువ్వాలును బ్యాగులో పెట్టుకోవాలి. చెమట తుడుచుకున్నా త్వరగా ఆరిపోతుంది. బరువు కూడా ఉండదు.
* సౌకర్యంగా ఉండే షూలను ఎంచుకోవాలి. * ఆఫీసు నుంచి నేరుగా జిమ్‌కు వెళ్లేవారు తప్పనిసరిగా ఓ జతను బ్యాగులో పెట్టుకుంటే సరిపోతుంది.



ఆత్మవిశ్వాసంతో ముందడుగు

అనుకున్న ఆఫర్ వచ్చిన వెంటనే ఉద్యోగం వేట ముగిసినట్టుకాదు. విజయం సగం ఫలించినట్లే అని భావించాలి. సంస్థ యాజమాన్యంతో మాట్లాడి, జీతభత్యాలను ఖాయం చేసుకొని జాబ్‌లో చేరినప్పుడే మీరు పూర్తిగా విజయం సాధించినట్లు అవుతుంది. ఇంటర్వ్యూల్లో కాని రాత పరీక్షల్లో కాని మీరు నెగ్గిన మరుక్షణం జీతం గురించి ఒక నిర్ణయం సంస్థతో జరపాలి. నైపుణ్యాలకు, అర్హతలకు తగిన గుర్తింపు వేతనం కావాలని కోరుకోవడం సహజమే. అయితే ఈ విషయంలో పట్టుదలకు పోతే మొత్తానికే మోసం వస్తుంది. కొలువు చేజారుతుంది. అందుకే కొన్ని జాగ్రత్తలు తెలుసుకోవాల్సి ఉంటుంది.




వేతనం ప్రారంభంలో తక్కువగా ఉన్నా.... దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తమే జేబులో పడే అవకాశం ఉంటుంది. జీతభత్యాలు క్రమంగా పెరుగుతుంటాయి. కొన్ని సంస్థల్లో మేనేజ్‌మెంట్ తమ ఉద్యోగుల కెరీర్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన చర్యలు చేపడుతుంది. వీటిని కూడా మీరు నిశితంగా పరిశీలించండి. తాత్కాలికమైన వెసులుబాట్లను కాకుండా దీర్ఘ కాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకోండి. జాబ్ ఆఫర్‌ను అందుకోవాలా లేక తిరస్కరించాలా అనే నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది. వేతన ప్యాకేజీని నిర్ణయించుకొనే విషయంలో ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. జాబ్ ప్రొఫైల్, గ్రేడ్, పనివేళలు, యాజమాన్యం పాటించే విలువలు, కార్యాలయం ఉన్న ప్రాంతం.. వంటివి ముఖ్యపాత్ర పోషిస్తాయి. పనివేళలు, కార్యాలయం మీకు అనుకూలంగా ఉండొచ్చు. అలాంటప్పుడు జీతం విషయంలో పట్టువిడుపులు ప్రదర్శించాలి. అర్హతలు, పని అనుభవం పెంచుకొనే అవకాశం ఉన్న ఉద్యోగమైతే వేతనంపై ఎక్కువ ఆశలు పెట్టుకోకపోవడమే మంచిది. ఎందుకంటే ఇందులో అనుభవం సంపాదించిన తర్వాత మరో సంస్థలో చేరి, ఆశించిన ప్యాకేజీ పొందడానికి వీలుంటుంది. కొన్ని కంపెనీల్లో జీతాలు తక్కువగా ఉన్నప్పటికీ ఇతర బెనిఫిట్స్ ఎక్కువగా ఉంటాయి. రవాణా, భోజన సదుపాయం, టెలిఫోన్ రియంబర్స్‌మెంట్ వంటి ప్రయోజనాలను ఉద్యోగులకు కల్పిస్తారు. ఇవి మీకు సంతృప్తికరంగా అనిపిస్తే జీతం తక్కువైనా ఉద్యోగంలో చేరొచ్చు. సంస్థలో ఇలాంటి ప్రయోజనాలు ఉన్నాయో లేదో ముందే తెలుసుకోవాలి. వేతనంపై సంస్థతో సంప్రదింపులు జరపడానికంటే ముందు కొంత పరిశోధన చేయండి. ప్రస్తుత జాబ్ మార్కెట్ తీరుతెన్నులు, కంపెనీ, అందులో సిబ్బందికి ఇస్తున్న జీతాలు, మీతో సమానమైన అర్హతలున్నవారికి దక్కుతున్న ప్యాకేజీ... ఇలాంటి వాటిపై అవగాహన పెంచుకోండి. ప్రతి కంపెనీకి ప్రత్యేకమైన సంస్థాగత నిర్మాణం, వేతనాల విధానం ఉంటాయి. వాటి గురించి పరిశోధిస్తే ఎంత జీతం కోరుకోవాలో తెలుస్తుంది.ప్యాకేజీపై యాజమాన్యంతో మాట్లాడేటప్పుడు మీరు ఆత్మవిశ్వాసంతో కనిపించాలి. బాడీ లాంగ్వేజ్ సక్రమంగా ఉండాలి. మర్యాద ఉట్టిపడే భాష ఉపయోగించాలి. స్వరం స్పష్టంగా వినిపించాలి. మీరు చెప్పాలనుకుంటున్న విషయాన్ని డొంకతిరుగుడు లేకుండా సూటిగా చెప్పాలి. మీపై మీకు పూర్తి విశ్వాసం ఉంటే కచ్చితంగా మేలు జరుగుతుంది. యాజమాన్యం ఆఫర్ చేస్తున్న ప్యాకేజీపై తొందరపడి ఒక నిర్ణయానికి రావొద్దు. అన్ని విషయాలను నిదానంగా ఆలోచించుకున్న తర్వాతే అడుగు ముందడుగు వేయాలి.

ఐక్యూలో ఐన్‌స్టీన్‌ను దాటాడు

బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయ సంతతికి చెందిన పదేళ్ల మెహుల్ గార్గ్ ఐక్యూలో ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లనే మించిపోయాడు. మెన్సా ఐక్యు టెస్ట్‌లో టాప్ మారక్స్ స్కోర్ చేశాడు. గత పదేళ్లలో ఆ రికార్డును అందుకున్న అతిపిన్న వయస్కుడిగా మెహుల్ చరిత్ర సృష్టించాడు.



తెలివితేటలకు,మేధాశక్తికి కొలమానంగా భావించే మెన్సా ఐక్యు పరీక్షలో మెహుల్ 162 పాయింట్లు సాధించాడు. ఈ బాలుడి అన్న ధృవ్ గార్గ్ (13) కూడా గతేడాది 162 పాయింట్లు సాధించడం విశేషం. అన్నయ్యను స్ఫూర్తిగా తీసుకున్న మెహుల్ అతనికి తీసిపోనని నిరూపించుకున్నాడు. మెహుల్ గార్గ్ దక్షిణ ఇంగ్లండ్‌లోని రీడింగ్‌లో ఉన్న రీడింగ్ బాయ్స్ గ్రామర్ స్కూల్‌లో చదువుతున్నాడు. మెన్సా ఐక్యు పరీక్షలో అతడికి మొత్తం 162 పాయింట్లు వచ్చాయి. అంటే ఐన్‌స్టీన్, హాకింగ్‌లకన్నా రెండు పాయింట్లు ఎక్కువే. ఐక్యు పరీక్షలో 140 స్కోరు సాధించిన వారిని మేధావిగా గుర్తిస్తారు. అలాంటిది ఈ అన్నదమ్ములిద్దరూ 162 స్కోరు సాధించడం విశేషం. క్రికెట్, ఐస్ స్కేటింగ్ అంటే మెహుల్‌కు పిచ్చి. ఇక చదువు విషయానికొస్తే.. మ్యాథమేటిక్స్ అతడి ఫేవరెట్ సబ్జెక్ట్. ఐక్యూ టెస్ట్ ఫలితాలు రాగానే మెహుల్ గార్గ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. గూగుల్ కంటే పెద్ద కంపెనీని తయారు చేస్తామని చెబుతున్నాడు. ఇప్పటికే అన్నదమ్ములిద్దరూ విరాళాల ద్వారా 1300 పౌండ్లు (1,17,000 రూపాయలు) సేకరించారు. వీటితో ఇరుగుపొరుగును అనుసంధానించి, ఒంటరితనం భావనను తగ్గించే యాప్‌ను తయారు చేస్తున్నారు. మెహుల్ గార్గ్ రూబిక్ క్యూబ్‌ను కేవలం వంద సెకన్ల లోనే సెట్ చేస్తాడు. ప్రస్తుతం ఛానల్ 4 నిర్వహించే చైల్డ్ జీనియస్ 2018 షోలో పాల్గొనేందుకు గార్గ్ తయారవుతున్నాడు.



హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఆదివారం నాడు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. అల్వాల్ నుంచి బొల్లారం వరకు పెద్ద ఎత్తున వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. రెండు గంటలుగా 5 కిలోమీటర్ల మేర ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. అయితే ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ ట్రాఫిక్ జామ్‌లో రెండు అంబులెన్సులు ఇరుక్కుపోయాయి. అత్యవసర చికిత్సకోసం ఆస్పత్రికి తరలిస్తుండగా రోగుల కుటుంబీకులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారిలో ట్రాఫిక్ జామ్ అవుతున్నా ప్రత్నామ్నాయ మార్గాలు అన్వేషించడంలో అధికారులు విఫలం చెందారని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.



రైతు సమితుల సభ్యులకు గౌరవ వేతనం?

సిఎం కెసిఆర్ ప్రసంగంలో పరోక్ష ప్రస్తావన

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితుల సభ్యులకు రానున్న కాలంలో గౌరవ వేతనం ఇచ్చే దిశలో సిఎం కెసిఆర్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించనట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో ఆదివారం జరిగిన మండల, జిల్లా ప్రాంతీయ రైతు సమన్వయ సదస్సులో సిఎం ప్రసంగంలో సైతం పరోక్షంగా దీన్ని రూఢీ చేసే వ్యాఖ్యలు వెలువడ్డాయి. సదస్సులో సిఎం రైతు సమితుల సభ్యుల సలహాలు, ప్రశ్నలు పేరుతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో పలువురు రైతు సమితి సభ్యులు తమకు గౌరవ వేతనం ఇవ్వాలని చీటీల ద్వారా కోరినప్పుడు రైతు సమన్వయ సమితులు ఇప్పుడే ఊపిరి పోసుకున్నాయని, ఇప్పటికిప్పుడు నిర్ణయాలు చెప్పలేమని, 24 గంటలు పనిచేసే వాళ్లు ఉట్టిగానే చేస్తారా వాళ్లకేదైనా మంచి చెడ్డ అనేది భవిష్యత్‌లో వస్తుందని వ్యాఖ్యానించారు. 'టిఆర్‌ఎస్ కార్యకర్తలమే అయినా వ్యవసాయం చేసుకుంటున్నాం. మా పనులు మానుకుని మిగతా రైతులందరి కోసం పనిచేస్తున్నపుడు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందితే మంచిది కదా. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శ రైతులను నియమించి గౌరవ వేతనం అందించింది' అని పలువురు సభ్యులు వ్యాఖ్యానించారు. సిఎం వ్యాఖ్యలతో రానున్న కాలంలో రైతు సమితుల సభ్యులకు జీత భత్యాలు ఉంటాయన్న నమ్మకం కుదిరిందని సదస్సు అనంతరం పలువురు సభ్యులు 'మన తెలంగాణ'తో చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16 వేల మంది ఆదర్శ రైతులకు నెలకు రూ. ఒక వెయ్యి చొప్పున గౌరవ వేతనం చెల్లించింది. జిల్లా రైతు సమన్వయ సమితులకు చెందిన కొందరు సభ్యులు 'మాకు వేతనం అందుంతుందని ప్రజా ప్రతినిధులు చెప్పారుగానీ ఎప్పటి నుంచి అనేది మాత్రం చెప్పలేదు' అని పేర్కొన్నారు. గౌరవ వేతనం అందించే విషయంలో సిఎం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని, అయితే వెంటనే ప్రకటిస్తే రాజకీయంగా విమర్శలతో పాటు న్యాయస్థానాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే ఉద్దేశంతో ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. గ్రామ సమితుల్లో 15, మండల, జిల్లా సమితుల్లో 24 మంది, రాష్ట్ర రైతు సమన్వయ సమితిలో 42 మంది చొప్పున సభ్యులు ఉంటారు. ఇప్పటికే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సభ్యుల ఎంపిక పూర్తయింది. రాష్ట్ర రైతు సమన్వయ సమితికి అధ్యక్షులుగా నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డిని పేరును కూడా ప్రకటించారు. అయితే ఇంకా సభ్యులను ఎంపిక చేయలేదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1.61 లక్షల మంది రైతు సమితుల సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా పనిచేయనున్నారు.

ప్రజల్ని ఉత్సాహపర్చిన సిఎం

ప్రాంతీయ రైతు అవగాహన సదస్సుకు మొత్తం 13 జిల్లాల నుంచి మండల, జిల్లా రైతు సమితి సభ్యులు ఆదివారం హాజరయ్యారు. ఈ సదస్సు ప్రారంభం నుంచి సిఎం కెసిఆర్ ప్రసంగానికి, ఇచ్చిన వరాలకు రైతు సభ్యుల నుంచి ఊహించిన స్పందన కనిపించలేదో లేక ప్రసంగంలో మునిగిపోయారోగానీ కెసిఆర్ స్వయంగా వారిని ఉత్సాహపరిచి చప్పట్లు కొట్టేలా చేశారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేయాలన్నప్పుడు మాత్రం సభ్యులే ఉత్సాహంతో గట్టిగా చప్పట్లు కొట్టి ఈలలు వేశారు. ఈలలు వేయాల్సింది ఇప్పుడు కాదని, పంటలకు కనీస మద్దతు ధర వచ్చినప్పుడు అని వివరించారు. 'నాకు కూడా సీటి (ఈల) వేయడం వస్తది. రేటు వచ్చినప్పుడు మీతో పాటు నేను కూడా సీటి వేస్త. మీతో పాటు డ్యాన్స్ చేస్త' అని కెసిఆర్ వ్యాఖ్యానించారు.

ఎలక్ట్రిక్ బస్సుల టెండర్లకు ఆదరణ కరువు

వచ్చింది 5 టెండర్లే

కఠిన నిబంధనలే కారణమా?

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం, ఆర్‌టిసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎలక్ట్రిక్ బస్సుల టెండర్లకు ఆదరణ కరువైంది. ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు టిఎస్‌ఆర్‌టిసి టెండర్లను పిలవగా కేవలం 5 టెండర్లు మాత్రమే వచ్చాయి. టాటా, అశోక్‌లీలాండ్, హుందాయ్, గోల్డ్ స్టోన్ తదితర బస్సుల తయారీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ఐదుగురు ఆపరేటర్లు మాత్రమే ముందుకు వచ్చినట్లు సమాచారం. టెండర్ల గడువు ఈ నెల 19వ తేదీతో ముగియగా, టెండర్ల ఖరారు ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగనుంది.

కాలుష్యరహిత, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుపై 60 శాతం సబ్సిడీతో 100 బస్సులను ఆర్‌టిసికి కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఆర్‌టిసి సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి నడపాలని భావించింది. అయితే ప్రస్తుతం ఆర్‌టిసి నడుపుతున్న ఒక్కో బస్సు ఖరీదు కోటి రూపాయలు కాగా ఎలక్ట్రిక్ బస్సు ఖరీదు దాదాపు రూ.2.5 కోట్లు ఉంటోంది. పైగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై ఆర్‌టిసికి తగిన అనుభవం లేకపోవడంతో ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుని ప్రైవేటు కంపెనీలు, ఆపరేటర్ల నుంచి అద్దె ప్రాతిపాదికన మొదటి దశలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 48 బస్సులను, రెండవ దశలో వచ్చే ఏడాది 52 బస్సులను తీసుకుని నడపాలని నిర్ణయించింది. బస్సుల పొడవు, ఛార్జింగ్ సమయం, ఎసి సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా రెండు రకాల ఎలక్ట్రిక్ బస్సుల కోసం టెండర్లను పిలించింది.

నిబంధనలే అడ్డంకులా?

ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్‌టిసి పిలిచిన టెండర్లలో నిబంధనలే ఆపరేటర్లకు అడ్డంకులుగా ఉన్నట్లు పలువురు బస్ ఆపరేటర్లు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల ఖరీదు ఎక్కువగా ఉండడం, టెండర్లు దక్కించుకునే ఒక్కో ఆపరేటర్ కనీసం 25 బస్సులు సమకూర్చాలని, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ 90 రోజుల్లో బస్సులను పూర్తిస్థాయిలో సమకూర్చాలని, లేనట్లయితే వారిపై పెనాల్టీ విధించనున్నట్లు టెండర్లలో నిబంధనలు విధించారు. ఆపరేటరే బస్సును, డ్రైవర్‌ను సమకూర్చడంతో పాటు బీమా, నిర్వహణను సమకూర్చాలి. ఆర్‌టిసి నిర్ణీత రూట్లలో ఆ బస్సులను నడిపి ఛార్జీలను వసూలు చేస్తుంది. ఒప్పందం ప్రకారం ఆపరేటర్లకు ప్రతి కిలో మీటర్‌కు అద్దెను చెల్లిస్తుంది. ఈ బస్సులు నడపడానికి దాదాపు రూ.10 కోట్ల టర్నోవర్ కలిగి ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న ఆపరేటర్లకు అవకాశం ఇవ్వాలని ఆర్‌టిసి నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఫాస్టర్ అడాప్షన్, మానిఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రీడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ స్కీమ్' (ఎఫ్‌ఎఎంఇ) నిబంధనల ప్రకారం బస్సులను కొనుగోలు చేసి నడపాల్సిన భాధ్యత పూర్తిగా బిడ్డర్లదే. కేంద్రం ప్రకటించిన సబ్సిడీ ప్రోత్సహాకాన్ని పొందే విధంగా సహకారాన్ని మాత్రమే ఆర్‌టిసి అందిస్తుంది. బస్సు ఖరీదులో 60 శాతం (రూ.1.5 కోట్లను) కేంద్రం భరిస్తుందని, మిగిలిన మిత్తాన్ని బస్సు ఆపరేటర్ భరించాల్సి ఉంటుంది. ఆ లెక్కన ఒక్కో బస్సు కొనుగోలుకు ప్రైవేటు ఆపరేటర్ కోటి రూపాయల చొప్పున 25 బస్సులకు దాదాపు రూ.25 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

మరో వైపు బస్సులను తయారు చేయడంలో కంపెనీలో ఆలస్యం జరిగితే సమయానికి బస్సులు సమకూర్చకపోతే ఆర్‌టిసి పెనాల్టీ విధిస్తుంది. ఇంకో వైపు కేంద్ర ప్రకటించిన 60 శాతం సబ్సిడీ రావడంలో ఆలస్యం జరిగితే పరిస్థితి ఏమిటనే ఆలోచనలో ఆపరేటర్లు ఉన్నారు. ఇందులో ఏ ఒక్కటీ నిర్ణీత గడువులోగా జరగపోయినా తాము తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆపరేటర్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఎలక్ట్రిక్ బస్సులను నడిపే విషయంలో ఆపరేటర్లు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారంటున్నారు.

ఉద్యాన వనాలుగా ఓఆర్‌ఆర్ కూడళ్ళు

ప్రణాళికలను సిద్ధం చేస్తున్న హెచ్‌ఎండిఎ
మంత్రి కెటిఆర్ సూచనతో పథకంలో మార్పు
ఔటర్ పొడవు 158 కి.మీ.లు, కూడళ్ళు 18

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: విశ్వనగరానికే తలమానికంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్‌ఆర్) కూడళ్ళు ఇక పర్యావరణ ఉద్యానవనాలుగా అవతరించనున్నాయి. అందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఎ) దృష్టిసారించింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె. తారకరామారావు ఓఆర్‌ఆర్ కూడళ్ళను పచ్చందాలకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించినట్టు తెలిసింది. దీంతో కమిషనర్ చిరంజీవులు కూడళ్ళను పూదోటలుగా, పచ్చని వనాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి రింగ్ రోడ్ కూడళ్ళలో 'వేసైడ్ ఎమినిటీస్' అనే పథకంలో భాగంగా వ్యాపార, వినోదాత్మకం, ఆహార కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నది. అందుకు అథారిటీ అధికార యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) పద్దతిలో ఈ పథకాన్ని కార్యరూపంలోకి తీసుకురావాలని భావించింది. టెండర్ల ప్రక్రియను చేపట్టేందుకు సన్నాహాలు పూర్తిచేసింది. అయితే, రాష్ట్ర మంత్రి కెటిఆర్ మాత్రం ఔటర్ రింగ్ రోడ్ కూడళ్ళు వ్యాపార కేంద్రాలుగా మారడానికన్నా, పచ్చందాలతో అలరాలని అధికారులకు సూచనప్రాయంగా తెలపడంతో ఆ దిశగా కమిషనర్ చిరంజీవులు పథక రచన చేస్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.



ప్రతిపాదిత పథకమిలా...

ఔటర్ రింగ్ రోడ్ 158 కి.మీ.లు. రూ. 6696 కోట్ల పథకం. జాతీయ, రాష్ట్రీయ, ప్రాంతీయ రహదారుల ద్వారా ఔటర్‌ను చేరుకునే చోట కూడళ్ళు ఏర్పాటు చేశారు. మొత్తం 18 కూడళ్ళు ఉన్నాయి. వీటి ద్వారానే రింగ్ రోడ్ లోకి వాహనాలు ప్రవేశించాల్సి ఉన్నది. ఇతర మార్గాలు లేవు. ఈ కూడళ్ళలో 'దారివెంట వసతులు'(వేసైడ్ ఎమినిటీస్) పథకం కూడా ఓఆర్‌ఆర్ పథకంలో భాగం. అయితే, ప్రస్తుతం ఔటర్ పూర్తిగా వినియోగంలోకి వచ్చింది. ఇక చేపట్టాల్సింది వేసైడ్ ఎమినిటీస్ పథకం మాత్రమే. అందుకు హెచ్‌ఎండిఎ అధికార యంత్రాంగం ప్రణాళికలను సిద్ధం చేసింది. ప్రయోగాత్మకంగా బొంగుళూరు, పెద్దంబర్‌పేట కూడళ్ళను ఎంపిక చేసి పిపిపి పద్దతిలో చేపట్టాలని నిర్ణయించింది. అయితే, ఈ విషయాన్ని మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన కూడళ్ళను వ్యాపార కేంద్రాలుగా చేయడాన్ని తిరస్కరించారు. ప్రైవేట్ వ్యక్తులకు లేదా సంస్థలకు భూములను అప్పగించి వ్యాపారాలను నిర్వహించడం కన్నా పచ్చందాలతో సేదతీరే కేంద్రాలుగా అభివృద్ధి పరచడమే ఉత్తమమని, నగర వాసులు అధికశాతం మంది ప్రకృతినే ఆస్వాధించేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారని సూచన ప్రాయంగా వెల్లడించారు. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని చెప్పడంతో అధికారులు ప్రస్తుతం వేసైడ్ ఎమినిటీస్ పథకంను ప్రక్కనపెట్టి, పచ్చందాల పర్యావరణ ఉద్యానవనాల ఏర్పాటుపై దృష్టిసారించినట్టు తెలిసింది.

ఉద్యానవనాలుగా కూడళ్ళు...

ఓఆర్‌ఆర్ కూడళ్ళు ఇరువైపులా ఖాళీగా ఉన్న స్థలాలు కనీసంగా 20–60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. వీటిల్లో ప్రపంచస్థాయి ఉద్యానవనాలను ఏర్పాటు చేయాలనేది మంత్రి కెటిఆర్ ప్రతిపాదన. ప్రస్తుతం నగరంలోని ఇందిరాపార్కు, కెబిఆర్, సంజీవయ్య పార్కులపై నగరవాసులు అంతగా ఆసక్తిని కనబరచడంలేదు. ఇందిరాపార్కులో బోటింగ్‌లేదు. నిర్వాహణ అంతంత మాత్రమేననే ప్రచారం.

కెబిఆర్ పార్కులో వంతెనతో రూపురేఖలు మారబోతున్నాయి. కేవలం యువతకే పరిమితమైన సంజీవయ్యపార్కు కొంత మేర యాంత్రిక జీవనం నుండి ఉపశమనం కలిగిస్తున్నదే. తప్ప సకుటుంబంగా వెళ్ళలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే నగర శివారులో ఉన్న ఈ కూడళ్ళు ప్రణాళికాబద్ధంగా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దాలని కమిషనర్ చిరంజీవులు భావిస్తున్నారు. త్వరలోనే వీటికి అంచనా వ్యయం, ప్రణాళికలను సిద్ధంచేసి మంత్రి కెటిఆర్ ముందుకు తీసుకెళ్లనున్నారు.

ఆరోగ్యానికి జీవవ్యర్థాల ముప్పు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదాలను తీసుకొస్తున్న జీవవ్యర్థాల నిర్వహణపై ప్రైవేటు ఆసుపత్రులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై రాష్ట్ర కాలుష్య మండలి ఆగ్రహం వ్యక్తంచేసింది. జీవ వ్యర్థాల నిర్వహణలో, రవాణాలో ప్రైవేటు ఆసుపత్రులకు స్పష్టమైన నిబంధనలను ఉన్నప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని, ఇకపైన సీరియస్‌గా వ్యవహరించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మం డలి అధికారులు వ్యాఖ్యానించారు. ఆరోగ్య తెలంగాణ, స్వచ్ఛ తెలంగాణ అని రాష్ట్ర ప్రభుత్వం పటి ష్ట చర్యలు తీసుకుంటూ ఉన్న సమయంలో జీవ వ్యర్థాల నిర్వహణపై ఆసుపత్రులు ఉదారంగా వ్యవహరించడం ఎంతమాత్రం వాంఛనీయం కాదని, ఇకపైన కఠినంగా వ్యవహరించక తప్పదని మండలి అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఆసుప్రతుల నుంచి వ్యర్థాలుగా వెలువడే మానవ శరీర అవయవాలు, రక్తం, సిరంజీలు తదితరాలను మాములు చెత్త కుండీల్లో కాకుండా నిబంధనల ప్రకారం 48 గంటల్లోగా నిర్దిష్ట విధానంలో నిర్వీర్యం చేయాల్సి ఉంటుందని, గాలి ద్వారా ప్రమాదకరమైన బ్యాక్టిరియా, వైరస్ చేరకుండా ఎక్కువ ఉష్ణోగ్రతలో దహనం చేయడం, సెలైన్ బ్యాటిళ్లను కత్తిరించి రీసైక్లింగ్‌కు పంపించడం, రక్తంతో కూడిన దూది, ఇతర జీవ వ్యర్థాలను, శరీర భాగాలను భూమిలో పాతిపెట్టడం... ఇలా ప్రతిదానికీ స్పష్టమైన నిబంధన ఉన్నా చాలా ఆసుపత్రులు వీటిని పాటించడంలేదని ఆయన గుర్తుచేశారు. ఆసుపత్రులు ప్రతి బెడ్‌కు రెండు నుంచి నాలుగు రూపాయల చొప్పున జీవ వ్యర్థాలను తీసుకెళ్ళే సంస్థలకు చెల్లించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయని, కానీ ప్రైవేటు ఆసుప్రతుల యాజమాన్యాలు పట్టించుకోవడంలేదని, కాలు ష్య నియంత్రణ మండలి పలుమార్లు సూచించినా పెడచెవిన పెట్టాయని ఆయన వాపోయారు. ఆసుపత్రుల నుంచి రోజుకు సుమారు 40 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, వీటిని ఆసుపత్రులు జీహెచ్‌ఎంసీ చెత్త డబ్బాలతో పాటు సమీపంలోని డ్రైనేజీలు, గుంతల్లో పారబోస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ సేకరించిన చెత్తలో 0.57 శాతం జీవ వ్యర్థాలు మిళితమై నట్లు ఇటీవల తనిఖీల్లో వెల్లడైందని ఆ అధికారి వివరించారు.

హైవేల విస్తరణకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌హెచ్– 65 విస్తరణకు (190 కి.మీ) ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ప్రస్తుతం కేటాయించిన రూ. 5,600 కోట్ల ప్రభుత్వ నిధులతో పాటు తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మరో రూ. ఐదు వేల కోట్ల వరకు రుణాలను సమకూర్చుకోనుంది. ఈ నిధులతో భూసేకరణ ప్రక్రియను ఒకటి రెండు మాసాల్లోనే పూర్తి చేయవచ్చని ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు 'మన తెలంగాణ'కు తెలిపారు. నూతన జాతీయ రహదారుల భూసేకరణ ఇంకా పలు జిల్లాల్లో పూర్తికాకపోవడంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వారం రోజుల క్రితం ఉన్నతాధికారులతో సమావేశమై రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లోని హైవేల విస్తరణ గత రెండేళ్లుగా నిదానంగా సాగుతున్న పనులపై ఉన్నతాధికారుల నుంచి వివరణ కోరారు.

జాప్యానికి అటవీశాఖ భూములే కారణం !

మహబూబ్‌నగర్ జిల్లాలో హైవే విస్తరణకు భూసేకరణ అడ్డంకిగా మారుతోందని జిల్లా అధికార యంత్రాంగం ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులకు తెలిపింది. అటవీశాఖ పరిధిలోని భూములు కావడంతో రోడ్డుకు అటు ఇటుగా రెండు వరుసల రోడ్డు వేసేంత భూమిని సేకరించాల్సి ఉంది. ఇలాంటి చోట్ల భూసేకరణ జాప్యం కారణంగానే హైవే రోడ్ల పనులు నిదానంగా సాగుతున్నాయని ఉన్నతాధికారులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. అటవీశాఖ పరిధిలోని భూములు కొన్నిచోట్ల ఉండడంతో భూసేకరణ ఇబ్బందిగా మారుతోందని జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులు వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జడ్చర్ల సమీపంలోని అప్పన్నపల్లి వద్ద రిజర్వు ఫారెస్టు భూములు ఇచ్చేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న విషయాన్ని ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఈ సమస్య ఉందా లేక ఇతర జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఉందా అని మంత్రి తుమ్మల వివరణ కోరారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ వరకు హైవే రోడ్డు విస్తరణ పనులు భూసేకరణ కారణంగా ఏడాది పాటు స్తబ్ధుగా ఉన్నా ఇప్పుడిప్పుడే కొలిక్కివస్తోంది. ఈ హైవేపై నాలుగు చోట్ల టోల్‌గేట్లను ఏర్పాటు చేసుకునేందుకు నిర్మణ సంస్థకు ఎన్‌హెచ్‌ఐ అనుమతులు ఇచ్చింది. సంగారెడ్డిలో, గుల్బర్గ సమీపంలో టోల్‌గేట్‌లు ఖరారయ్యాయి. మరో రెండు టోల్‌గేట్ల ఏర్పాటుపై నిర్ణయం జరిగాల్సి ఉంది.

ఐదు వేల కోట్ల వరకు రుణాలు పొందే వీలు!

తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వివిధ బ్యాంకులు, నాబార్డ్ తదితర ఆర్థిక సంస్థల నుండి తీసుకునే రుణ పరిమితిని ప్రభుత్వం ఇటీవలే మరింతగా పెంచుతూ ఉత్తర్వులు (జివో నెం 368) జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న వెయ్యి కోట్ల రూపాయల రుణ పరిమితిని ఏకంగా ఐదింతలు పెంచుతూ స్పష్టం చేసింది. ఈ హైవే విస్తరణ పనులకు వివిధ బ్యాంకుల నుండి అందే ఆర్థిక సహాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్చ్ నెలలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో సుమారు రూ. 12 వేల కోట్ల వరకు నిధులను సమకూర్చుకునే అవకాశం ఉందని ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులు 'మన తెలంగాణ'కు తెలిపాయి.

మిలిటెంట్ల కాల్పుల్లో పోలీసుల మృతి

శ్రీనగర్: కశ్మీర్‌లో ఆదివారం ఉగ్రవాదులు జరిపిన దాడులలో ఇద్దరు పోలీసులు మృతి చెందారు. పవిత్ర ఛరారే షరీఫ్ క్షేత్రం వద్ద, మరొకటి హురియత్ నేత నివాసం వద్ద జరిగిన కాల్పుల ఘటనలో పోలీసులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. బుద్గామ్ జిల్లాలో మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో కానిస్టేబుల్ కుల్తార్ సింగ్ మృతి చెందారు. కాగా మిలిటెంట్లు హురియత్ నేత ఫజల్ హక్‌కు చెందిన శ్రీనగర్ నివాసం వద్ద జరిపిన కాల్పుల్లో కానిస్టేబుల్ ఫరూఖ్ అహ్మద్ మృతి చెందారు. ఆదివారం జరిగిన ఈ రెండు ఘటనలతో కశ్మీర్ లోయలో పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

బయల్పడిన ఫిరంగి

(మొదటిపేజీ తరువాయి)

సొరంగంతో పాటు నిజాం కాలం నాటి ఫిరంగి కనిపించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఫిరంగిని బయటకు తీశారు. ఫిరంగి వెనకభాగం కొద్దిగా విరిగిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ వార్త దావానలంగా వ్యాపించడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఫిరంగిని చూడటానికి తరలి వచ్చారు. నిజాం కాలంలో దీనిని భూమి కింద భద్రపరిచి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. సోమవారం ఆర్కియాలజీ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

4వ సంవత్సరం చదువుతుంది. శనివారం రాత్రి సమయంలో షామ్‌దిన్ అకస్మాత్తుగా కాలేజ్ భవనం నాల్గవ అంతస్తునుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో విషయాన్ని గమనించిన కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. షామ్‌దిన్‌ను వెంటనే వైద్యం కోసం గచ్చిబౌలిలోని సన్‌షైన్ ఆసుపత్రికి తరలించారు. కాలేజ్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు అనంతరం సంఘటనా స్థలాన్ని ఎసిపి శ్రీనివాస్ రావు ,ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ,ఎస్ఐ భరత్ భుషన్‌లు సందర్శించారు. కేసు దర్యాప్తు జరుగుతుందని ,ఇప్పటివరకు యువతి మృతికి గల కారణాలు తెలియరాలేదని ఎసిపి శ్రీనివాస్ రావు తెలిపారు.

రైతు కన్నీటిని కడతేరుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

గ్యారంటీగా ఉంటుందన్నారు. వచ్చే వానాకాలం పంటలో ఒక్క గింజ కూడా కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మనివ్వరాదన్నారు.



సాయాన్ని వదులుకున్న సిఎం కెసిఆర్

రైతులందరికీ ఎకరాకు రూ. 4 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని స్పష్టం చేశారు. భూమి ఉన్న తనకూ పెట్టుబడి సొమ్ము వస్తుందని, అయితే వ్యవసాయం చేసుకునే ఆర్థిక స్థోమత ఉన్నందున తాను ప్రభుత్వం నుంచే వచ్చే సాయాన్ని వదులుకుంటున్నట్లు సిఎం ప్రకటించారు. ప్రభుత్వ సాయం అవసరం లేకుండా సాగు చేసుకునే తాహతు ఉన్నవారందరూ పెట్టుబడి పథకాన్ని వదులుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వీరికి ఇవ్వనున్న సొమ్ము రాష్ట్ర రైతు సమన్వయ సమితికి జమ అవుతుందని, ఇది అన్నదాతలకే వినియోగమవుతుందని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ను కొనసాగిస్తామని, రైతులే అవసరాల మేరకు వినియోగించుకోవాలని సూచించారు. ఒక్క ఏడాది భూగర్భజలం కాపాడుకోవాలని కాళేశ్వరం నీళ్లు వస్తే ఇంకా ఏ బాధ ఉండదన్నారు.

ఆదాయం రెట్టింపులో మాటలే తప్ప మతలబు లేదు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎవ్వరూ రైతుల కోసం ఆలోచించి చేసిందేమి లేదని సిఎం కెసిఆర్ అన్నారు. రైతుకు సీతకున్నంత దుఃఖం ఉందన్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు తమాషాలు చేసాయే తప్ప ఏమీ చేయలేదన్నారు. ఇదే విషయం తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడిని కలిసి అన్నదాతలకు ఏదైనా చేయాలని పదిసార్లు చెప్పానన్నారు. అయినా చేసిందేమి లేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు అని ఒక మాట పట్టుకున్నారు తప్ప ఇందులో నిర్దిష్టంగా ఏమీ లేదన్నారు. మాటలే కాని మతలబు లేదన్నారు.

వ్యవసాయాన్ని ఉపాధితో లింక్ చేయాలి

భోజన విరామ అనంతరం కెసిఆర్ రైతు సమితుల సభ్యులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సభ్యులు రాసిచ్చిన సందేహాలకు సమాధానమిచ్చారు. సలహాలపై స్పందించారు. వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని వచ్చిన సలహాపై సిఎం కేంద్రంపై దూకుడుగా మాట్లాడారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఉందని వ్యవసాయాన్ని, ఉపాధి హామీతో అనుసంధానం చేయాలని కోరుతూ ప్రధాన మంత్రికి 20 ఉత్తరాలు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా స్పందన లేదన్నారు. పార్లమెంట్‌లో కూడా దీనిపై రాష్ట్ర ఎంపిలు పోరాటం చేస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో కూడా తీర్మానం చేసి పంపనున్నట్లు చెప్పారు. మండల, జిల్లా రైతు అవగాహన సదస్సు కూడా దీనిపై ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

సబ్సిడీపై టార్పాలిన్లు, సోలార్ ఫెన్సింగ్

పంటకోత అనంతరం ఉత్పత్తులు అకాల వర్షాలకు తడిచిపోకుండా ఉండేందుకు 75 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను అందజేయనున్నట్లు సిఎం చెప్పారు. రైతులు కోరిన విధంగా పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌ను కూడా సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అటవీ శాఖ సహకారంతో కోతులు, అడవి పందుల బెడద తగ్గిస్తామన్నారు. ఇప్పుడు అడవి పందులను చంపితే కేసు కాదని వేటగాళ్ల సాయంతో వాటి బెడదను తప్పించుకోవాలని సూచించారు.

నియంత్రణ విధానంలో మార్కెట్‌కు పంట ఉత్పత్తులు

గిట్టుబాటు ధరపై వచ్చిన ప్రశ్నకు స్పందించిన కెసిఆర్ ఎలాంటి సమస్య ఉన్నా రైతు సమన్వయ సమితికి తెలియజేయాలని రైతులకు స్పష్టం చేశారు. పంటను ఒకే సారి మార్కెట్‌కు తరలించకుండా రైతు సమితి సభ్యులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని రైతులకు ఒక నిర్ణీత రోజు, సమయం కేటాయించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ఈ యాసంగి పంటలకు ఈ విధానం అమలు చేసేందుకు సభ్యులు పనిచేయాలన్నారు. తెలంగాణ రైతులు దేశంలోనే అత్యుత్తమ రైతులుగా మారాలన్నారు. అంకాపూర్ గ్రామాన్ని రైతు సమితి సభ్యులంతా సందర్శించి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చెక్కుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా క్రమశిక్షణ పాటించిన సభ్యులను ఇజ్రాయెల్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కెసిఆర్ రద్దయితినే రైతు సమితులు రద్దవుతాయని, సభ్యులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు.

మండలానికి 10 చొప్పున నాట్లు వేసే యంత్రాలు

వ్యవసాయ యాంత్రీకరణ జరిగితే తప్ప అనుకున్నది సాధించలేమని కెసిఆర్ అన్నారు. నాలుగైదు ఏళ్ల తర్వాత నాట్లు వేసే వాళ్లు దొరకరన్నారు. ప్రతి 5 ఎకరాలకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాల లెక్క తెలియాలన్నారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి 10 చొప్పున దాదాపు 5 వేల నాట్లు వేసే యంత్రాలను 50శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. అలాగే వ్యవసాయ శాఖ సేకరించిన వివరాల ఆధారంగా ఎక్కడ ఏ యంత్రాలు సమకూర్చాలో ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు.

సమితులతో స్థానిక సంస్థలకు నష్టం లేదు

నాడు అధికారంలో కాంగ్రెస్ ఉన్నా టిడిపి ఉన్నా అసెంబ్లీకి కందిని వచ్చింది కానీ రాష్ట్రానికి కరెంట్ రాలేదన్నారు. రైతు సమన్వయ సమితులతో స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతాయని కొందరు మాట్లాడుతున్నారని, రైతు సమితి గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో కూర్చోదని, స్థానిక సంస్థలకు వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. రాష్ట్రం కోసం కొట్లాడిన టిఆర్‌ఎస్ కార్యకర్తలే రైతు సమన్వయ సమితిలో ఉన్నారన్నారు. రైతులకు నీళ్లొస్తే ప్రతిపక్షాలకు కడుపు మంట అని కేసులు వేస్తున్నారని, జడ్జిలు తిడుతున్నా సిగ్గు వస్తలేదన్నారు. ప్రతి నియోజకవర్గానికి అక్కడ పండే పంటల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన పాలసీని తీసుకురానున్నట్లు సిఎం చెప్పారు.

తెలంగాణ పంటల విలువ రూ. 1.25 లక్షల కోట్లు

ప్రతీ జిల్లా, మండల, గ్రామ పరిధిలో ఏ ఎకరంలో ఏ పంట పండుతుందో రైతు సమన్వయ సమితులకు తెలియాలని కెసిఆర్ అన్నారు. రాష్ట్ర రైతులు పండించే పంటల విలువ రూ. 1.25 లక్షల కోట్లుగా ఉండబోతోందన్నారు. రైతులను సంఘటితం చేయడమే సృష్టించబోయే సంపదకు ఆయువుపట్టు అని అన్నారు. ఆంధ్రా పాలకుల హయాంలో మైనర్ ఇరిగేషన్ ధ్వంసమైందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కాకతీయ'కు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయన్నారు.

రైతు సంఘటితమైతే కల్తీ ముచ్చటే ఉండదు

రైతులు సంఘటితంగా ఉంటే కల్తీ విత్తనాలు, ఎరువుల ముచ్చటే ఉండదని సిఎం అన్నారు. సమన్వయ సమితులు కల్తీలపై ఉక్కుపాదం మోపాలన్నారు. స్థానికంగా ఉండే సభ్యులకు ఏ దుకాణంలో కల్తీవి ఉంటున్నాయో స్పష్టమైన అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు అన్నీ ఇస్తున్నామన్నారు. రెండేళ్ల తరువాత పంట కాలనీలు కూడా సాధ్యమేనన్నారు. ఇప్పుడున్న 141 మంది సబ్ రిజిస్ట్రార్‌లు అలాగే ఉంటారని, ఎమ్‌ఆర్‌ఒలు కూడా సబ్ రిజిస్ట్రార్‌లుగా బాధ్యతలు నిర్వర్తిస్తారని కెసిఆర్ తెలిపారు. పాస్‌బుక్ ఇవ్వడంలో ఆలస్యం చేస్తే రెవిన్యూ సిబ్బందికి రోజుకు రూ. ఒక వెయ్యి చొప్పున ఫైన్ విధిస్తామన్నారు.

కొత్త మండల కేంద్రంలో గోడౌన్‌లు : మంత్రి హరీశ్‌రావు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మండలాల కేంద్రాల్లో గోడౌన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని 24 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుకున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో నివేదికలు తయారు చేసుకుని నాబార్డు రుణంతో మరిన్ని గోడౌన్‌ల నిర్మాణం పనులు మొదలుపెడుతామన్నారు. అవసరాల మేరకు మినీ మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రైతు వేదికలకు ఎకరం భూమి, నగదు విరాళాలు

రైతు వేదికల నిర్మాణాల అవసరం కోసం కొంతమంది ఒక ఎకరం చొప్పున భూమిని ఇవ్వడానికి ముందుకురాగా మరికొంతమంది నిర్మాణానికి అవసరమైన నగదును విరాళంగా ఇచ్చారు. ఇందులో యాంగి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి.వెంకట్ రెడ్డి, కడ్తాల్‌కు చెందిన గుడూరు భాస్కర్ రెడ్డి, నర్మెట్టకు చెందిన ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి కొడంగల్ నుంచి చిన్న బస్వారెడ్డి, దేవరకొండ నుంచి లాలూనాయక్ తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థి చదువుకు సిఎం సహాయం

ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న సూర్యాపేట జిల్లాకు చెందిన మాలోవత్ కృష్ణ కుమార్తె మాలోవత్ ఇందు కేసు ప్రత్యేకంగా పరిగణించి ఒవర్సీస్ స్కాలర్‌షిప్ ఇవ్వాలని మంత్రి జగదీష్‌ను, అధికారులను సిఎం ఆదేశించారు. అంతకు ముందు తన గోడును కృష్ణ సిఎంకు విన్నవించుకున్నారు.



రైతులకు కొత్త గోదాంలు నిర్మిస్తాం : హరీశ్‌రావు

మన తెలంగాణ/హైదరాబాద్/ మైలార్‌దేవుపల్లి: కొత్త మండల కేంద్రాల్లోనూ రైతులు తమ పంటలు నిల్వ చేసుకునేందుకు కొత్తగా గోదాంలు నిర్మిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్ రావు హామీ ఇచ్చారు. ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన రైతు సమన్వయ సమితి తొలి ప్రాంతీయ అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏడాదిలో గోదాముల సామర్థ్యం పెంచామని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు రాష్ట్రంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు ఉండగా, రూ. వెయ్యికోట్లతో 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచామని వెల్లడించారు. ప్రతి మండల కేంద్రంలో ఒక గోదాం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని చోట్ల పట్టణానికి మధ్యలో కొన్ని గోదాంలు ఉన్నాయని, ఆయా ప్రాంతాలల్లో ప్రభుత్వం స్థలం చూపిస్తే వాటి స్థానంలో మరింత విశాలంగా కొత్త వసతులతో కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నూతన గోదాంలు నిర్మిస్తామన్నారు. రైతు సమన్వయ సమితి తొలి ప్రాంతీయ అవగాహన సదస్సుకు 13 జిల్లాల నుంచి వచ్చిన రైతులు, సమితి ప్రతినిధులు, మార్కెట్ చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సరదా; ఒకరి మృతి

మన తెలంగాణ/మిర్యాలగూడ: ఈత సరదా ఒకరి ప్రాణం తీసింది. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జగ్గుతండాకు చెందిన మస్తాన్ నాయక్ కుమార్తె వివాహం శనివారం జరిగింది. మస్తాన్ నాయక్ కుమారుడు నవీన్‌నాయక్ స్నేహితులు మణిదీప్, శివతోలు వివాహానికి హాజరయ్యారు. ఆదివారం వీరంతా స్నానం చేసేందుకు తండా సమీపంలోని ఎడమకాల్వ వద్దకు వెళ్లారు. మొదట శివ, నవీన్ కాల్వలోకి దిగి స్నానం చేస్తుండగా, ఆ తర్వాత మణిదీప్ పై నుంచి కాల్వలో దూకాడు. దూకిన వెంటనే నీళ్లలో కొట్టుకుపోతుండగా కాల్వలోనున్న ఇద్దరు స్నేహితులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించారు. వీరు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి కాపాడారు. అప్పటికే మణిదీప్ మృతి చెందాడు. శివ, నవీన్, మణిదీప్‌లు అస్సాంలోని గౌహతిలో బిఇ పూర్తి చేశారు. ఇటీవల ఎంటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మన తెలంగాణ/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రమైన సిరిసిల్లలోని గాంధీ విగ్రహం వద్ద మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగం ఆదివారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లాలోని తాడూరు గ్రామానికి చెందిన రాజలింగం గతంలో ఆ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశాడు. ప్రస్తుతం సిరిసిల్ల రూరల్ సిఐ వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కృష్ణపట్టె ప్రాంతంలో నెమళ్లు మృతి



మన తెలంగాణ/ అడవిదేవులపల్లి: నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని గుండ్రాల బోడు వద్ద కృష్ణానది తీర ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్టులో ఆదివారం మూడు నెమళ్లు మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఎండి.ఖదీర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వేటగాళ్లు చేసిన విష ప్రయోగంతో నెమళ్లు మృతి చెంది ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. పంచనామా నిమి త్తం నెమళ్లను మిర్యాలగూడకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వీరి వెంట దామరచర్ల బీట్ అధికారి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

హైదరాబాద్ సదస్సుకు కార్మికులు

మన తెలంగాణ/దోమకొండ: ఉద్యోగ, కార్మికుల సమస్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు నిజామాబాద్ జిల్లా దోమకొండ, బీబీపేట మండలాలకు చెందిన కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాపు ఎల్లయ్య మాట్లాడుతూ స్వచ్ఛ కార్మికులకు కాంటిజెన్సీ ఉద్యోగులకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వీరికి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

మన తెలంగాణ/ఆర్మూర్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన బత్తుల లక్ష్మయ్య, తిరుపతమ్మ దంపతులు కొన్నాళ్ల క్రితం అంకాపూర్‌కు వలస వచ్చారు. వీరికి వీరాంజనేయులు (16) కొడుకు. ఆదివారం వీరాంజనేయులు తల్లిదండ్రులను సెల్‌ఫోన్ కొనివ్వాలని అడిగాడు. అందుకు వారు నిరాకరించడంతో మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు నిజామాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జ్వరంతో పాఠశాల విద్యార్థి మృతి



మన తెలంగాణ/నార్నూర్: మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా గాధిగూడ మండలం ఝరి బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పిప్రి గ్రామానికి చెందిన స్వయం సునీల్(13) ఇక్కడి ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. మూడు రోజుల కింద జ్వరంతో బాధపడుతుం డడంతో ఈ నెల 22న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఈ క్రమంలో శనివారం భోజనం తీసుకోక పోవడంతో అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సమయానికి హాస్టల్లో సిబ్బంది ఎవరూ లేక పోవడంతో గదిలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మృతి చెందాడాని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఐటిడిఎ ఎటిడబ్ల్యూ ఎస్‌సి అభివృద్ధి సలహా కమిటీ సంఘం చైర్మన్ కనక లక్కేరావ్, డిడి పోచంతో కలిసి పాఠశాలకు చేరుకొని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఆంధ్రా లారీలను అడ్డుకున్న రైతులు

మన తెలంగాణ/మధిర: ఆంధ్రా నుంచి వస్తున్న సుబాబుల్ లారీలను ఖమ్మం జిల్లా మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో రైతులు అడ్డుకోన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దళారి వ్యవస్థ లేకుండా నెరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆందోళన చేస్తే హామీ ఇచ్చి అమలు చేయలేదని తెలంగాణలో సుబాబుల్ నరకకుండా రెతులు నిర్ణయం తీసుకుంటే ఆంధ్రా నుంచి లారీలో ఐటిసి కంపెనీ లోడులను తరలిస్తున్నారని రైతులు లారీలను అడ్డుకోన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అయితం ప్రసాద్, యడ్లపలి, సంగయ్య, ఊట్ల వెంకటయ్య, అప్పారావు, గుర్రం. వెంకటేశ్వర్లు, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జొన్న చిగురు తిని గొర్రెలు మృత్యువాత

మన తెలంగాణ/ధర్పల్లి: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం గోవిందుపల్లి గ్రామంలోని ఇందిరానగర్ తండాలో ఆదివారం సాయంత్రం జొన్న చిగురుతిని 14 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన హరిలాల్ తన గొర్రెలు కాపరులకు ఇచ్చి మేత కోసం పంపించాడు. ఈ క్రమంలో మేకలు, గొర్రెలు జొన్న చిగురు తిని అక్కడికక్కడే మృతిచెందాయి. మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందన్నారు.

టిఆర్‌ఎస్ రైతు ప్రభుత్వం

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, రోటవేటర్ల పంపిణీ





మన తెలంగాణ/వరంగల్: టిఆర్‌ఎస్ రైతు ప్రభుత్వమని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అ న్నారు. వ్యవసాయం పండుగ కావాలన్నా లక్ష్యం తో రైతును రాజును చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆదివారం వరంగల్ రూరల్ జిల్లా రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీ ట్రాక్టర్లు, రోటవేటర్లను మహబూబా బాద్ ఎంపి ప్రొ. అజ్మీరా సీతారాంనాయక్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి కడియం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. దేశం మొత్తం తెలంగాణ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి మాట్లాడుకునే విధంగా సమర్థవంతమైన పాలన జరుగుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే రూ.లక్షలోపు రుణాలను రాష్ట్ర వ్యాప్తంగా 35లక్షల 45వేల మంది రైతులకు రూ.16వేల కోట్లు నాలుగు విడతలుగా మాఫీ చేయడం జరిగిందన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే లక్ష్యంతో సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించ డం జరుగుతోందన్నారు. రైతులకు రుణభారం పడకుండా కాపాడేందు కోసమే వచ్చే ఖరీఫ్ నుంచి ఏడాదికి ఎకరానికి రూ.8వేల సాయాన్ని ప్రభుత్వం నేరుగా రైతులకు అందించబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రూరల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.హరిత, జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఉషాదయాళ్ తదితరులు పాల్గొన్నారు.



ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు దుర్మరణం

మన తెలంగాణ/బొంరాస్‌పేట: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎఎస్‌ఐ అఫ్జల్ వివరాల ప్రకారం.. బూరాన్‌పూర్ గ్రామానికి చెందిన యువకులు చాకలి శివ (15), ప్రశాంత్ (14), గణేశ్ కలిసి ద్విచక్ర వాహనంపై బొంరాస్‌పేట వైపు వెళ్తుండగా మండల కేంద్రానికి సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో శివ, ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన గణేశ్‌ను మండల కేంద్రంలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేపట్టి మెరుగైన కొడంగల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ అఫ్జల్ తెలిపారు.

హామీల అమల్లో ప్రభుత్వాలు విఫలం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్/మియాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీల అమలులో విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం మియాపూర్‌లోని ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కీ.శే. రక్తపు నాగేష్ గౌడ్ వేదికగా సిపిఐ 15వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభల్లో చాడ మాట్లాడుతూ సిపిఐ ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత 100 రోజుల్లో అవినీతి, నల్లా ధనాన్ని వెలికితీస్తారని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలోని ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. కాంగ్రెస్, బిజెపిల హయాంలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. బిజెపి ప్రభుత్వ పాలనలో మత విద్వేషాలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడాబాబులు వేల కోట్ల రూపాయాలు దోచుకుని దర్జాగా తిరుగుతుంటే ప్రభుత్వాలు చూస్తూ ఉండిపోతున్నాయన్నారు. అక్రమాలకు అడ్డుకోవడం మాని నోట్ల రద్దు, జిఎస్‌టిల పేరుతో వ్యాపారులు, సామాన్యులపై అదనపు భారం మోపి ఆర్థికంగా ఇబ్బందుల పాలు చేశారన్నారు. సమస్యల పరిష్కారంలో మొహం చాటేస్తున్న ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నిరుపేద వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చిన పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. మియాపూర్ ప్రభుత్వ భూములు ప్రైవేటు వారికి ఎలా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ డబుల్ బెడ్‌రూంలు ఎన్ని కట్టించారో, ఏడాదికి ఒక లక్ష డబుల్ బెడ్‌రూం కట్టిస్తామని తెలిపిన వారు అవి ఎక్కడ కట్టించారో తెలపాలన్నారు. త్వరలోనే భూ పోరాటాలు చేస్తామన్నారు. మాజీ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడుతూ కెసిఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏలు రాములు, పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సెక్రటరీ సభ్యులు బాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి నర్సింగ్‌రావు, శ్రీశైలం గౌడ్, నర్సింహారెడ్డి, రామకృష్ణ, వెంకటస్వామి, వినయ్‌గౌడ్, నాయకులు పల్లె నర్సింహ తదితరులున్నారు.



సిఎం కెసిఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జోగు

మన తెలంగాణ/ఆదిలాబాద్ టౌన్: ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్న సిఎం కెసిఆర్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 27న సిఎం కెసిఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను మంత్రి జోగురామన్న పరిశీలించారు. మంత్రితో పాటు కలెక్టర్ దివ్య, జెసి కృష్ణారెడ్డి, డిఎస్‌పి నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనీషా, కమిషనర్ మారుతి ప్రసాద్, పలువురు అధికారులు, టిఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. ముందుగా ఆదిలాబాద్‌లోని సిఎం కెసిఆర్ సభ నిర్వహించే డైట్ మైదానాన్ని మంత్రి పరిశీలించారు. స్టేజితో పాటు బారికేట్ నిర్మాణం, ప్రముఖుల ప్రవేశ, ప్రజల ప్రవేశద్వారంతో పాటు మీడియా పాయింట్ తదితర స్థలాలను పరిశీలించారు. అక్కడి నుండి సిఎం హెలీకాప్టర్ ల్యాండ్ కానున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సిఎం ల్యాండ్ అయినప్పటి నుంచి సభాస్థలి వరకు వచ్చే దారితో పాటు అక్కడ ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ సిబ్బంది ఏరోడ్రంలో చేపడుతున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. అదే విధంగా సిఎం రెస్ట్ తీసుకునేందుకు టిటిడిసి గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. అక్కడ సిఎం ఉండేందుకు గదితో పాటు అవసరమైతే వచ్చే నాయకుల కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. అక్కడి ఏర్పాట్ల గురించి అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా 27న ఉదయం 10 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా చనక కొరట బ్యారేజ్ పనులు జరుగుతున్న స్థలానికి చేరుకుంటారని మంత్రి జోగు రామన్న తెలిపారు. అదే విధంగా అక్కడ అరగంట పనులను పరిశీలించి ఆదిలాబాద్ చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు.

నీట మునిగి ఒకరి మృతి

మన తెలంగాణ/ధర్మపురి: పుణ్యస్నానాల కోసం గోదావరి నదికి వచ్చిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెగడపెల్లి మండలం, లింగాపూర్ గ్రామానికి చెందిన కట్ల మహేశ్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసేందుకు రాయపట్నం బ్రిడ్జి వద్దకు వచ్చారు. స్నానం చేస్తుండగా మహేశ్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెతికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాయపట్నం గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ధర్మపురి సింగిల్ విండో చైర్మన్ బాదినేని రాజేందర్ ఘటన స్థలానికి వచ్చి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం



మన తెలంగాణ/వనస్థలిపురం: హైదరాబాద్‌లోని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని బిఎన్‌రెడ్డినగర్ ఫేస్1, ఫేజ్2, వైదేహినగర్, శ్రీరామ్‌నగర్, శ్రీపురం కాలనీ, సాగర్ కాంప్లెక్స్ ఎస్కేడినగర్ కాలనీల్లో 2008 నుంచి నిలిపివేసిన ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనీ లేని యెడల టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బిఎన్‌రెడ్డినగర్ బస్‌స్టాండ్ సమీపంలో టిడిపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఒక్కరోజు నిరాహార దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి , ఎల్బీనగర్ ఎంఎల్‌ఎ ఆర్.కృష్ణయ్య, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు తూళ్ల వీరేందర్‌గౌడ్‌లు హాజరై మాట్లాడారు. పదేళ్లుగా బిఎన్‌రెడ్డినగర్‌లోని సుమారుగా 5వేల ఇండ్లు ఉన్నాయని, 2008 వరకు ఇక్కడ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, ఆ తర్వాత ఇక్కడ చిన్నచిన్న కారణాలతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యను సాధించే వరకు టిడిపి ముందు ఉండి పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా స్వరాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కౌలే జగన్నాథం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి రొక్కం భీంరెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, టిడిపి సినీయర్ నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రవిశంకర్, భరత్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, నూతి శ్రీనివాస్, పారంద కృష్ణ, జగన్, మల్లేశ్‌గౌడ్, టిఎన్‌టిఎస్‌ఎఫ్ నాయకులు స్వామి, బాల భాస్కర్‌తో పాటు భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు నిరహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

యుఎల్‌సి క్లియరెన్స్‌కు తప్పనున్న తిప్పలు

- బల్దియాకి చేతికి యుఎల్‌సి భూముల జాబితా
- జిల్లా కలెక్టర్లకు లేఖలు రాసిన జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్దన్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : అర్బన్ ల్యాండ్ సిలింగ్(యుఎల్‌సి) క్లియరెన్స్ కోసం ఇక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా పోనుంది. ఇక నుంచి బల్దియా కార్యాలయంలోనే యుఎల్‌సి భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. భవన నిర్మాణదారులకు తమ భూమి యుఎల్‌సి ఉందో లేదో తెలుసుకునేందుకు రెవెన్యూ శాఖలో దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. యుఎల్‌సి క్లియరెన్స్ ఇచ్చేందుకు ఇందుకోసం రెవెన్యూ శాఖ జాప్యం చేస్తుండటంతో భవన నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యం నెలకొంటుంది. అనుమతుల్లో నెలకొన్న జాప్యాన్ని నివారించేందుకు రెవెన్యూ శాఖ నుంచి యుఎల్‌సికి సంబంధించిన భూముల వివరాలను జిహెచ్‌ఎంసి సేకరించాలని నిర్ణయించింది. యుఎల్‌సి భూములకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే జిల్లాల కలెక్టర్లకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఇప్పటికే లేఖలు రాసింది. యుఎల్‌సి వివరాలు జిహెచ్‌ఎంసి దగ్గర ఉంటే సంబంధిత భూమి యుఎల్‌సి ఉందో లేదో అనే విషయాన్ని పరిశీలించి, భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయనున్నారు. దీంతో యుఎల్‌సి క్లియరేన్స్ ప్రక్రియ సులభతరం కానుంది. భవన నిర్మాణ అనుమతులు జారీ చేసే జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలోకి యుఎల్‌సి భూముల వివరాలు అందుబాటులో ఉండనున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలో ఉంటే ఎప్పటికప్పుడు క్లియరేన్స్ ఇచ్చేందుకు వీలవుతుంది.

యుఎల్‌సిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు..

ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల మంజూరు ఈనెల 28వ తేదీతో ముగియనున్న విషయం తెల్సిందే. యుఎల్‌సి, ఎఫ్‌టిఎన్, బఫర్‌జోన్ల పరిధిలోకి వచ్చే దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. వీటి పరిధిలోకి లేని దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. యుఎల్‌సి పరిధిలోకి వచ్చే దరఖాస్తుల జాబితాను పంపించాలని ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని అదేశించింది. అలాగే ఎఫ్‌టిఎల్‌కు సంబంధించి దరఖాస్తులను నీటిపారుదల శాఖ సూపరిడెంట్ ఇంజనీర్‌కు పంపేందుకు జిహెచ్‌ఎంసి అధికారులు జాబితాను సిద్ధం చేస్తున్నారు. 14 వేల 698 దరఖాస్తులు యుఎల్‌సి పరిధిలోని భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చినవి కాగా, 661 ఎఫ్‌టిఎల్ వక్ఫ్ భూములకు సంబంధించినవి 475, టైటిల్ వివాదాలకు చెందిన 584 దరఖాస్తులతో పాటు మొత్తం సుమారు 18068 దరఖాస్తులు వివాదాస్పదంగా ఉన్నాయి.



వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన శ్రీనిధి నృత్య కళాక్షేత్రంలోని 25మంది చిన్నారులు భరతనాట్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువు పసుపులేటి శ్రీనందని మాట్లాడారు. డిసెంబర్ 25న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ ఆడిటోరియంలో జరిగిన ఇంటర్నేషనల్ సిలికాన్ ఆంధ్రా కూచిపూడి మహా బృంద నాట్యంలో వరంగల్ నుంచి 25మంది చిన్నారులు పాల్గొన్నారన్నారు. గిన్నిస్ రికార్డును ఫిబ్రవరి18న ప్రకటించగా, ధ్రువీకరణ పత్రాలను ఆదివారం అందించి, వారిని అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ సరిత, శ్రీనివాస్, కన్వీనర్స్ కొంతం వెంకట్, కృపాసాగర్, చిన్నారులు తల్లిదండ్రులు తదితరులున్నారు.

– మన తెలంగాణ/కాశిబుగ్గ

ఇద్దరి మరణంలో ఓ పోలిక

బోనీకపూర్ మొదటి భార్య మోనాకపూర్ 2012లో మరణించారు. ఆమె మరణంలో, శ్రీదేవి మరణంలో ఒక పోలిక ఉండటం గమనార్హం. తన కొడుకు అర్జున్‌కపూర్‌ను హీరోగా వెండితెర మీద చూసుకోవాలని మోనాకపూర్ పరితపించారు. ఇందుకోసం ఆమె చాలానే కష్టపడ్డారు. అర్జున్‌కపూర్ హీరోగా నటించిన తొలి చిత్రం 'ఇష్క్‌జాదే' విడుదలకు కేవలం రెండు నెలల ముందు ఆమె క్యాన్సర్‌తో మరణించారు. ఆమె మరణంతో అర్జున్ తొలి చిత్రం విడుదల కాస్త ఆలస్యమైంది. ఇదిలాఉండగా తన పెద్ద కుమార్తె జాన్వీని వెండితెర మీద హీరోయిన్‌గా చూసుకోవాలని శ్రీదేవి ఎంతగానో తపించారు. కూతురికి సరైన ఫ్లాట్‌ఫామ్ కోసం ఆమె చేసిన కృషి అంతాఇంతా కాదు. చివరికి 'ధడక్' చిత్రంతో జాన్వీని పరిచయం చేయిస్తున్నారు. ఈ చిత్రం జూలై 14న విడుదల కావాల్సి ఉంది. ఈ చిత్రం విడుదలకు నాలుగున్నర నెలల ముందు శ్రీదేవి అనూహ్యంగా మృతిచెందటం గమనార్హం. బోనీకపూర్ మొదటి భార్యే కాదు రెండో భార్య సైతం తన వారసుల్ని వెండితెర మీద వెలిగిపోతుంటే చూసి మురిసిపోవాలనుకోవడం... అది సాధ్యం కాకపోవడం గమనార్హం.






భువి నుంచి దివికేగిన అతిలోక సుందరి



భారతీయ సినిమా హీరోయిన్ల చరిత్రను గనుక చెప్పాల్సి వస్తే ఖచ్చితంగా 'శ్రీదేవికి ముందు... శ్రీదేవికి తర్వాత..' అని చెప్పకోవాల్సిందే. అందంలో శ్రీదేవిని మించిన నటీమణులు కొందరు ముందు కూడా వచ్చారు... ఆతర్వాత కూడా వచ్చారు. అదే మాదిరిగా అభినయంలోనూ ఆమెను అధిగమించగలవారు అస్సలు లేరని చెప్పడానికి కూడా వీల్లేదు. కానీ అందం, అభినయాల కలబోతగా... అయిదు దశాబ్దాలు చిత్ర పరిశ్రమకు సామ్రాజ్ఞిగా వెలుగొందడం, మహారాణిలా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడడం అనేది అంత సామాన్యమైన విషయం కాదు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే తిరుగులేని అసామాన్యమైన కథానాయికగా... ఎంతోమంది గుండెల్లో చిరస్థాయిగా కొలువుదీరిన హీరోయిన్‌గా శ్రీదేవి నిలిచిపోయారు.







తమిళనాడులోని శివకాశీలో 1963 సంవత్సరం ఆగస్టు 13న శ్రీదేవి జన్మించారు. ఆమె అసలు పేరు శ్రీఅమ్మ య్యంగార్ అయ్యప్పన్. సినిమాల్లోకి వచ్చాక ఆమె తన పేరును శ్రీదేవిగా మార్చుకున్నారు. ఆమె తండ్రి అయ్య ప్పన్ తమిళ వ్యక్తి కాగా తల్లి రాజేశ్వరి తెలుగు మహిళ కావడం విశేషం. తండ్రి లాయర్‌గా పనిచేసేవారు.

బాలనటిగా కెరీర్ ప్రారంభం...

బాలనటిగా నాలుగేళ్ల వయసులో శ్రీదేవి చిత్ర రంగ ప్రవేశం చేశారు. బాలనటిగా కొన్ని తెలుగు సినిమా ల్లోనూ నటించారు. 1967లో తమిళ చిత్రం 'కందన్ కరుణాయ్' ద్వారా సినిమాల్లోకి వచ్చారు. తెలుగులో ఆమె నటించిన తొలి చిత్రం 'మా నాన్న నిర్దోషి'. ఇక కెరీర్ ప్రారంభంలో స్టార్ హీరోలు కమల్‌హాసన్, రజనీ కాంత్‌లతో కలిసి 'మాండు ముడిచు' అనే తమిళ సిని మాలో నటించి స్టార్ హీరోయిన్‌గా రాణించారు. కె.బా లచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1976లో విడుదలైంది. తెలుగులో శ్రీదేవి హీరోయిన్‌గా నటించిన మొదటి చిత్రం 'పదహారేళ్ల వయసు'. 1978లో వచ్చిన ఈ చిత్రం కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో తెరకె క్కింది. చంద్రమోహన్, మోహన్‌బాబు ప్రధాన పాత్రల్లో నటించారు. ఇదే చిత్రాన్ని హిందీలో 'సోల్వా సావన్' పేరిట రీమేక్ చేశారు. 1979లో విడుదలైన ఈ చిత్రంతో శ్రీదేవి బాలీవుడ్ రంగప్రవేశం చేశారు. పి.భారతీరాజా దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దు కుంది. శ్రీదేవి ఒకవైపు దక్షిణాదిన సినిమాలు చేస్తూనే బాలీవుడ్‌లో చిత్రాలు చేస్తూ టాప్ హీరోయిన్‌గా రాణిం చడం విశేషం. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ చిత్రాల్లో కలిసి దాదాపు 240 సినిమాల్లో ఆమె నటించారు. తెలుగులో 85, హిందీలో 71, తమిళంలో 72, మలయాళంలో 26, కన్నడంలో 6 చిత్రాల్లో నటిం చారు. ఇక నటిగా శ్రీదేవి చివరి చిత్రం 'మామ్'. 2017లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

స్టార్ హీరోలు అందరితో...

తెలుగులో దాదాపు అందరు స్టార్ హీరోలతో కలిసి శ్రీదేవి సినిమాలు చేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, కృష్ణ, కృష్ణంరాజు, చిరంజీవి, నాగార్జున, వెంక టేష్‌లతో కలిసి పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. ఎన్టీఆర్‌కు జోడీగా ఆమె నటించిన కొండ వీటి సింహం, వేటగాడు, సర్దార్ పాపారాయుడు, బొబ్బి లిపులి, చిరంజీవి సరసన నటించిన జగదేకవీరుడు అతి లోక సుందరి, వెంకటేష్‌తో నటించిన క్షణం క్షణం సూపర్‌హిట్ సినిమాలుగా నిలిచాయి. ఇక ఆమె తెలుగులో ఎక్కువగా కె.రాఘవేంద్రరావు దర్శక త్వంలో సినిమాలు చేయడం విశేషం. బాలీవుడ్‌లో స్టార్ హీరో జితేంద్రతో కలిసి నటించిన 'హిమ్మత్‌వాలా' చిత్రం స్టార్ హీరోయిన్‌గా ఆమెకు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. జితేం ద్రతో కలిసి ఆమె హిందీలో 16 సినిమాలు చేయడం విశేషం. వీటిలో జానీ దోస్త్, జస్టిస్ చౌధరి, మవాలి, అక ల్మంద్, తోఫా, బలిదాన్, ఔలాద్, సుహాఘన్, ఘర్ సన్‌సార్, ధర్మ్ అధికారి, సోనే పే సుహాగ చిత్రాలు ఘన విజయం సాధించాయి. బాలీవుడ్ స్టార్ రాజేష్‌ఖన్నాతో కలిసి నయా కదమ్, మక్సద్, మాస్టర్‌జీ, నజ్రానా వంటి హిట్ సినిమాల్లో శ్రీదేవి నటించారు. ఆమె నటించిన 'న గీనా' చిత్రం బాలీవుడ్‌లోని బిగ్గెస్ట్ హిట్లలో ఒకటిగా నిలి చింది. అదేవిధంగా అనిల్‌కపూర్‌కు జోడీగా నటించిన 'మిస్టర్ ఇండియా' ఘన విజయాన్ని అందుకుంది. చాందిని, ఛాల్‌బాజ్ వంటి సూపర్‌హిట్ సినిమాలు శ్రీదే వికి బాలీవుడ్‌లో స్టార్‌హీరోయిన్‌గా మంచి క్రేజ్‌ను తెచ్చి పెట్టాయి. ఇక దేశంలో తొలి మహిళా సూపర్‌స్టార్‌గా శ్రీదేవిని అభివర్ణించవచ్చు. ఆమె స్థానాన్ని మరెవరు ఎప్పటికీ చేరుకోలేరని చెప్పవచ్చు. తెలుగు తెరపై అగ్ర హీరోలందరితో ఆడిపాడిన శ్రీదేవిని అతిలోక సుంద రిగా కీర్తిస్తుంటారు.

బోనీకపూర్‌తో వివాహం...

1996 జూన్ 2న బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్‌ను శ్రీదేవి ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. అప్పటికే పెళ్లయిన బోనీకపూర్‌ను ఆమె పెళ్లాడడంతో అప్పట్లో పెద్ద చర్చే జరిగింది. ఇక వీరికి జాన్వీ, ఖుషి అనే ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత శ్రీదేవి తల్లి పాత్రను సమర్థవంతంగా పోషించారు. తల్లి అయ్యాక ఆమె 14 సంవత్సరాల పాటు సినిమాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. తనకు అమ్మా... అనే పిలుపు ఎక్కువ ఆనందాన్నిచ్చిందని శ్రీదేవి ఎప్పటికీ చెబుతుం టారు. ఇక తన ఇద్దరు పిల్లలతో పాటు బోనీకపూర్ మొదటి భార్య పిల్లలతోనూ శ్రీదేవి సామరస్యంగా ఉంటూ కపూర్ కుటుంబంలో ఆమె అందరి అభిమా నాన్ని సొంతం చేసుకున్నట్లు చెబుతారు.

సెకండ్ ఇన్నింగ్స్...

పెళ్లి అయ్యాక సినిమాలకు దూరంగా ఉన్న శ్రీదేవి 2012లో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టారు. గౌరీషిండే దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రంతో తిరిగి సినిమాలు చేయడం ప్రారంభించారు.

ఈ చిత్రం 2012 సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ, తెలుగు, తమిళ్‌లో విడుదలై ఘన విజయం సాధించిం ది. 11 కోట్ల బడ్జెట్‌తో తెర కెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.78 కోట్లను వసూలు చేయడం విశేషం. అనంతరం శ్రీదేవి తమిళంలో 'పులి' చిత్రంలో నటించారు. తమిళ్ స్టార్ హీరో విజయ్ నటించిన ఈ చిత్రం 2015 లో విడుదలైంది. ఆమె చివరి చిత్రం 'మామ్'. 2017 సంవత్సరం జూలై 7న విడుదలైన ఈ చిత్రంలో శ్రీదేవి ప్రధాన పాత్రలో నటించారు. ఆమె భర్త బోనీకపూర్ ఈ చిత్ర నిర్మాతలలో ఒకరు. ఇక తెలుగులో ఘన విజయాన్ని సాధిం చిన 'పోకిరి' చిత్రాన్ని శ్రీదేవి నిర్మాతగా హిందీ లో సల్మాన్‌ఖాన్‌తో 'వాంటెడ్'గా నిర్మించారు.

అదే చివరి చిత్రం అయ్యేది...

బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్‌ఖాన్ మరుగుజ్జు గా నటిస్తున్న చిత్రం 'జీరో'. ఈ చిత్రంలో అను ష్కశర్మ, కత్రినాకైఫ్‌లు హీరోయిన్లుగా నటిస్తు న్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో ప్రత్యేక పాత్ర కోసం శ్రీదేవి ఓకే చెప్పా రు. షెడ్యూల్ ప్రకారం ఈ మూవీ ఈ ఏడాది డిసెంబర్ 21న విడుదలకావాల్సి ఉంది. శ్రీదేవి షూటింగ్ పార్ట్ ఇంకా పూర్తికాలేదు. తన పెద్ద కుమార్తె జాన్వీ నటిస్తున్న తొలి చిత్రం 'ధడక్' పనుల్లో బిజీగా ఉండడంతో 'జీరో' మూవీలో తన పాత్ర షూటింగ్‌ను పూర్తిచేయలేదని తెలిసింది. ఇంతలోనే శ్రీదేవి అనుకోని రీతిలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

కూతురు తెరంగేట్రం కోసం...

తన పెద్ద కూతురు జాన్వీని కథానాయికగా పరిచయం చేయడం కోసం శ్రీదేవి ఎంతగానో తపించారు. గత ఐదు, ఆరు సంవత్సరాలుగా జాన్వీని హీరోయిన్‌గా తెరంగేట్రం చేయించడానికి ఆమె పలు ప్రయత్నాలు చేశారు. ఎన్నో ఆఫర్లు వచ్చినప్పటికీ వాటిని పక్కన పెట్టే సిన శ్రీదేవి చివరికి మరాఠీ బ్లాక్‌బస్టర్ 'సైరాట్' రీమేక్ 'ధడక్' ద్వారా తన కూతురిని పరిచయం చేయడానికి అంగీకరించారు. ముందునుంచి జాన్వీకి అన్ని రకా లుగా చేదోడు వాదోడుగా నిలుస్తూ నటన, డ్రెస్సింగ్, లుక్స్... ఇలా ప్రతి విషయంలోనూ ఆమెను ట్రైన్ చేస్తూ తెరంగేట్రానికి సిద్ధం చేశారు. అన్నీ కుదిరి కొన్ని నెలల క్రిందట జాన్వీ తొలి సినిమా 'ధడక్' సెట్స్‌పైకి వెళ్లింది. కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వెండితెర మీద తన కూతురిని చూసి మురిసిపోవాలని ఎదురు చూస్తూ వచ్చిన శ్రీదేవి ఆ కోరిక తీరకుండానే వెళ్లిపో యారు. దుబాయిలో పెళ్లి కోసం తన భర్త బోనీకపూర్, చిన్న కూతురు ఖుషితో కలిసి శ్రీదేవి వెళ్లారు కానీ జాన్వీ మాత్రం ఇక్కడే ఉండిపోయింది. పెద్ద కూతురు సినిమా షూటింగ్ జరుగుతోంది కాబట్టి ఆమెను దుబాయ్‌కి తీసుకెళ్లలేదు. శ్రీదేవి ఇంతగా ప్లాన్ చేసి కూతురిని కథా నాయికగా చేయడం కోసం అంతగా తపించినా... ఆమె తెరంగేట్రాన్ని చూడకుండానే వెళ్లిపోవడం విచారకరం.

అమితాబ్‌కు ముందే తెలుసా!...?

శ్రీదేవి హఠాన్మరణంతో కోట్లాదిమంది అభిమానులు షాక్‌లో ఉన్నారు. అయితే ఆమెకు అత్యంత సన్నిహితు ల్లో ఒకరైన బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్‌బచ్చన్ శని వారం అర్ధరాత్రి ఒక ట్వీట్ చేశాడు. 'ఎందుకో తెలియ దు... మనసులో కొంచెం అలజడిగా ఉంది' అంటూ బిగ్ బి చేసిన ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. కాసేపటికే శ్రీదేవి మరణ వార్త బయటకు వచ్చింది. సిక్త్‌సెన్స్‌తో ఈ విషయం ముందే తెలుసుకున్న అమితాబ్ ఈవి ధంగా ట్వీట్ చేశారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. శ్రీదేవితో ఐదు సినిమాల్లో నటించిన అమితాబ్‌కు ఆమె కుటుంబంతో మంచి సంబంధాలున్నాయి. ఈ నేప థ్యంలో ఆమె చనిపోయిన వెంటనే బిగ్ బికి సమాచారం అందించి ఉండొచ్చని... వెంటనే విషయం చెప్పి అభిమా నులను విస్మయానికి గురి చేయడం ఇష్టం లేక అమి తాబ్ ఈ ట్వీట్ పెట్టి ఉండొచ్చని కొందరు అంటున్నారు.

దక్కిన అవార్డులెన్నో...

తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించిన శ్రీదేవి పలు అవార్డులను అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆమెను 2013లో అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీతో సత్కరించింది. ఇటు సౌత్‌లో అటు బాలీవుడ్‌లో పలు విజయవంతమైన సినిమాల్లో నటిం చిన శ్రీదేవి 14 సార్లు ఫిలింఫేర్‌కు నామినేట్ కాగా ఆమెకు నాలుగుసార్లు ఉత్తమనటిగా, రెండుసార్లు స్పెషల్ జ్యూరీ అవార్డు దక్కాయి. ఇక తెలుగులో నటిం చిన 'క్షణక్షణం' చిత్రానికిగాను ఆమె ఉత్తమనటిగా నంది అవార్డును అందుకున్నారు.

రామ్‌గోపాల్‌వర్మ ఆవేదన...



అతిలోక సుందరి శ్రీదేవికి రామ్‌గోపాల్‌వర్మను మించిన అభిమాని, ఆరాధకుడు మరొకరు ఉండరేమో. శ్రీదేవి అంటే తనకెంత అభిమానమో తనకు అవకాశం వచ్చిన ప్పుడల్లా చెప్పే వర్మకు ఆమె మరణం అతని గుండెను బద్ధ లయ్యేలా చేసింది. శ్రీదేవి మృతిపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఫేస్‌బుక్‌లో భారీ లేఖనే రాసేశాడు వర్మ. 'శ్రీదేవిని చంపి నందుకు దేవుడిని ద్వేషిస్తున్నా..' అంటూ మొదలుపెట్టిన వర్మ... చివరలో మాత్రం ఆమెను ఎప్పటికీ ప్రేమి స్తూనే ఉంటా... ఆరాధిస్తూనే ఉంటానంటూ ముగించాడు. శ్రీదేవితో తాను తీసిన 'క్షణ క్షణం' సినిమా గురించి... ఆమె అంటే తనకెంత ప్రేమ అన్న విషయాన్ని వివరంగా చెప్పుకొచ్చాడు. తనకు నిద్ర మధ్యలో లేచి ఫోన్‌లో మెసేజ్‌లు చూసుకునే అలవాటు ఉందనీ... శనివారం రాత్రి అలాగే మెసేజ్‌లు చూసుకున్న ప్పుడు శ్రీదేవి మరణ వార్త కనిపించిందని వర్మ చెప్పాడు. ఈ మెసేజ్‌లు చూడగానే తాను షాక్‌కు గురయ్యా నని... పీడకలగా ఫీలయ్యానని చెప్పాడు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ ''విజయవాడలో ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు శ్రీదేవి నటించిన 'పదహారేళ్ల వయసు' సినిమా చూశాను. శ్రీదేవి అందా నికి ముగ్ధుడినైపోయా. అనంతరం నాగార్జునతో 'శివ' సినిమా తీస్తున్న కాలంలో శ్రీదేవిని కలవాలనుకు న్నాను. చెన్నైలో నాగార్జున ఆఫీస్ ఉన్న పక్క వీధిలోనే శ్రీదేవి ఇల్లు ఉండేది. నాగార్జున కోసం వెళ్లినప్పుడల్లా శ్రీదేవిని చూడాలని ఆమె నివాసం బయట ఎదురుచూసేవాడిని. కానీ అప్పట్లో ఆ దేవత దర్శనం నాకు కాలేదు. ఆతర్వాత 'శివ' సూపర్‌హిట్‌గా నిలిచింది. అనంతరం పలువురు నిర్మాతలు నాతో సినిమాలు చేయ డానికి వచ్చేవారు. ఒక రోజు ఓ నిర్మాత శ్రీదేవితో సినిమా చేద్దామని చెప్పి ఆమె ఇంటికి తీసుకెళ్లాడు. రాత్రి సమయంలో వారింటికి వెళ్లగా అప్పుడు కరెంట్ పోయింది. ఆతర్వాత శ్రీదేవి తల్లి వచ్చి తన కూతురు ముంబయ్ వెళ్లడానికి సిద్ధమవుతోంది... బిజీగా ఉందని చెప్పింది. అనంతరం శ్రీదేవి ఓ రూమ్ నుంచి మరో రూమ్‌లోకి వెళ్తూ కనిపించింది. చివరికి ఆమె మాతో మాట్లాడి సినిమా చేసేందుకు ఆసక్తిగా ఉన్నానని చెప్పింది. అనంతరం శ్రీదేవితో సినిమా తీయడానికి 'క్షణక్షణం' స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాను. ఈ చిత్రం షూటింగ్‌లో ఓరోజు శ్రీదేవి అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినందుకు ఆమె కాళ్లు పట్టుకునేందుకు ప్రయత్నిం చాను. తన కాళ్లకు దండం పెడుతుంటే హీరో వెంకటేష్ అలా చేయవద్దని నన్ను అడ్డుకున్నాడు. ఈ సంఘ టనను నేను జీవితంలో మరచిపోలేను''అని పేర్కొన్నాడు.

సినీ ప్రముఖుల సంతాపం

ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారు : చిరంజీవి

అందం, అభినయం కలబోసిన నటి శ్రీదేవి. ఇలాంటి నటి ఇంతవరకు లేరు. ఇకమీద వస్తా రని కూడా నేను అనుకోవటం లేదు. నిజంగా భగవంతుడు ఆమెకు చాలా అన్యాయం చేశాడు. శ్రీదేవి హఠాన్మరణాన్ని నేను జీర్ణించు కోలేకపోతున్నాను. చిన్నప్పటినుంచి ఆమెకు నటన తప్ప మరో వృత్తి లేదు. ఆమె అంకితభా వాన్ని చూసి నేనెంతో నేర్చుకున్నాను. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అత్యద్భుత దృశ్య కావ్యం 'జగదేకవీరుడు అతిలోక సుందరి'. ఈ సినిమాలో దేవకన్య పాత్రలో ఎంతగా ఒదిగిపో యిందంటే ఆమె కోసమే ఆ పాత్ర సృష్టించబ డిందా... ఆ పాత్ర కోసమే ఆమె పుట్టిందా అన్నంతగా నటించింది. ఆతర్వాత శ్రీదేవితో చేసిన ఆఖరి సినిమా 'ఎస్పీ పరశురాం'. సిని మాపరంగానే కాకుండా కుటుంబపరంగానూ శ్రీదేవి నాకు ఎంతో ఆప్తులు. ఆమె మరణవార్త వినగానే షాక్‌కు గురయ్యాను... ఒక గొప్ప నటిని పోగొట్టుకోవడం, మనకు దూరమవడం భారత ప్రజలు, సినీ ప్రజలందరి దురదృష్టమని నేను భావిస్తున్నాను. శ్రీదేవి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

ఆమె పాత్రలన్నీ చిరస్మరణీయాలే : పవన్‌కల్యాణ్

అసమానమైన అభినయంతో భారత ప్రేక్షక లోకం అభిమానాన్ని శ్రీదేవి చూరగొన్నారు. ఆమె ఇకలేరు అనే మాట నమ్మలేనిది. కానీ శ్రీదేవి వెండితెరపై పోషించిన భిన్నమైన పాత్ర లన్నీ చిరస్మరణీయాలే.

భారతీయ చిత్రపరిశ్రమకు తీరనిలోటు: మోహన్‌బాబు

శ్రీదేవి కుటుంబంతో నాకు తిరుపతి నుండి మంచి అనుబంధం ఉంది. ఆమె తల్లి తిరుపతికి చెందినవారు. శ్రీదేవితో కలిసి చాలా సినిమాల్లో నటించాను. భారతీయ చిత్రసీమ మంచి నటిని మాత్రమే కాదు.. ఉన్నతమైన వ్యక్తిని కూడా కో ల్పోయింది. నా 42వ సినీ జీవిత ఉత్సవాలు విశాఖపట్నంలో జరుగుతున్నప్పుడు కేవలం ఫోన్ చేయగానే వైజాగ్ వచ్చి ఆ వేడుకల్లో పా ల్గొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆ శిరిడీ సాయి మనోనిబ్బ రాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

శ్రీదేవి హఠాన్మరణం బాధాకరం : బాలయ్య

శ్రీదేవితో మా నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఆమె ఎలాంటి భావాన్ని అయినా కళ్లతోనే పలికించగల మహానటి. ఆవిడ హఠా న్మరణం చిత్రసీమకు తీరని లోటు. శ్రీదేవి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని వేడు కుంటున్నాను.

స్వయంకృషితో ఎదుగుతూ వచ్చింది : కె. రాఘవేంద్రరావు

శ్రీదేవి మృతి నన్ను కలచివేసింది. నేను అసి స్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆమెతో పరిచయం ఉంది. పదహారేళ్ల వయసు చిత్రం నుండి జగదేకవీరుడు అతిలోక సుందరి వరకు తనతో చాలా సినిమాలు తీశాను. చిత్ర పరిశ్రమలో శ్రీదేవి స్వయంకృ షితో ఎదుగుతూ వచ్చింది.


తొలి లేడీ సూపర్‌స్టార్ : రాజమౌళి

ఈ బాధాకర వార్త విని దిగ్భ్రాంతి చెందాను. శ్రీదేవి తొలి లేడీ సూపర్‌స్టార్. 54 ఏళ్ల వయ సుకే నటిగా 50 ఏళ్లు రాణించడం అద్భుతం. అంత చక్కటి ప్రయాణానికి ఊహించని ముగింపు ఇది. ఆమె ఆత్మకు శాంతి చేకూరా లని కోరుకుంటున్నాను.

శ్రీదేవి అద్భుతమైన నటి : మహేష్‌బాబు

శ్రీదేవి మరణవార్త తెలిసి షాక్ అయ్యాను. చాలా విచారంగా ఉంది. ఆమె అద్భుతమైన నటి, మహిళ. ఎప్పటికీ నా అభిమాన నటి అయిన ఆమె త్వరగా వెళ్లిపోయారు. ఆమె కుటుంబానికి, శ్రేయోభిలాషులకు తట్టుకునే బలం ఇవ్వాలని దేవుడిని కోరుకుంటున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.

వేలానికి స్టీవ్‌జాబ్స్ ఉద్యోగ దరఖాస్తు



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధమైన కంప్యూటర్ దిగ్గజ కంపెనీ– 'యాపిల్ సహవ్యవస్థాపకులు స్టీవ్ జాబ్స్ చిన్నతనంలో ఉద్యోగం కోసం పెట్టుకున్న దరఖాస్తు(సివి) ఇప్పుడు వేలానికి వచ్చింది. తప్పులతో కూడి ఉన్న ఈ కరికులం విటే(సివి) వేలంలో రూ. 32 లక్షలు (దాదాపు 50 వేల డాలర్లు) తెచ్చిపెడుతుందని వేలం నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ సివిని ఆయన 1973లో రూపొందించారు. టెక్నాలజీ రంగంలో పనిచేయడం తన అభిలాష అంటూ ఆయన అందులో పేర్కొన్నారు. ఒకే పేజీ ఉన్న ఈ సివిలో అనేక అక్షర దోషాలున్నాయి. 'స్టీవెన్ జాబ్స్' అని పేరును, 'రీడ్ కాలేజ్' అని అడ్రస్‌ను సివిలో ఇచ్చారు. 18 ఏళ్ల వయస్సప్పుడు ఆయన ఈ సివిని పెట్టుకున్నారు. అయితే ఏ స్థాయి ఉద్యోగానికి దరఖాస్తు చేస్తున్నది పేర్కొనలేదాయన. బోస్టన్‌కు చెందిన ఆర్‌ఆర్ ఆక్షన్ హౌస్ దీన్ని వేలం వేయనుంది. వచ్చే నెల వేలం ప్రక్రియను చేపట్టనున్నారు. మార్చి 8 నుంచి ఈ సివిని వేలానికి బిడ్డింగులు ఆహ్వానిస్తున్నారు. ఈ దరఖాస్తు పంపుకున్న మూడేళ్లకు(1976లో)జాబ్స్, స్టీవ్ ఓజనైక్‌తో కలసి యాపిల్ సంస్థను ప్రారంభించారు. 2011లో క్యాన్సర్ కారణంగా జాబ్స్ కన్నుమూశారు.

ఎఫెర్పిని కొనబోతున్న జెఎస్‌డబ్ల్యు





న్యూఢిల్లీ: భారత ప్రైవేట్ స్టీల్ కంపెనీ జెఎస్‌డబ్ల్యు స్టీల్ రూ. 600 కోట్లకు ఇటలీలోని ఎఫెర్పి స్టీల్ సంస్థను కొనుగోలుచేయబోతోందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. 'ఈ కొనుగోలు ఒప్పందం మార్చి లేక ఏప్రిల్‌కల్లా ఖరారు కానుంది' అని ఆ వర్గాలు తెలిపాయి. ఎఫెర్పి రైల్వేలకు సంబంధించిన ప్రత్యేక పొడగాటి ఉత్పత్తులు, ఆటో పరిశ్రమ విడిభాగాలకు కావలసిన బార్స్, ఎర్త్‌మూవింగ్ వెహికిల్స్, ఇతరములు ఉత్పత్తి చేస్తుంది. ఇటలీలో ఎఫెర్పి రెండో అతిపెద్ద స్టీలు ఉత్పత్తి కంపెనీ. ఈ విషయమై తెలుసుకునేందుకు పంపిన ఇ–మెయిల్‌కు జెఎస్‌డబ్ల్యు స్టీల్ ప్రతిస్పందించలేదు. యూరోప్ ఆటోమొబైల్ వినియోగదారుల అవసరాలు తీర్చేందుకే ఈ కొనుగోలు ఒప్పందం యోచించినట్లు సమాచారం. భారత్ నుంచి హాట్ రోల్డ్(హెచ్‌ఆర్) కాయిల్స్‌ను పంపి, తర్వాత తయారుచేసిన(ఫినిష్డ్) ఉత్పత్తులను అక్కడి వినియోగదారులకు అమ్మనున్నారు. లుచ్చీని అనే ఇటలీ సంస్థ ఆస్తులను కొనాలని 2014లో కూడా జెఎస్‌డబ్ల్యు ప్రయత్నించింది. కానీ అల్జీరియాకు చెందిన కంపెనీల గ్రూపు సెవిటాల్ అప్పట్లో లుచ్చీని సంస్థను కొనుగోలు చేసి దానికి 'ఎఫెర్పి' అని పేరుపెట్టింది.

త్వరలో ఐసిఎస్ఐ ప్రమాణాలు



కోల్‌కతా: ప్రాక్టీస్ చేస్తున్న కంపెనీ సెక్రటరీలు పాటించాల్సిన ఆడిటింగ్ ప్రమాణాలను త్వరలోనే విడుదల చేయనున్నట్టు ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) శనివారం ప్రకటించింది. ఈ ఆడిటింగ్ ప్రమాణాలు స్వభావరీత్యా స్వచ్ఛందమేనని పేర్కొంది. త్వరలోనే నాలుగు ఆడిటింగ్ ప్రమాణాలను ప్రకటించనున్నట్టు ఐసిఎస్ఐ ప్రెసిడెంట్ మకరంద్ లెలె తెలిపారు. నూతన కంపెనీల చట్టం ప్రకారం లిస్టెడ్ కంపెనీలు తప్పనిసరిగా అనుసరించాల్సిన సెక్రటరియల్ స్టాండరడ్స్‌కు కొత్తగా తెచ్చే అకౌంటింగ్ ప్రమాణాలను అనుసంధానం చేయనున్నట్టు ఆయన చెప్పారు. రెండు సెక్రటరియల్ ప్రమాణాల ప్రకారం కంపెనీలు కచ్చితంగా బోర్డు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. కంపెనీలు ఇండిపెండెంట్ డైరెక్టర్లను కూడా నియమించుకోవాల్సి ఉంటుందని, ఈ విషయంలో ఐసిఎస్ఐ సహకరిస్తుందని చెప్పారు. ఛారిటీ గవర్నెన్స్‌కు సంబంధించిన కోడ్‌ను రూపొందించామని, పారదర్శకత, పూర్తి స్థాయిలో వివరాల ప్రకటన కోసం తొమ్మిది మార్గదర్శక సూత్రాలను తెచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. వీటితోపాటు లంచాల వ్యతిరేక కోడ్‌ను కూడా ఐసిఎస్ఐ తీసుకువచ్చిందన్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29210	31240.64	0.31%
ముంబై	29910	31989.30	0%
ఢిల్లీ	29750	31818.18	0%
కోల్‌కతా	30040	32128.34	0%
కేరళ	28300	30267.38	0%
బెంగళూరు	28600	30588.24	0.18%
హైదరాబాద్	29210	31240.64	0.24%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	ఆదివారం	శనివారం	మార్పు (%)
చెన్నై	41600.00	41400.00	0.48
ముంబై	41600.00	41400.00	0.48
ఢిల్లీ	41600.00	41400.00	0.48
కోల్‌కతా	41600.00	41400.00	0.48
హైదరాబాద్	41600.00	41400.00	0.48




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	365
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	363	చెన్నై	395
గోదావరి	363	బెంగళూరు	385

ఏప్రిల్ 1 నుంచి ఇ-వే బిల్లు అమలు

ఇంకా నిర్ణయించని జిఎస్‌టి రిటర్న్ సరళీకరణ

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) అమలును పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన మంత్రుల బృందం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అంతర్రాష్ట్ర సరకు రవాణాకు ఇ–వే బిల్లును అమలుచేయాలని సిఫార్సు చేసింది. అయితే మార్చి 10న జిఎస్‌టి మండలి సమావేశంలో తేదిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అంతర్రాష్ట్ర సరుకు రవాణాకు ఇ–వే బిల్లును రెండు మూడు వారాల్లో దశలవారీగా అమలు చేసే విషయంపై ప్రభుత్వం ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నదని మంత్రుల బృందం కన్వీనర్, బీహార్ ఆర్థిక మంత్రి సుశీల్ కుమార్ మోడీ చెప్పారు. 'ప్రతి వారం 4 నుంచి 5 రాష్ట్రాల్లో అంతర్రాష్ట్ర ఇ–వే బిల్లు అమలును దశలవారీగా అమలు చేయనున్నాం' అని సుశీల్ మోడీ చెప్పారు. అయితే ఈ రాష్ట్రాలను ఏ ప్రాతిపదికన ఎంపిక చేయబోతున్నారన్న విషయాన్ని ఆయన వివరించలేదు. ఇదివరలో ఫిబ్రవరి 1 నుంచి 15 రాష్ట్రాల్లో అంతర్రాష్ట్ర ఇ–వే బిల్లును అమలుపరిచారు. అయితే పూర్తి స్థాయిలో అమలుకు దాని తుదిగడువు(డెడ్‌లైన్)ను వాయిదా వేశారు. మొదట్లో ఇ–వే బిల్లు పోర్టల్‌లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. వాటిని ఎన్ఐసి సరిచేసింది. ఆ కారణంగానే ఇ–వే తుది గడువును వాయిదా వేయడం జరిగింది. ఇ–వే బిల్లు పోర్టల్‌ను సన్నద్ధం చేయడానికి సిస్టం లోడ్ టెస్టింగ్‌ను ఎన్ఐసి రెండు రౌండ్లు



నిర్వహించిందని సుశీల్ కుమార్ మోడీ తెలిపారు. మరి రెండు రోజుల్లో మరో రౌండ్ టెస్టింగ్‌ను కూడా జరపనున్నట్లు తెలిపారు.

ప్రతిరోజు 25 లక్షల నుంచి 50 లక్షల ఇ–వే బిల్లులను రూపొందించడం జరుగుతుందని, అది రోజుకు 75 లక్షల వరకు కూడా పెరగవచ్చని మంత్రుల బృందం భావిస్తోంది. దీనికోసం ఇ–వే బిల్లు సిస్టంను పరీక్షించడం జరిగిందని బీహార్ ఆర్థిక మంత్రి సుశీల్ కుమార్ మోడీ తెలిపారు.

రిటర్నుల దాఖలు : రిటర్నుల దాఖలుకు సంబంధించిన కొత్త మోడల్‌ను మంత్రుల బృందం ఇంకా నిర్ణయించలేదు. ప్రొవిజనల్ క్రెడిట్‌ను అనుమతించడం, పన్ను చెల్లింపుకు క్రెడిట్‌ను అనుసంధానించడం సహా అనేక అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సుశీల్ మోడీ చెప్పారు. ఏది ఎలా ఉన్నా ఇన్వాయిస్ మ్యాచింగ్ సరిపోవాలనే విషయంలో మంత్రుల బృందంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఎందుకంటే వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి)కి ఇదే ఆధారం కనుక. నెలవారీగా రిటర్నుల దాఖలుపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ చిన్న పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన త్రైమాసిక రిటర్నుల దాఖలుపై చర్చ అసంపూర్తిగానే ముగిసింది. నెలకు మూడు జిఎస్‌టి రిటర్నుల దాఖలుకు సంబంధించిన పాత విధానాన్ని జిఎస్‌ట్ కౌన్సిల్ రద్దు చేయాలని నిర్ణయించింది. మొత్తం విధానాన్ని మార్చాలని కూడా నిర్ణ్ణయించింది. జిఎస్‌టి మండలి మూడు విధానాలపై పనిచేస్తోంది. జిఎస్‌టికి ఐటి వెన్నెముక అయిన జిఎస్‌టి యంత్రాంగం ప్రతిపాదించిన రెండు మోడళ్లు, ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకని ప్రతిపాదించి మరొక మోడల్‌పై జిఎస్‌టి మండలి పనిచేస్తోంది. న్యూఢిల్లీలో ఆదివారం యుఐడిఎఐ కార్యాలయంలో జరిగిన మంత్రుల బృందం సమావేశంకు నీలేకని కూడా హాజరయ్యారు.

ఇంగ్లాండ్‌లో ఎస్‌బిఐ పునర్నిర్మాణం

'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యుకె లిమిటెడ్' పేరిట కొత్త బ్రాండ్

లండన్: ఇంగ్లాండ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) కార్యకలాపాల పునర్నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు ఆ బ్యాంకు తెలిపింది. ఇంగ్లాండ్‌లో ఎస్‌బిఐ కార్యకలాపాలను ఏప్రిల్ 1 నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యుకె లిమిటెడ్ అనే అనుబంధం పేరిట నిర్వహించబోతున్నది. ఈ చర్య వల్ల ఇంగ్లాండ్‌లోని ఎస్‌బిఐ రిటైల్ బ్రాంచ్‌లన్నీ కొత్త అనుబంధ సంస్థ కిందికి వచ్చేస్తాయి. అంటే ఇదివరకటి విదేశీ శాఖలనేవి ఉండబోవు. అన్నీ కూడా యుకె–ఇన్‌కార్పొరేటెడ్ బ్యాంకింగ్ సంస్థ కిందికే వచ్చేస్తాయి. 'పైకి కనిపించే మార్పులు పెద్దగా ఏమీ లేకపోయినప్పటికీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యుకె లిమిటెడ్ అన్న కొత్త బ్రాండ్ పేరు మార్పు ఉండబోతుంది. ఇంగ్లాండ్‌లో ఎస్‌బిఐకి మొత్తం 12 రిటైల్ శాఖలున్నాయి. వాటిలో 7 లండన్‌లో, మిగతావి లండన్ బయట ఉన్నాయి. అవన్నీ ఇకపై ఎస్‌బిఐ యుకె లిమిటెడ్ శాఖలు కానున్నాయి. అయితే వాటిని వేరే చోటకి మార్చడం అంటూ ఏదీ ఉండబోదు' అని ఎస్‌బిఐ యుకె ప్రాంతీయ అధినేత సంజీవ్ ఛధా అన్నారు. 'వినియోగదారులు తమ డెబిట్ కార్డులను, బ్యాంకింగ్ సదుపాయాలను ఎప్పటిలానే వినియోగించుకోవచ్చు. యుకె మార్కెట్‌పై వ్యూహాత్మక దృష్టినే కేంద్రీకరించబోతున్నాం. యుకెలో మరింత బిజినెస్ చేయాలనుకుంటున్నాం. యుకె మార్కెట్‌కు అనుగుణంగా ఉత్పత్తులను విస్తరించబో



తున్నాం' అని ఆయన తెలిపారు. విదేశీ మార్కెట్ ఒడిదుడుకుల నుంచి ఇంగ్లాండ్‌లో ఉన్న డిపాజిటర్లను రక్షించేందుకు విదేశీ బ్యాంకులు తమ విదేశీ శాఖ హోదాను వదిలిపెట్టి స్వతంత్ర సంస్థలుగా రూపొందాలని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన ప్రుడెంషియల్ రెగ్యులేషన్ అథారిటీ(పిఆర్ఎ) విదేశీ బ్యాంకులకు జారీ చేసిన ఆదేశాల మేరకే ఈ మార్పు జరిగింది. ' అనుబంధ బ్యాంకుగా మూలధనంకు కంచె వలయం(రింగ్ –ఫెన్స్‌డ్) ఏర్పడుతుంది. అంతేకాక కావలసినంత అదనపు మూలధనం వస్తుంది' అని ఛధా చెప్పారు. ఇంగ్లాండ్‌లో ఎస్‌బిఐ పునర్నిర్మాణం ముఖ్యాంశాలను ఆయన ఎత్తి చూపారు. అంతర్జాతీయ బిజినెస్‌కు లండన్ మంచి ప్రదేశం.

అరబిందో ఫార్మా అమ్మకాల జోరు

లాభాల వృద్ధితో రెండో స్థానానికి



హైదరాబాద్: దేశీయ ఫార్మా రంగంలో అమ్మకాలు తగ్గి బడా ఫార్మా కంపెనీలు కూడా కుదేలవుతున్న తరుణంలో హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా మాత్రం విక్రయాల్లో దూసుకెళ్లింది. అమ్మకాల పరంగా లుపిన్‌ను వెనక్కినెట్టి రెండో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు(ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) రూ. 12,240 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఇదే కాలానికి లుపిన్ అమ్మకాలు రూ. 11,580 కోట్లకు పరిమితం కావడంతో మూడో స్థానంలో నిలిచింది. ఇక సన్‌ఫార్మా రూ. 19,350 కోట్ల విక్రయాలతో తన అగ్రస్థానాన్ని నిలుపుకుంది. మూడు త్రైమాసికాల విక్రయాల్లో అరబిందో ఫార్మా 8.7 శాతం వృద్ధిని నమోదు చేయగా, లుపిన్ అమ్మకాలు 10.6 శాతం, సన్‌ఫార్మా అమ్కాలు 17.4 శాతం క్షీణించాయి. లాభాల విషయంలో అరబిందో వృద్ధి లుపిన్, సన్‌ఫార్మాను మించిపోయింది. అరబిందో సంస్థ ఫార్ములేషన్ విభాగ వ్యాపారం పుంజుకోవడం దాని లాభాలకు దోహదపడింది. మూడు త్రైమాసికాలకుగాను అరబిందో ఫార్మా లాభం వార్షిక (ఇయర్ ఆన్ ఇయర్) ప్రాతిపదికన 7.1 శాతం పెరిగి రూ. 1,770 కోట్లకు చేరింది.

సింభావలీ షుగర్స్ సిఎండిపై సిబిఐ కేసు

ఓరియంటల్ బ్యాంకుకు రూ. 200 కోట్ల టోకరా



న్యూఢిల్లీ: ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఒబిసి)ను రూ. 200 కోట్ల మేరకు మోసగించినందుకు సింభావలీ షుగర్స్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్(సిఎండి) గుర్మీత్ సింగ్ మాన్‌పై, డిప్యూటీ ఎండి గుర్పాల్ సింగ్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, సిఎఫ్ఒ సహా మరి ఎనిమిది మందిపై సిబిఐ కేసు నమోదు చేసింది. హాపుర్‌లోని సింభావలీ షుగర్స్ లి. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఒబిసి)మీరట్ శాఖలో 2011లో, మళ్లీ 2015లో కూడా రూ.200 కోట్ల మేరకు మోసానికి పాల్పడింది.2011లో దాదాపు 5200 మంది చెరుకు రైతులకు ఫైనాన్స్ చేయడం కోసం రూ. 150 కోట్లు రుణంగా కోరింది. అందుకు రైతుల కెవైసిలు సమర్పించింది. అయితే డబ్బును రైతుల ఖాతాలకు బదిలీ చేయగా దాన్ని ఇతర అవసరాలకు మళ్లించింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఒబిసి) రుణ బకాయిని రాబట్టడానికి డెట్ రికవరీ ట్రిబ్యునల్(డిఆర్‌టి)ని ఆశ్రయించగా సింభావలీ షుగర్స్ 2015లో మళ్లీ రూ. 110 కోట్లను రుణాన్ని తన నష్టాన్ని ఒకేసారి తీర్చేసుకునేందుకు తీసుకుంది. సింభావలీ షుగర్స్ లిమిటెడ్ భారత్‌లో అతి పెద్ద షుగర్ రిఫైనరీ కంపెనీల్లో ఒకటి. పైగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజిలో లిస్ట్ అయింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు సింభావలీ షుగర్స్ లిమిటెడ్ రూ.109 కోట్ల నష్టాన్ని కలిగించిందని సిబిఐ తెలిపింది. రుణ ఖాతా రూ. 148.59 కోట్లను నిరర్థక ఆస్తిగా(ఎన్‌పిఎ) 2015 మార్చిలో ప్రకటించారు. 2015 మేలో మోసంను గుర్తించారు.





నీరవ్ మోడీ, చోక్సీ ఆస్తుల వివరాలు కోరిన ఇడి

15–17 దేశాలకు ఎల్‌ఆర్‌లు పంపే యత్నం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో జరిగిన కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దర్యాప్తును విస్తృతపరిచింది. ఇందులో భాగంగా నీరవ్ మోడీ, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ ఆస్తుల వివరాలు తెలపాల్సిందిగా అనేక విదేశాలను కోరింది. 15 నుంచి 17 దేశలకు లెటర్స్ రొగెటరీస్(ఎల్‌ఆర్‌లు) పంపేందుకు ముంబయిలోని కోర్టును ఆశ్రయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఎల్‌ఆర్‌లను పంపనున్న దేశాల్లో బెల్జియం, హాంకాంగ్, స్విట్జర్లాండ్, అమెరికా, ఇంగ్లాండ్, దుబాయ్, సింగపూర్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. కొన్ని దేశాలకు ఏజెన్సీ టు ఏజెన్సీ ఆధారంగా కొన్ని అధికార వినతులు పంపనున్నట్లు కూడా ఆ వర్గాలు తెలిపాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. 11,400 కోట్ల మేరకు నీరవ్ మోడీ, చోక్సీ మోసగించారన్న ఆరోపణ ఉంది. అయితే వారి బ్యాంకు ఖాతాలు, ఆస్తులు, భాగస్వామ్యాలు, షోరూమ్స్, ట్రస్ట్‌లు, ఇతర ఆస్తుల వివరాలు కోరే విధంగా న్యాయ వినతులకు ఇడి యత్నిస్తోంది. ఈ ఆస్తులపై దర్యాప్తు చేసి, అవసరమైతే అక్రమ నగదు చెలామణి నిరోధక చట్టం(పిఎంఎల్‌ఎ) సెక్షన్ల కింద వారి ఆస్తులను జప్తు చేయనుంది. ఇదిలా ఉండగా ముంబయిలోని తమ జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) మోడీ, ఆయన భార్య అమీ, చోక్సీలకు సమన్లు పంపింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కాకుండా వేరే 16 ఇతర బ్యాంకులను వివరాలు తెలుపాల్సిందిగా కూడా ఇడి కోరింది. ఇంతేకాకుండా 2011 నుంచి పిఎన్‌బి నిర్వహించిన ఆడిట్ రిపోర్టులను కూడా తెలుపాల్సిందిగా భారత రిజర్వు బ్యాంకును(ఆర్‌బిఐ) కోరింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఇడి మొత్తంగా రూ. 6393 కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేసిందని అధికారులు తెలిపారు. ఇది స్వతంత్రంగా లెక్కించిందని పేర్కొన్నారు.పిఎన్‌బి కుంభకోణం కేసులో సిబిఐ, ఇడి ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశాయి. వారి మీద క్రిమినల్ కేసులు పెట్టక ముందే నీరవ్ మోడీ, చోక్సీ దేశం విడిచిపెట్టిపోయారు.

స్విఫ్ట్‌తో సిబిఎస్ అనుసంధానించాలి: ఆర్‌బిఐ

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) అప్రమత్తమైంది. అన్ని బ్యాంకులూ తమ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సిబిఎస్)ను సొసైటీ ఫర్ వరల్డ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్స్ (స్విఫ్ట్)తో అనుసంధానించాలని ఆదేశించింది. ఇందుకు ఏప్రిల్ 30 తుది గడువుగా పేర్కొన్నట్టు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (బిఇ) ఛైర్‌పర్సన్, అలహాబాద్ బ్యాంక్ ఎండి, సిఇఒ ఉషా అనంత సుబ్రమణియన్ తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో వేగవంతంగా స్విఫ్ట్, సిబిఎస్ అనుసంధానించడం అత్యవసరమని ఆమె చెప్పారు. తమ బ్యాంక్ కూడా స్విఫ్ట్, సిబిఎస్‌ను అనుసంధానం చేయలేదని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తమ బ్యాంకు శాఖలకు సూచనలు చేసినట్టు ఆమె చెప్పారు. లోపాలను సరిదిద్దుకునేందుకు అన్ని బ్యాంకులు తమ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పునః పరిశీలించాలని ఆమె అన్నారు.

ఈవారం ఆర్థిక గణాంకాలే కీలకం

దేశీయ, అంతర్జాతీయ అంశాలపై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

న్యూఢిల్లీ: ఈవారం దేశీ స్టాక్ మార్కెట్లు దేశీయ, అంతర్జాతీయ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.ప్రధానంగా ఆర్థిక వ్యవస్థ పురోగతిపై దృష్టిసారించాలంటున్నారు. 2017–18 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వివరాలను కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించనుంది. రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లోజిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 6.3 శాతం పుంజుకున్న విషయం తెలిసిందే. అలాగే తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో వృద్ధి రేటు 5.7 శాతమే ఎగసింది. ఇక క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో దేశ ఆర్థిక వ్యవస్థ 6.57 శాతం వృద్ధి సాధించగలదని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ గణాంకాలు మార్కెట్ సెంటిమెంటును ప్రభావితం చేసే వీలున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగనున్న అంచనాలతో రెండు వారాల క్రితం ప్రపంచవ్యాప్తంగా స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. గత వారం తిరిగి అమెరికాసహా ఆసియా వరకూ మార్కెట్లు కోలుకున్నాయి. గత రెండు రోజుల్లో అమెరికా మార్కెట్లు జోరందుకోవడంతో దేశీయంగానూ వారాంతాన జోష్ కనిపించింది. దీంతో వచ్చే వారం తొలి సెషన్ సానుకూలంగా ప్రారంభమయ్యే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. సోమవారం జనవరి నెలకు అమెరికా కొత్తగా నిర్మించిన గృహ విక్రయ గణాంకాలు వెల్లడికానున్నాయి. కాగా గతవారం మార్కెట్లు కొనుగోళ్ల ఊపుతో లాభాల బాటపట్టాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం,



లాంగ్ టర్మ్ గెయిన్ పన్ను వంటి అంశాలు ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయి. గ్లోబల్ మార్కెట్ల ప్రభావంతో మార్కెట్ సూచీలు కరెక్షన్‌కు గురవుతున్నాయి. అయితే మార్కెట్లలో ఇంకా కొంత కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లు లాభాలను కొనసాగించే అవకాశం ఉన్నా..పతనం అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. 9900–10000 లెవెల్‌కు నిఫ్టీ దిగి వచ్చే సూచనలు ఎక్కువగానే ఉన్నాయని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లాంగ్‌టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించడం.. ఇన్వెస్టర్లలో కొంత ప్రతికూలతను నింపింది.అయినప్పటికీ దీర్ఘకాలికంగా పెట్టుబడులు చేసేవారిపై ఇదిపెద్దగా ప్రభావం చూపబోదని నిపుణులు అంటున్నారు. ఎల్‌టిసిడి ప్రభావం తాత్కాలికమే అని చెబుతున్నారు.విదేశీ ఇన్వెస్టర్లు మాత్రం ఈ అంశాన్ని అసలు పట్టించుకునే అవకాశం లేదనే వాదనవినిపిస్తోంది.



అమ్మకాలకే ఎఫ్‌పిఐల మొగ్గు

దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) మొగ్గు చూపిస్తున్నారు. మరోవైపు డాలరుతో మారకంలో రూపాయి 3 నెలల కనిష్టాన్ని తాకింది. దీంతో ఇకపై ఎఫ్‌పిఐల పెట్టుబడుల ధోరణి, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, ముడిచమురు ధరలు వంటి అంశాలు కూడా మార్కెట్ల ట్రెండ్‌ను నిర్దేశించగలవని విశ్లేషకులు చెబుతున్నారు.

హోలీ రోజు మార్కెట్లకు సెలవు

హోలీ సందర్భంగా శుక్రవారం(మార్చి 2న) స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు ప్రకటించారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బిఎస్ఇ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ పనిచేయవు. దీంతో వచ్చే వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ నాలుగు రోజులే ఉండనుంది.

తాగునీటి ప్రాజెక్టుల ద్వారా దేశవ్యాప్త ఉపాధి : ఉమా భారతి



న్యూఢిల్లీ: తాగునీరు, వ్యర్థ నిర్వహణ ప్రాజెక్టు ద్వారా ఉపాధిని సృష్టించే ఉత్తరకాశి నమూనాను దేశ వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేంద్రమంత్రి ఉమా భారతి తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశిలో స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టిన వ్యర్థ నిర్వహణ, తాగు నీరు ప్రాజెక్టు 'స్వజల్'ను ఆమె ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని మహిళలందరూ ప్రాజెక్టు ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు విస్తరిస్తరించి, ఉపాధి అవకాశాలను పెంపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. 1996– 97లో ఉత్తరప్రదేశ్‌లోని సాదగ్‌లో ఈ ప్రాజెక్టు మొదటిసారిగా ప్రారంభమైంది. తాగునీరు, పారిశుధ్య పథకాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఉత్తరప్రదేశ్, అసోం, మహారాష్ట్రతో సహా ఐదు రాష్ట్రాలలో విస్తరించనున్నట్లు తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వశాఖ డైరెక్టర్ యుగళ్ కిశోర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు పైపులైన్లు వేయడం జరుగుతుంది. కాల్వల వెంట నగదు పంటలను పండించేందుకు సహాయమందిస్తారు. ఈ కార్యక్రమాలన్నింటిలో గ్రామీణ ప్రజలను భాగస్వామ్యం కల్పిస్తారు.

రేషన్‌తో ఆధార్ డెడ్‌లైన్‌కు బాంబే హైకోర్టు తిరస్కరణ



ముంబయి: రేషన్‌తో ఆధార్ అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31 గడువును బాంబే హైకోర్టు తిరస్కరించింది. పేర్లు, అడ్రస్, వృత్తి, కుల వివరాలు తప్పుగా ముద్రితమవడంతో నాసిక్ నివాసితులు పడుతున్న ఇబ్బందులపై అజీజ్ పఠాన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై జస్టిస్ శాంతను కేమ్కర్, రాజేష్ కేట్కర్లలతో కూడిన హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. రేషన్ కార్డును డిజిట లైజేషన్ చేయడానికి నివాసితులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించిన అనంతరం ఆధార్‌తో అనుసంధానం చేయడాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ప్రజా పంపిణీ ద్వారా తమ ప్రయోజనాలకు భంగం కలుగకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని ఫిర్యాదు దారుడు విజ్ఞప్తి చేశారు. అతడి ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించింది.

లేడీస్ కంపార్ట్‌మెంట్లలో కెమెరాలు

కోల్‌కతా: అగ్నేయ రైల్వే(ఎస్ఇఆర్)కు చెందిన ఇఎంయు లోకల్ రైళ్లలోని లేడీస్ కంపార్ట్‌మెంట్లలో మహిళ భద్రతకు సిసి కెమెరాలను అమర్చనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ, మధ్య, సెంట్రల్ రైల్వేలు అనుసరించిన విధానాలను అగ్నేయ రైల్వే అనుసరిస్తోంది. భద్రతా కారణాలతో కోచ్‌ల లోపల అనుమానాస్పద చర్యలను తెలుసుకునేందుకు సిసి టీవీ కెమెరాలను అమర్చనున్నట్లు ఎస్ఇఆర్ అధికార ప్రతినిధి సంజయ్ ఘోష్ తెలిపారు. సిసిటివి కెమెరాలతో అమర్చేందుకు 12 కొత్త ఉపకరణాలను చెన్నైలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి తెప్పించినట్లు తెలిపారు. మహిళలకు కేటాయించిన ప్రతి కోచ్‌లో ఏడు సిసిటివి కెమెరాలను అమర్చనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల్లోకి వెళ్లే రైళ్లనన్నింటిలో క్రమంగా సిసి కెమెరాలను అమర్చనున్నట్లు ఆయన తెలిపారు. డ్రైవర్, గార్డ్ క్యాబిన్ నుంచి వీటిని పర్యవేక్షించనున్నారు. ఏదైన అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే చర్య తీసుకునేందుకు వీలవుతుందని ఎస్ఇఆర్ అధికార ప్రతినిధి తెలిపారు.

చైనా భాష నేర్చుకుంటున్న జవాన్లు

భోపాల్: సరిహద్దు వద్ద చైనా సైన్యంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా ఉండేందుకు భారత ఐటిబిపి(ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్) జవాన్లు చైనా భాషను నేర్చుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లోని సాంచీ యూనివర్సిటీ ఆఫ్ బుద్ధిస్ట్‌ఇండిక్ స్టడీస్‌లో ఐటిబిపి జవాన్ల కోసం ప్రత్యేకంగా చైనా భాషపై ఏడాది పాటు సర్టిఫికెట్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సును గతేడాది ఇద్దరు ఐటిబిపి ఇన్‌స్పెక్టర్లతో పాటు కొంత మంది జవాన్లు పూర్తి చేశారు. ఇప్పుడు మరో 25 మంది జవాన్లు చైనా భాష నేర్చుకునేందుకు యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ రాజేశ్ గుప్తా వెల్లడించారు. 201617 విద్యాసంవత్సరంలో నలుగురు ఐటీబీపీ జవాన్లు చైనా భాష నేర్చుకునే కోర్సును పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో మరో 25 మంది జవాన్లు కోర్సు నేర్చుకునేందుకు వస్తున్నారన్నారు. ఐటిబిపి జవాన్లకు ఏవేవి అవసరమో అవే ఇందులో నేర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సు పుస్తకాలు హిందీ, ఇంగ్లిష్, చైనా భాషల్లో అందిస్తున్నట్లు తెలిపారు. 2012లో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. చైనా సైన్యంతో సంప్రదింపులు జరపాలంటే అందుకు భాష ఇబ్బందికరంగా మారుతుందని గతేడాది కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దాన్ని అధిగమించేందుకు ఐటిబిపి జవాన్లు చైనా భాషను నేర్చుకోవాలని, అందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

పాక్ దౌత్యవేత్తపై ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించనున్న భారత్

న్యూఢిల్లీ: పాకిస్థాన్ దౌత్యవేత్త జుబేర్ అలీ సిద్ధిఖీపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసే ప్రక్రియను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రారంభించింది. దక్షిణ భారతదేశంలో అమెరికా,ఇజ్రాయెల్ కాన్సులేట్లపై ఉగ్ర దాడికి కుట్ర పన్నాడనే ఆరోపణలతో అతనిపై గతవారం చార్జిషీట్ నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయానికి తెలియజేసేందుకు సమాచారమంతా సిద్ధం చేసినట్లు ఎన్ఐఎ తెలిపింది. 2014లో శ్రీలంకలోని కొలంబోలో పాక్ వీసా కౌన్సిలర్‌గా పని చేస్తూ కుట్ర చేసినట్లు తెలిపింది. శ్రీలంక జాతీయుడు సకీర్ హుస్సేన్‌ను తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేసి, విచారించడంతో సిద్ధిఖీ వ్యవహారాన్ని బయట పడింది. ఈ కేసుపై ఎన్ఐఎ సమగ్ర దర్యాప్తు చేపట్టింది. విదేశీ కాన్సులేట్లపై దాడి చేయడంతో పాటు, నకిలీ పెద్దనోట్లను చలామనీ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను ధ్వంస చేయాలని కుట్ర చేసినట్లు ఎన్ఐఎ పేర్కొంది.

స్కూళ్ల ప్రార్థనల్లో గాయత్రి మంత్రం

చండీగఢ్: స్కూళ ఉదయం ప్రార్థనల్లో గాయంత్రి మంత్రాన్ని ప్రవేశపెట్టేందుకు నిర్ణయించినట్లు హర్యానా విద్యాశాఖ మంత్రి రామ్ బిలాస్ శర్మ తెలిపారు. పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ఇతర వాటారులతో సమావేశానంతరం నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మంగళవారం జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. దేవునికి పఠించే అన్ని ప్రార్థనల్లో కెల్లా గాయత్రి మంత్రం అత్యున్నతమైందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని శర్మ తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠ్యాంశాల్లో గీతా శ్లోకాలను ప్రవేశ పెట్టడంతో సానుకూల ఫలితాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడగా విమర్శించింది.

సిబిఎఫ్‌సి సర్టిఫికేషన్ ఉండాల్సిందే!

- సినిమా థియేటర్ల యజమానులకు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: సినిమా థియేటర్లలో ప్రదర్శించే ప్రకటనలకు సిబిఎఫ్‌సి సర్టిఫికేషన్ ఉండాలన్న నిబంధనను తొలగించాలని థియేటర్ల యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం తోసిపుచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం సినిమాలు, సినిమాల ట్రైలర్లు, ప్రకటనలు, ప్రజా సేవా సందేశాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) సర్టిఫికేట్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ జారీ అయిన త ర్వాత మాత్రమే వీటిని థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉంటుంది. అయితే ప్రకటనలను టెలివిజన్‌లో ప్రసారం కోసం సర్టిఫై చేస్తారని, వాటికి మరోసారి సిబిఎఫ్‌సి సర్టిఫికేషన్ అవసరం లేకుండా చేయాలని థియేటర్ల యాజమాన్యాలు కోరాయి. ఈ విజ్ఞప్తికి కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. కాని, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మాత్రం ఈ విధానం కొనసాగాలని తెలిపింది.

విజయాల మధ్య

తేడా గుర్తించండి

- కాంగ్రెస్ సంస్కృతితో పుదుచ్చేరికి నష్టం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



పుదుచ్చేరి: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పుదుచ్చేరిలో బిజెపి ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఓ కుటుంబం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 48ఏళ్లు పరిపాలించిందన్నారు. వచ్చే మే నెలతో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 48 నెలలు పూర్తవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సాధించిన విజయాల మధ్య తేడాను మేధావులు చర్చించాలన్నారు. వారసత్వ రాజకీయాల కాంగ్రెస్ ప్రభుత్వాలకు, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలిస్తున్న ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తేడాను గుర్తించాలన్నారు. పుదుచ్చేరిలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ ఈ ప్రాంతానికి సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. కాంగ్రెస్ సంస్కృతి వల్ల పుదుచ్చేరి నష్టపోయిందన్నారు. కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభల ఎన్నికల్లో బిజెపి గెలవబోతోందని, పుదుచ్చేరిలో నారాయణ స్వామి నేతృత్వంలోని ప్రభుత్వం మాత్రమే కాంగ్రెస్‌కు మిగులుతుందని చెప్పారు. కాంగ్రెస్ జూన్ తర్వాత నారాయణ స్వామిని ఉదాహరణగా చూపించబోతోందని, అందుకు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు.

భారతే ఆధ్యాత్మిక గమ్యస్థానం

- ఎన్నో మతాల ఆవిర్భావం ఇక్కడే!

ఆరోవిల్లే: ప్రపంచానికి భారతదేశం ఎప్పటికీ ఆధ్యాత్మిక గమ్యస్థానమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. యుగయుగాలుగా భారత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోందన్నారు. వివిధ మతాలు, సంస్కృతుల సహజీవనం, పరస్పర గౌరవాలకు ఇక్కడ ఎంతో అవకాశం ఉందన్నారు. ప్రపంచంలోని చాలా మతాలు భారత్‌లోనే ఆవిర్భవించాయని చెప్పారు. ఇవన్నీ ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తున్నాయన్నారు. పుదుచ్చేరికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరోవిల్లే ఇంటర్నేషనల్ టౌన్‌షిప్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. ఆరోవిల్లే అంటే సూర్యోదయ పట్టణం అని అర్థం.

ఎత్తోండ సహకార సంఘంలో

టిఆర్ఎస్ చిచ్చు



మన తెలంగాణ/హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తోండ సహకార సంఘంలో అధికార టిఆర్ఎస్ పార్టీ చిచ్చు పెట్టేందుకు పూనుకుందని టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి ఆరోపించారు. ఎంతో కష్టపడి చైర్మన్ సోమశేఖర్‌రావు సహకార సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తే టిఆర్ఎస్ రాజకీయ కక్ష సాధిస్తూ నష్టం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎత్తోండ సహకార సంఘం 1995లో రూ.2.3 కోట్ల లావాదేవీలతో కార్యకలాపాలను చేపడుతుండగా సోమశేఖరరావు కష్టపడి దాదాపు రూ.100 కోట్ల స్థాయికి తీర్చిదిద్దారని ఆయన వివరించారు. ఈ సంఘం వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి నియో జకవర్గం పరిధిలో ఉండడంతో టిఆర్ఎస్ నాయకులు కక్ష సాధింపు ధోరణితో సంఘాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన వివరించారు.

మోడీవి ఎన్నికల వాగ్దానాలే

- అవినీతి అరికట్టడంలో ప్రధాని విఫలం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ధ్వజం



బాగల్‌కోట్ (కర్ణాటక): అవినీతిని కట్టడి చేయడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విఫలమయ్యారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అవినీతిని సహించేది లేదని మోడీ చెప్తున్న మాటలు కేవలం ఎన్నికల వాగ్దానాలేనన్నారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోడీ వాగ్దానాలను గుర్తుచేస్తూ తాను దేశానికి కాపలాదారుగా ఉంటానని అనేవారని రాహుల్ చెప్పారు. మాజీ ముఖ్యమంత్రుల్లో ఒకరు, నలుగురు మంత్రులు జైలు శిక్ష అనుభవిస్తున్నా, ఇంకా అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానని ఈ 'కాపలాదారు' చెప్తున్నారని దుయ్యబట్టారు. బిజెపి పాలిత రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. గుజరాత్ శాసన సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలు తనకు చాలా ఫిర్యాదులు చేశారన్నారు. తమ రాష్ట్రంలో విద్య నేర్చుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిందని తనకు చెప్పారన్నారు. ఆ రాష్ట్రంలోని ప్రధాన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ప్రైవేటు పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నాయని ఆయన అన్నారు.

'వృక్షతన్' ప్రారంభం

విజయపురి: పర్యావరణ పరిరక్షణ, నీరు, చెట్ల సంరక్షణ ప్రచార కార్యక్రమమైన వార్షిక మారథాన్ 'వృక్షతన్'ను కర్నాటకలోని విజయపురిలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వందలాదిమంది ప్రజలు పసుపు రంగు గల టీషర్ట్ ధరించి 17వ శతాబ్దపు సుల్తాన్ మహ్మద్ అదిల్ షా మ్యూజియం గోల్ గుంబజ్ ప్రవేశ ద్వారం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మారథాన్‌ను పరుగును ప్రారంభించారు. కాగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య రాహుల్ గాంధీ రాష్ట్ర నీటి వనరుల శాఖమంత్రి ఎంబి పటేల్, కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, కర్నాటక ఇన్‌చార్జ్ కెసి వేనుగోపాల్‌తో కలిసి గోల్ గుంబజ్‌కు చేరుకొని అక్కడ గుమిగూడిన కొంత మందితో కరచాలనం చేశారు. జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించిన అనంతర్ రాహుల్ గాంధీ కూడా అందరితో కలిసి కొన్ని మీటర్ల దూరం పరుగు తీశారు. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ త్వరలో ఎన్నికలు జరగనున్న కర్నాటకలోని పశ్చిమ జిల్లాల్లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు.



కేంద్రం ప్రతివాదిగా గతేడాది సుప్రీంలో పెరిగిన కేసులు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వాన్ని ప్రతివాదిని చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు నమోదవుతున్నాయి. వీటి సంఖ్య ఏటా అంతకంతకూ పెరుగుతున్నాయి. గతేడాది వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. వాటిలో ఎక్కువగా నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుపై, పన్నుల వ్యవహారాలపై కేసులు నమోదైనట్లు స్వయంగా న్యాయమంత్రిత్వ శాఖ అధికారులే వెల్లడించారు. న్యాయమంత్రిత్వశాఖ వద్ద ఉన్న తాజా గణాంకాల ప్రకారం గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేరుస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో 4,229 కేసులు దాఖలయ్యాయి. ఇదే తరహా కేసులు 2016లో 3,497 దాఖలు కాగా, 2015లో జనవరి 1 నుంచి డిసెంబర్ 31 మధ్య కాలంలో 3,909 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 22 వరకు కేంద్రాన్ని ప్రతివాదిగా చేరుస్తూ 859 కేసులు వేశారు. కాగా, 2012లో ప్రభుత్వాన్ని జోక్యం చేస్తూ సుప్రీంకోర్టులో 4,149 కేసులు దాఖలు కాగా, వాటి సంఖ్య 2013లో 4,772కు చేరినట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 సంవత్సరంలో 4,748 కేసులు నమోదైనప్పటికీ మరుసటి సంవత్సరం (2015)లో వాటి సంఖ్య 3,909కి తగ్గింది. ఇదిలా ఉండగా, ఒకవైపు సుప్రీంకోర్టులో కేసులు సంఖ్య పెరుగుతున్నా కొద్దీ, వాటిని వాదించే న్యాయాధికారుల సంఖ్య మాత్రం క్రమంగా తగ్గిపోతోంది. సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరుపున వాదించే న్యాయాధికారుల సంఖ్యను వచ్చే వారానికి 10కి పెంచనున్నప్పటికీ ఇంతవరకు తదుపరి సొలిసిటర్ జనరల్ ఎవరు అనే దానిపై ఎలాంటి ప్రకటన వెలువడడం లేదు. అదే విధంగా అదనపు సొలిసిటర్ జరనల్ పదవికి అమన్ లేఖి, మాధ్వి దివాన్, సందీప్ సేథి, బిక్రంజీత్ బెనర్జీ పేర్లను న్యాయ మంత్రిత్వశాఖ అధికారులు సిఫార్సు చేస్తూ తుది ఆమోదం కోసం ప్రధాని కార్యాలయానికి ఫైలను పంపారు. వచ్చే వారంలో నాలుగు పేర్లకు కేబినెట్ నియామకాల కమిటీ తుది ఆమోదం తెలిపే అవకాశముంది. గత ఏడాది అక్టోబర్‌లో సొలిసిటర్ జనరల్ పదవికి రంజిత్ కుమార్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఆ పదవికి ఖాళీ ఏర్పడింది. ఈ పదవిలో ఎవరిని నియమిస్తారనే దానిపై న్యాయమంత్రిత్వశాఖ ఇప్పటి వరకు ప్రకటన చేయలేదు.

ఆగాఖాన్ రాజు పర్యటనకు ఏర్పాట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆగాఖాన్ రాజు హైదరాబాద్ పర్యటనను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. షియా ఇమామి ఇస్మాయిలి ముస్లిం జమాత్ సంస్థ వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన నిజాం కళాశాల మైదానంలో సభ్యులను ఉద్దేశించి ఆగాఖాన్ ప్రసంగించనున్నారు. ఈ పర్యటనను దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆదివారం పరిశీలించారు. ఇస్మాయిలి జమాత్ వజ్రోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా ముస్లిం నేతలకు ఉప ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.





బెంగళూరు: భారత రక్షణ రంగ పరిశోధనల్లో కీలక ముందడుగు పడింది. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో చేసిన మానవరహిత విమానం రుస్తుం2 వైమానిక పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసుకుంది. ఆదివారం కర్నాటకలోని చిత్రదుర్గా జిల్లాలో శాస్త్రవేత్తలు ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ మానవ రహిత విమానం ఏకబిగిన 24 గంటల పాటు ప్రయాణించగలదు. నిఘా అవసరాలు తీర్చడంతోపాటు శత్రువులపై దాడికూడా చేయగలదు. ప్రస్తుతం పరీక్షించిన రుస్తుం2లో అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను ఉపయోగించినట్లు డీఆర్‌డీవో పేర్కొంది. ఈ పరీక్షలను డీఆర్‌డీవో చైర్మన్ క్రిస్టఫర్, ఏరోనాటికల్ డీజీ సీపీ రామనారాయణన్, డీజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ మంజులా ఇతర శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,500 కోట్లు ఖర్చుపెట్టింది.

నేడు కాంగ్రెస్‌లోకి ఫిరోజ్‌ఖాన్

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌లోని నాంపల్లి దర్గా వద్ద టిపిసిసి అధ్యక్షులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా నాంపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు ఫిరోజ్‌ఖాన్‌తో పాటు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కాగా ఫిరోజ్‌ఖాన్ నాంపల్లి నియోజకవర్గం నుంచి టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేశారు.

మిడ్ మానేరు నుంచి గోదావరి నీళ్లతో చెరువులను నింపే యత్నాలు

చెరువులకు గోదావరి నీరు

మన తెలంగాణ/హైదరాబాద్: మిడ్ మానేరు నుంచి గంధమళ్ల, బస్వాపూర్ వరకు ఉన్న చెరువులను గోదావరి నీటితో నింపడానికి ఇరిగేషన్ శాఖ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందుకోసం ప్రధాన కాలువకు అనుబంధంగా ఎంతవరకు గొలుసుకట్టు చెరువులను అనుసంధానం చేయవచ్చో ఇంజినీర్లు అధ్యయనం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలను పూర్తిచేయాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటిని అనుసంధానంగా ఉన్న కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌ల నిర్మాణం, పంపుల ఏర్పాటు మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించింది. బ్యారేజీల నిర్మాణం పూర్తికాకున్నా, కాఫర్ డ్యాం నిర్మాణంతో నిలిచిన నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్‌చేసి, వచ్చే ఖరీఫ్ సీజన్లో ప్రజానీకానికి, రైతాంగానికి చూపించాలన్న ఉద్దేశంతో కాళేశ్వరంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లి చేరే నీటిని మేడారం, రామడుగు పంపుల వద్ద ఎత్తిపోసి వరద కాలువ మీదుగా మిడ్‌మానేరు తరలిస్తారు. ఈ పనులన్నీ చివరి దశకు చేరాయి. మిడ్ మానేరుకు చేరిన నీటిని అనంతగిరి రిజర్వాయర్, శ్రీరంగనాయక సాగర్‌ల మీదుగా మల్లన్న సాగర్‌కు తరలించాల్సి ఉన్నా ఈ రిజర్వాయర్ల పనులు పూర్తికావడంలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా కాలువల ద్వారా నీటిని నిర్దేశిత ప్రాంతాలకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. కెనాల్ అనుబంధ మార్గంలో ఉన్న గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పటిష్టం చేస్తూ, గోదావరి నీటితో ఆయా చెరువులు నింపుతూ వాటికి జలకళ తేవాలని, తద్వారా కాళేశ్వరం విజయగాధను చాటుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. అనంతగిరి, రంగనాయక సాగర్‌లకు జులైలోపు పూర్తిచేయాలని భావిస్తుండగా, మల్లన్నసాగర్ నిర్మాణ పనులు ఆశాజనకంగా లేవు. ఈ రిజర్వాయర్ అందుబాటులోకి రావాలంటే మరో రెండు, మూడేళ్లు పట్టే అవకాశం ఉంది. ఇదేవిధంగా ఇక్కడి నుంచి ఒక కెనాల్ ద్వారా గంధమళ్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు, మరో కెనాల్ ద్వారా కొండపోచమ్మ సాగర్‌ను నింపాల్సి ఉంటుంది. ఇవి కూడా గడువులోపు పూర్తికావడం అనుమానమేనని ఇంజినీర్ల అభిప్రాయం. మెయిన్ కెనాళ్లను తొందరగా పూర్తిచేసి, వీలున్నమేర నీటిని గొలుసుకట్టు చెరువుల్లో నింపాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఇందుకోసం గొలుసుకట్టు చెరువుల మ్యాప్‌లు, మెయిన్ కెనాల్‌కు ఎక్కడెక్కడ లింకు చేయవచ్చో అధికారులు పరిశీలిస్తున్నారు. ఇలా చేస్తే మేడిగడ్డ నీటితో కనిష్టంగా 200 నుంచి గరిష్టంగా 600 వరకు చెరువులు నింపవచ్చని అధికారుల భావన.



హెచ్1బి వీసా కొత్త పాలసీ మార్గదర్శకాలు జారీ

వాషింగ్టన్ : అమెరికన్ల ఉద్యోగాలను, కార్మికులను కాపాడాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన కొత్త హెచ్1బి వీసా విధానాల వివరాలకు సంబంధించిన మార్గదర్శకాల జాబితాను అమెరికా పౌర, వలసల సేవల విభాగం (యుఎస్‌సిఐఎస్) విడుదల చేసింది. కొత్త విధానం ప్రకారం మూడో పార్టీ సైట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు తమ వీసాను పొడిగించుకోవాలనుకుంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. వాళ్లు ఎన్ని సంవత్సరాలుగా సదరు కంపెనీలో పనిచేస్తున్నారు అనేది చెప్పాల్సి ఉంటుంది. మూడో పార్టీ వర్క్‌సైట్‌లో హెచ్1బి వీసాదారుడి పొడిగింపునకు ఎంత వరకు అవసరం ఉన్నదో తెలియజేస్తూ.. ప్రత్యేక వృత్తిలో ప్రత్యేక అసైన్‌మెంట్‌లు చేపట్టనున్నట్లు రుజువు చేయడానికి కావాల్సిన ఆధారాలన్నింటినీ సదరు కంపెనీ సమర్పించాల్సి ఉంటుందని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి తెలిపారు. మూడో పార్టీ వర్క్‌సైట్‌లో పనిచేస్తున్న హెచ్1బి వీసాదారుడు అనుసరించాల్సిన విధి విధానాలు ఈ కొత్త పాలసీలో ఉన్నాయి.అమెరికా ఉద్యోగులు, హెచ్1బి నాన్ ఇమ్మిగ్రెంట్ వర్కర్ల పని విధానాలు, వారి వేతనాలను సంరక్షించేందుకు కొత్త విధానం ఉపయోగపడనుంది.మూడో పార్టీ సైట్‌లో నియమించే సంస్థలకు ఈ కఠిన మార్గదర్శకాలు వర్తిస్తాయి. ఓ ఉద్యోగిని నియమించుకున్న కం పెనీ.. తన సేవలు అందించేందుకు వేరే సంస్థలకు ఆ వ్యక్తిని పంపిస్తే ఆ మరో సంస్థ మూడో పార్టీ సైట్ అవుతుంది.

శ్రీలంక మంత్రివర్గం ప్రక్షాళన

కొలంబో: శ్రీలంకలో దేశాధ్యక్షులు మైత్రీపాలా సిరిసేన తమ కేబినెట్‌ను పునర్వ్యస్థీకరించారు. ప్రస్తుత రాజకీయ సంక్షోభ నివారణకు ఈ చర్యలు చేపట్టినట్లుగా భావిస్తున్నారు. ప్రధానిగా ఉన్న రనీల్ విక్రమ్‌సింగ్‌ను శాంతి భద్రత మంత్రిగా నియమించారు. ప్రస్తుత యునిటీ ప్రభుత్వ హయాంలో ఇది రెండు మంత్రివర్గ ప్రక్షాళనగా మారింది. శ్రీలంక ఫ్రీడం పార్టీ , యునైటెడ్ నేషనల్ పార్టీతో కూడిన యునిటీ ప్రభుత్వానికి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో పరాజయం ఎదురైంది. ఈ ఎన్నికలలో మాజీ అధ్యక్షులు మహీందా రాజపక్సాకు చెందిన నూతన పార్టీ ఘన విజయం సాధించింది.అధికార కూటమికి వ్యతిరేకంగా ఈ స్థానిక తీర్పు రెఫరెండంగా భావిస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి నివారణకు ఇప్పుడు మంత్రివర్గంలో భారీ స్థాయి మార్పులు చేపట్టారు. పలువురి శాఖలను మార్చివేశారు.మాజీ అధ్యక్షుడు రాజపక్సా కొత్త పార్టీ శ్రీలంకన పీపుల్స్ పార్టీ (ఎస్ఎల్‌పిపి) దేశ స్థానిక ఎన్నికలలో మొత్తం340 కౌన్సిల్‌కు గాను ఏకగా 225 కౌన్సిల్స్‌లో విజయం సాధించి తన ఆధిపత్యం చాటుకుంది.

అమెరికాతో చర్చలకు సిద్ధం : ఉ.కొరియా



సియోల్ : అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఉత్తర కొరియా ఆదివారం ప్రకటించింది. ఎప్పుడూ అమెరికా చర్యలను ప్రతిఘటిస్తూ వస్తో న్న ఉత్తర కొరియా ఇప్పుడు సంచలనరీతిలో రాజీ ప్రతిపాదనలు చేసిం ది. అమెరికా తమపై విధించిన ఆంక్షలను ఖండిస్తూ, వీటిని సహించేది లేదని ప్రకటించిన కొద్ది గంటలకే ఉత్తర కొరియా నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.దక్షిణ కొరియాలో వింటర్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమానికి ఉత్తర కొరియా నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. ఈ సందర్భంగా ఆ దేశ ప్రతినిధి విలేకరులతో మాట్లాడుతూ అమెరికాతో సంబంధాలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు సిద్ధం అని ప్రకటించారు. సమస్యలపై చర్చించుకుంటే బాగుంటుందని తెలిపా రు. అంతేకాకుండా దక్షిణ కొరియా అధ్యక్షులు మూన్ జే ఇన్‌తో ఉత్తర కొరియా బృందం ఒలింపిక్ సిటీలో గుర్తు తెలియని ప్రదేశంలో సమావేశం అయింది. వీటిపై పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. సామరస్యం గా వ్యవహరిస్తే మంచిదని దక్షణ కొరియా అధ్యక్షులు ఈ బృందానికి సూచించినట్లు వెల్లడైంది. ఒలింపిక్ క్రీడల నిర్వహణ చివరికి రెండు కొరియాల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొనేందుకు దారితీసిందని భావిస్తున్నారు. అయితే తాజాగా ఉత్తర కొరియాపై అత్యంత కఠిన ఆంక్షలను అమెరికా అధ్యక్షులు ట్రంప్ జారీ చేసినందునే వీటి పరిణామాలను విశ్లేషించుకుని దక్షిణ కొరియా ఇప్పుడు అమెరికాతో శాంతికి ముందుకు వస్తోందనివిశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఆంక్షలు విధిస్తే యుద్ధాన్ని కోరి తెచ్చుకున్నట్లే

అమెరికా చేష్టలు యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఉత్తర కొరియాపై మరింత కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికాఅధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటించడంపై ప్యాం గ్యాంగ్ స్పందించింది. 'మేము పదే పదే చెబుతున్నాం. మాపై ఆంక్షలు విధిస్తే యుద్ధాన్ని కోరి తెచ్చుకున్నట్లు అవుతుంది' అని యూఎస్‌ను హెచ్చరిస్తూ ఉ.కొరియా విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తమకు భయపడే యూఎస్ ఇలా ఆంక్షలు పెడుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. క్షిపణి ప్రయోగాలు ఆపకపోతే.. ఉ.కొరియాను సర్వనాశ నం చేస్తామని ట్రంప్ గతంలో పలుమార్లు హెచ్చరించారు.తాజాగా.. ఉ.కొరియాకు చెందిన 50 నౌకలు, షిప్పింగ్ కంపెనీలు,వాణిజ్య,వ్యా పార కార్యకలాపాలు జరపకుండా అత్యంత కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు యూఎస్ నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంతకముందెన్నడూ ఏ దేశం మీద పెట్టని ఆంక్షలను ఉత్తర కొరియా మీద విధిస్తున్న ట్లు ఆయన తెలిపారు. ఆంక్షలు పెట్టినప్పటికీ ఉ.కొరియా తన వైఖరి మార్చుకోకపోతే మరింత కఠినమైన ఆంక్షలు పెడతామని ట్రంప్ హెచ్చరించారు.

చేతల ప్రభుత్వం కాదు..మాటల ప్రభుత్వం

కాంగ్రెస్ సిఎల్‌పి ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మన తెలంగాణ/మర్కూక్/వర్గల్ : మాటల ప్రభుత్వమే తప్పా చేతల ప్రభుత్వం కాదని, వచ్చే ఎన్నికల్లో గజ్వేల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ సిఎల్‌పి ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్, మర్కూక్ మండలాలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ మాటలు తప్పా చేతలు లేవని నాలుగేళ్ల కాలంలో ఎంత అభివృద్ధి చేశాడో చూస్తే తెలుసుందని, ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని మండలాలలో ప్రతి మండలానికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కనబడుతాయనుకున్నాను కాని ఇక్కడ మాత్రం అలా కనబడడంలేదన్నారు. కేవలం ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాలలో మినహా ఎక్కడ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు లేవు ఈ రెండు గ్రామాలను చూపుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాడని మండిపడ్డారు. సోనియా గాంధీ నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలను ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్రన్ని ఇస్తే నీళ్ల నిధులు నియామకాలు అంటూ కోట్ల రూపాయలు జనం సొమ్ము దోచుకున్నాడని, టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఇంటింటికి ఉద్యోగం ఇస్తానని చెప్పి తన ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు సంపాదించుకున్నాడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన విద్యార్థుల కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం అన్నాడు తెలంగాణ రాగానే ఎవరికి తెలియకుండా తన కుటుంబ సభ్యులను తీసుకొని సోనియాగాంధీ దగ్గరకు వెళ్లి కలిసి సోనియాగాంధీ దేవత అని అసెంబ్లీలో చెప్పాడని ఇప్పుడు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని మరిచిపోయాడన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న విఆర్‌ఎపై దాడి!



మన తెలంగాణ / మంథని : మంథని మండలం ఖానాపూర్ గ్రామ పరిధిలోని గోదావరి నుంచి ఆదివారం సాయంత్రం అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న విఆర్‌ఎ నారామల్ల శంకర్‌పై అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్ డ్రైవర్, మరో ఇద్దరు కూలీలు దాడికి దిగిన సంఘటన కలకలం రేపింది. విఆర్‌ఎ శంకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ చేగోండ శంకర్‌తో పాటు కూలీలపై దాడి కేసుతో పాటు విధులకు ఆటం కం కలిగించారన్న అభియోగాలపై కేసులు నమోదు చేసినట్లు మంథని పోలీసులు తెలిపారు. ఖానాపూర్ శివారులోని గోదావరి నదీ తీరం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం మేరకు మంథని తహసీల్దార్ సుధాకర్ విఆర్‌ఎ శంకర్‌కు డ్యూటీని వేశారు. ఆదివారం ఖానాపూర్ వద్ద గోదావరిలోకి ఓ ట్రాక్టర్ దిగి ఇసుకను అక్రమంగా లోడ్ చేస్తుండగా సదురు విఆర్‌ఎ అక్కడకు వెళ్లి ఇసుక తరలించవద్దని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినా వినిపించుకోకుండా, భూతులు తిడుతూ, చేతులతో దాడి చేయడంతో పాటు మరో మారు అడ్డుకుంటే చంపేస్తామని బెదిరించారు. విఆర్‌ఎ తహశీల్థార్ సుధాకర్‌కు ఫోన్ చేసి చెప్పగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపే వారు పారిపోయారు.

చైనా అధ్యక్ష పదవీకాల ఆంక్షల ఎత్తివేత

నేటి నుంచి జరిగే సిపిసిలో కీలక చర్చ



బీజింగ్ : చైనాలో అధ్యక్ష పదవీ కాల పరిమితిపై ఉన్న ఆంక్షలను తొలిగించేందుకు సన్నాహాలు చేపట్టారు. దేశాధ్యక్షులు వరుసగా రెండు కన్నా సార్లు పదవీ బాధ్యతలు చేపట్టరాదనే నిబంధన ఇప్పుడు రాజ్యాంగంలో ఉంది. అయితే ఈ క్లాజ్‌ను తొలిగించాలని అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా(సిపిసి) ప్రతిపాదించింది. ఒకే వ్యక్తి అత్యున్నత పదవీలో ఉండరాదనే కీలక నిబంధనను ఎత్తివేయడం ద్వారా ప్రస్తుత అధ్యక్షులు జి జిన్‌పింగ్ అధికారానికి చిక్కులు లేకుండా చేసేందుకు ఈ చర్యకు దిగుతున్నారు. సిపిసిలో మావో తరువాత అత్యధిక ప్రాబల్యం సాధించుకున్న నేతగా జిన్‌పింగ్ ఇప్పుడు నిలిచారు. ఆయన పదవీకాల పరిమితి 2022తో ముగుస్తుంది. ఇప్పుడున్న ఆంక్షలను ఎత్తివేస్తేకానీ ఆ తరువాత కూడా జిన్‌పింగ్ అధికారంలో కొనసాగేందుకు వీలేర్పడదు. జిన్‌పింగ్ ఇప్పుడు రెండోసారి దేశాధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారుజ ''దేశ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు రెండుకు మించి ఎక్కువ సార్లు దేశాధ్యక్ష బాధ్యతల్లో కొనసాగడానికి వీల్లేదు'' అని దేశ రాజ్యాంగంలో పేర్కొని ఉంది. ఈ నిర్ధిష్టతను తొలిగించేందుకు సిపిసి కేంద్ర కమిటీ ప్రతిపాదిస్తోందని అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఇక సిపిసి సెంట్రల్ కమిటీ కూడా ఒక ప్రకటన వెలువరించింది. జి జిన్‌పింగ్ సోషలిజపు ఆలోచనలు, చైనా నూతనాధ్యయపు లక్షణాలను రాజ్యాంగంలో పొందుపర్చడం జరుగుతోందని ఇందులో తెలిపారు. సిపిసి వెలువరించిన ఈ ప్రకటన దేశాధ్యక్షులు జి తరఫున వెలువరిస్తున్నట్లు తెలిపారు.రాజ్యాంగం ప్రాధాన్యత, కీలక అంశాల పరిరక్షణ సాగుతుందని ఇందులో తెలిపారు. రాజ్యాంగం లేదా చట్టం పరిధిని అతిక్రమించి ఏ సంస్థ కానీ వ్యక్తి కానీ వ్యవహరించేందుకు వీల్లేదు. ఆ అధికారం ఎవరికీ లేదని ఇందులో తెలిపారు. సిపిసి సెంట్రల్ కమిటీ రాజకీయ బ్యూరో ఏర్పాటు చేసిన బృంద స్థాయి అధ్యయనానికి జిన్‌పింగ్ అధ్యక్షత వహించారు. బీజింగ్‌లో సోమ, మంగళవారాలలో జరిగే 19వ సిపిసి సెంట్రల్ కమిటీ మూడో ప్లీనరీ సెషన్ జరుగనుంది. సిపిసి సెంట్రల్ కమిటీ ఇప్పుడు జరపబోయేది కీలక సమావేశం అని పార్టీ నిర్మాణాత్మక సంస్కరణల వ్యూహాలను, ప్రభుత్వ సంస్థల ప్రక్షాళన, దేశ ఆర్థిక, సామాజికాభివృద్ధి వంటివాటిపై చర్చలు జరుగుతాయి. అదే విధంగా రాబోయే కాలంలో అధికారిక వ్యవస్థలో నాయకత్వ స్థానాలకు, సిపిసిలో కీలక పదవులకు అర్హులను గుర్తించే దిశలో కూడా సిపిసి కీలక భేటీ దృష్టి సారిస్తుందని ప్రకటనలో తెలిపారు. అయితే ప్రధానంగా ఒకటి కంటె ఎక్కువ పర్యాయాలు దేశాధ్యక్ష బాధ్యతల పరిధి అంశమే కీలకం అవుతుందని , మిగిలిన విషయాలు అనుబంధాలుగా ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. సోమవారం నుంచి జరిగే సిపిసి భేటీలో కాల పరిమితిని పెంచడం ద్వారా 65 ఏళ్ల జి జిన్‌పింగ్‌కు మరోమారు అధికారం అప్పగించేందుకు వీలేర్పడుతుంది. జి సిపిసితో పాటు సైనిక దళాల అధిపతిగా ఉన్నారు. గత ఏడాది జరిగిన సిపిసి మహాసభలలో ఆయన రెండవ సారి బాధ్యతలు చేపట్టారు. ఏడుగురు సభ్యుల నాయకత్వ కమిటీ జి జిన్‌పింగ్‌కు సరైన అర్హుడైన సమర్థవంతుడైన వారసుడు లేదని పేర్కొంటూ రెండోసారి కూడా ఆయనకే పదవి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపింది.పార్టీలో మూడు దశాబ్దాలుగా సాగుతూ వస్తోన్న సమిష్టి నాయకత్వానికి భిన్నంగా ఇప్పుడు జిని అత్యున్నత ఏకైక నాయకుడికిగా ప్రకటించారు. 2016 లోనే జి జిన్‌పింగ్‌కు అత్యున్నత కోర్ లీడర్ ప్రతిపత్తి కల్పించారు.

నా బట్టతల దాచేందుకు ప్రయత్నిస్తున్నా : ట్రంప్



వాషింగ్టన్: ప్రముఖ మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ కౌఫెపె వంటి సరికొత్త పదాలను సృష్టిస్తూ.. నెటిజన్లకు సవాళ్లు విసురుతుంటారు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్. ఏదైనా కార్యక్రమంలో మాట్లాడే సమ యంలో ఆయన చూపే హావభావాలు, ముఖ కవళికలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఒక్కోసారి ట్రంప్ తనమీద తానే జోకులు వేసుకుంటారు. ఇప్పుడు కూడా అదే చేశారు. కన్జర్వేటివ్ పొలిటిక్ యాక్షన్ కాన్ఫరెన్స్‌లో ట్రంప్ ప్రసంగాని కి వచ్చిన సమయంలో ఆయన తన బట్ట తల గురించి మాట్లాడారు. తన బట్టతల గురించి జోకులు వేయడంతో హాలంతా నవ్వులతో నిండిపో యింది. 'నాబట్టతలను కనిపించకుండా చేయడం కోసం నేను చాలా కష్టపడుతున్నాను. కానీ అది మాత్రం అందరికీ కన పడిపోతుంది. కానీ అది అంత బాగోకుండా మాత్రం లేదు' అంటూ ట్రంప్ చమత్కరించారు. దీంతో ఆ హాలు అంతా నవ్వు లతో నిండిపోయింది. తన బట్టతలను కనిపించకుండా ఉంచేం దు కు జుట్టును ఎలా సరిచేసుకుంటారో అనేది యాక్షన్ ద్వారా చేసి చూపిం చడం మరింత నవ్వు తెప్పిస్తోంది.

ట్రంప్ నాకు కాబోయే భర్త : అమెరికా అధ్యక్షుడి నివాసం అయిన శ్వేత సౌధం రక్షణ వలయాన్ని ఛేదించుకుంటూ ఒక మహిళ తన వాహనంతో దూసుకెళ్లడానికి ప్రయత్నించింది. దాన్ని అడ్డుకున్న పోలీ సులు ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. ఆ సందర్భంగా అధ్య క్షుడు నాకు కాబోయే భర్త అంటూ ఆమె కోర్టు ముందు వెల్లడించింది. పోలీసులు కథనం ప్రకారం..టెన్నిస్సీ రాష్ట్రానికి చెందిన జెస్సికా ఫోర్డ్ (35) అనే మహిళ శుక్రవారం 3 గంటల ప్రాంతంలో తన వ్యాన్‌లో అధ్యక్షుడి నివాసం లోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించింది. ఒక హ్యాండ్ గన్ తీసుకొని వ్యాన్ చక్రం వెనకాల కూర్చొని ఆమె లోపలికి వెళ్లడానికి ప్రయత్నించింది. అధికారులు ఆమెను గన్ పడేయమని కోరగా ఆమె తిరస్కరించడంతో అధికారులు వ్యాన్ విండో నుంచి బలవంతగా వెనక్కి లాగాల్సి వచ్చింది. ఫోర్డ్ మూడు నేరాలకు పాల్పడినట్లు పోలీసులు ఆమె మీద కేసు నమోదు చేశారు. పోలీసుల రికార్డుల ప్రకారం..గతంలో కూడా ఆమె శ్వేత సౌధంలోకి వెళ్ల డానికి ప్రయత్నించింది.

దీనికి సంబంధించి ఆమె కు 90 రోజుల జైలు శిక్షతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇప్పిం చారు. శ్వేత సౌధం ఆమె నివాసంగా కూడా చెప్పు కుంటోంది. దీని గురించి న్యాయస్థానంలో అడిగిన ప్రశ్నకు ట్రంప్ తన కాబోయే భర్త అని సమాధానం ఇచ్చింది. అంతేకాకుండా ఆరు సంవత్స రాల నుంచి తన పిల్లలు కనిపించ కుండా పోయారని, నా పిల్లలు నాకు కావాలి అంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఆమె మానసిక పరిస్థితి గురించి అధికారులు అను మానం వ్యక్తం చేయగా, అమె తరపు న్యాయవాది మాత్రం ఆమె ఆరో గ్యంగా ఉందని కోర్టులో వెల్లడించారు.

సిరియాలో కాల్పుల విరమణ

భద్రతా మండలి తీర్మానం

వాషింగ్టన్ : సిరియాలో నెలరోజుల కాల్పుల విరమణకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆదివారం ప్రతిపాదించింది. ఓ వైపు ఈస్టర్న్ గౌటా రెబెల్ ప్రాంతంలో వైమానిక దాడులలో ఏడురోజులలో 500 మందికి పైగా మృతి చెందిన నేపథ్యంలో ఈ శాంతి ప్రతిపాదన చేశారు. పౌరుల ప్రాణ రక్షణకు భద్రతా మండలి తీర్మానం వెలువరించింది. దీనికి రష్యా మద్దతు కూడా లభించిందిం. మానవతా దృక్పథంతో సహాయ చర్యలు కొనసాగించేందుకు, వైద్యపరంగా క్షతగాత్రులను చికిత్సలకు తరలించేందుకు చర్యలు తీసుకోవల్సి ఉంది. అన్ని పక్షాలూ వెంటనే దీనికి సమ్మతించాలని తీర్మానంలో కోరా రు. అయితే శాంతి ప్రతిపాదన ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందీ? అన్ని సంబంధిత పక్షాల సహకారం ఉంటుందా? అనేది వెల్లడికాలేదు. అయితే మండలి శాంతి చర్యల తరువాత, తీర్మానం వెలువడిన తరువాత కూడా సిరియా యుద్ధ విమానాల దాడులు రెబెల్స్ ప్రాంతంలో యధేచ్ఛగా సాగాయి. రష్యా విమానాల సాయంతో సిరియా సేనలు ఈ చర్యలకు పాల్పడుతున్నాయి. దీనితో కాల్పుల విరమణ, దాడుల నిలిపివేత ఎప్పటినుంచి జరుగుతుందనేది స్పష్టం కావడం లేదు. గత ఆదివారం రెబెల్స్ ప్రాంతం లో సిరియా సేనలు దాడులు సాగించాయి. వీటిలో కనీసం 127 మంది బాలలతో పాటు మొత్తం 519 మంది దుర్మరణం చెందారు. దీనితో ఈ ప్రాంతంలో పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈ దాడులలో తాము పాల్గొనడం లేదని రష్యా అధికారికంగా తెలిపింది. మండలి తీర్మానం తరువాత ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుల్ మెక్రాన్, జర్మనీ ఛాన్సలర్ అంగేలా మెర్కెల్ వేర్వేరుగా రష్యా అధ్యక్షులు పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. పరిస్థితి అదుపులో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఈ నేతలు పుతిన్‌ను అభ్యర్థించారు.

భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్ళు

- జిల్లా స్థాయిలో రెవెన్యూ కోర్టులు
- రౌండ్ టేబుల్ సమావేశంలో రెవెన్యూ, న్యాయ నిపుణులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో భూ వివాదాల పరిష్కారానికి పటిష్ఠ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని రెవెన్యూ, న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. భూ వివాదాలను పరిష్కరించడంలో తాహసీల్దార్లు, ఆర్డీఒలు కీలకమని, వీరు ఇచ్చిన ఉత్తర్వులను అప్పీలు చేసుకోడానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక రెవెన్యూ ట్రిబ్యునల్ ఉండాలని, ఇందులో పదవీ విరమణ చేసిన జిల్లా న్యాయమూర్తితో పాటు రెవెన్యూశాఖకు చెందిన ఉన్నతాధికారి ఉండాలని, రాష్ట్రస్థాయిలో శాశ్వత ట్రిబ్యునల్ ఉండాలని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్‌రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ తాహసీల్దార్ల సంఘం ప్రచురిస్తున్న 'తెలంగాణ రెవెన్యూ' మాసపత్రిక, నల్సార్ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని నల్సార్ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో రెవెన్యూ, న్యాయ విభాగాల నిపుణులులోతైన చర్చలు జరిపారు. ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసి భూ వివాదాల పరిష్కారానికి పటిష్టమైన, శాశ్వత వ్యవస్థ ఉండాలని అన్నారు. నల్సార్ వర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యవస్థలో రెవిన్యూ చాలా కీలకమైన అంగమని, ఇది పటిష్టంగా ఉంటే సామాన్యులకు మేలు జరుగుతుందని, పాత చట్టాలను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉస్మానియా వర్శిటీ ప్రొఫెసర్ జిబిరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం కోర్టుల్లో ఉన్న కేసుల్లో ఎక్కువగా భూ వివాదాలకు సంబంధించినవేనని, సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులతో పాటు ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం మంచి ఆలోచన అని వ్యాఖ్యానించారు. తొలుత తాహసీల్దారు,ఆ తర్వాత ట్రిబ్యునల్, దాని తర్వాత హైకోర్టు... ఇలా మూడంచెల వ్యవస్థ ఉండాలన్నారు. వివిధ అంశాలకు ట్రిబ్యునళ్ళు ఉన్నట్లుగానే భూ వివాదాలకు కూడా ఉండాలని, ట్రిబ్యునల్ వెలువరించే ఉత్తర్వులను హైకోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉండాలని వ్యాఖ్యానించారు. నల్సార్ వర్శిటీ అనుబంధ ఆచార్యులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ, దేశ స్థాయిలోని 66%, రాష్ట్రంలో 68% కోర్టు కేసులు భూములకు సంబంధించినవేనని, ఈ వివాదాల కారణంగా దేశం ప్రతీ ఏటా సుమారు మూడు వేల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతోందని, ప్రజలు రూ.25 వేల కోట్ల మేరకు కోర్టు కేసుల ఖర్చుల నిమిత్తం వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. తాహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ,ఉత్తరప్రదేశ్, ఒడిషా లాంటి రాష్ట్రాలు నూతన చట్టాలు ప్రవేశ పెట్టి భూ వివాదాల పరిష్కారంలో ఫలితాలు సాధించాయని, మన రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం శాశ్వత స్థాయిలో పటిష్ఠ వ్యవస్థను రూపొందించాలని అన్నారు. జిల్లా స్థాయిలో రెండంచెల రెవెన్యూ కోర్టులతో పాటు తాహసీల్దార్ తర్వాత జిల్లాస్థాయిలో ట్రిబ్యునల్ వ్యవస్థ ఉండాలని అన్నారు. సర్వే విధానం, కొలమానాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరులో ఉన్నందువల్ల దేశమంతా ఒకే విధానం అమలయ్యేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి వచ్చినందువల్ల ఒకేసారి రాష్ట్రమంతటా సర్వే జరపాలని, భూ వివాదాల్లో అటవీ, రెవిన్యూ, దేవాదాయ,వక్ఫ్‌లాంటి వ్యవస్థలు ఉన్నందున సమన్వయం చాలా అవసరమని వ్యాఖ్యానించారు.రెవిన్యూ సిబ్బందికి ఎక్కువ సమయం భూవివాదాల పరిష్కారం, వ్యవహారాలపైనే దృష్టి పెట్టేలా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించిన ఇతర పనులను తగిగంచేలా చూడాలన్న అభిప్రాయం కూడా ఈ సమావేశంలో వ్యక్తమైంది.



తెలుగు భాషను రక్షించుకోవాలి

మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : తెలుగు భాషను ప్రతి ఒక్కరూ రక్షించుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలుగు భాష అనేక సంవత్సరాలుగా సంపదగా కొనసాగుతుందని, అలాంటి భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఆదివారం హైదరాబాద్ బిసి భవన్‌లో తెలంగాణ కవుల సంఘం ఆవిర్భావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణ య్య మాట్లాడుతూ అన్య భాషల ప్రభావంతో తెలుగు భాష బలహీనపడే ప్రమాదముందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కవుల సంఘం కార్యవర్గం ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా ఆర్. కృష్ణయ్య, ప్రధాన సలహాదారులుగా సుతారపు వెంకటనారాయణ,ఎ.నరేంద్రచౌదరి, అధ్యక్షులుగా జిఎస్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మక్కపాటి మంగళ, ఉపాధ్యక్షులుగా డా. కావూరి సాంబశివరావు, కోశాధికారిగా కాశీ విశ్వనాథరావు, కార్యదర్శిగా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వర్‌రావు, పున్న విజయలక్ష్మీ లను ఎన్నుకున్నారు.

టిఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం

ఎన్ఎస్‌యుఐ సదస్సులో టిపిసిసి చీఫ్ ఉత్తమ్




మన తెలంగాణ / హైదరాబాద్ : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టీఆర్ఎస్ పాలనలో కొనసాగుతున్న అవినీతి, అక్రమాలను బయటపెడతామని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. అధికారంలోకి వస్తే మహిళలకు వడ్డీ లేని రుణాలు, నిరుద్యోగ యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 26 నుంచి జరగనున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు ద్వారా కెసిఆర్ నియంతపాలనను, కుటుంబానికే పరిమితమైన సంక్షేమాన్ని ఎండగడతామని, యాత్రను విజయవంతం చేయాలని కోరారు. గాంధీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో, ఇందిరాభవన్‌లో జరిగిన పూర్వ ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఓయు జెఎసి, నిరుద్యోగ సంఘాల ఆవేదనతో కూడిన నిరుద్యోగ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ఉపాధ్యక్షులు మల్లు రవి పాల్గొన్నారు. గౌడలకు, కల్లుగీత కార్మికుల జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ ఆధ్వర్యంలో గౌడసంఘం పోస్టర్‌ను ఉత్తమ్ ఆవిష్కరించారు. కరీంనగర్ ఉమ్మడిజిల్లా కన్వీనర్ బుసన వేణి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ్ సమక్షంలో ఖమ్మం జిల్లా డోర్నకల్ నుంచి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బస్సు యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెర్క శ్యామ్ సారధ్యంలో నిర్మించిన 'తెలంగాణ గుండె చప్పుడు' పాటల సిడిని ఆవిష్కరించారు. ఏపూరి సోమన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మృత్యుంజయం పాల్గొన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్ యాత్ర'

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో'తెలంగాణ కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్ యాత్ర' సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రారంభం కానుంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 10 గంటలకు నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన అనంతరం బస్సు యాత్రను ప్రారంభిస్తారు. ఆరే మైసమ్మ గుడి, మొయినాబాద్ చర్చిలో ప్రార్ధనలు జరిపిన అనంతరం యాత్ర చేవెళ్ల చేరుకుని అక్కడ జరిగే సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి వికారాబాద్‌కు చేరుకుని సాయంత్రం 4 గంటలకు బహిరంగలో పాల్గొంటారు. ఈ నెల 27న 1 గంటకు తాండూరు సభలో, 4 గంటలకు సంగారెడ్డి సభలో పాల్గొన్న అనంతరం రాత్రి సంగారెడ్డికి చేరుకుంటారు.

బోయలను ఎస్‌టిలో చేర్చేందుకు అసెంబ్లీలో గళమెత్తుతా

వాల్మీకి జయంతిలో పాల్గొన్న ఎంఎల్‌ఎలు సంపత్, డి.కె. అరుణ



మన తెలంగాణ/ఇటిక్యాల : మండల పరిధిలోని బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లిలో గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడిని తెస్తానని అలంపూరు ఎంఎల్‌ఏ సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కోదండాపురం గ్రామంలోని వాల్మీకి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహా ఆవిష్కరణలో ముఖ్య అతిథిలుగా అలంపూరు. గద్వాల్ ఎంఎల్ఏలు సంపత్ కుమార్, డి.కె. అరుణలు పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ఐక్యతతో ఇలాంటి గొప్ప మహర్షి విగ్రహం ఏర్పాటు చేసిన గ్రామస్థులను అభినందించారు. తనకు సహకరించిన బోయలకు ఇది నడిగడ్డ ప్రాంతంలోని ఎస్.టిలో చేర్చుతామని మాట ఇచ్చి తప్పిన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గద్వాల ఎంఎల్ఏ డి.కె అరుణ మాట్లాడుతూ, రామయణ కావ్య రచయిత వాల్మికి ఆహ్వానించిన గ్రామస్థులను అభినందించారు. వాల్మికులను అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బోయలను ఎస్.సి జాబితాలో చేర్చుతానని చెప్పి మోసం చేసిన కెసిఆర్‌కు తగిన బుద్ది చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో ఆర్డినేటర్ లక్ష్మి నారాయణ రెడ్డి,అనంత్ రెడ్డి, సోమిరెడ్డి,మున్సిపల్ చైర్మన్ కృష్ణవేణి రామంజనేయులు, పూడూర్ సర్పంచ్ ఈశ్వర్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

రైనా బ్యాటింగ్‌పై ప్రశంసల వర్షం



ముంబయి: దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి ట్వంటీ–20 మ్యాచ్‌లో అద్భుత బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కీలకమైన మ్యాచ్‌లో అద్భుత ఆటతో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన రైనాను అభిమానులు ప్రశంసలతో ముంచెత్తున్నారు. మాజీ క్రికెటర్లు వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్, హర్భజన్ సింగ్, గంగూలీ తదితరులు రైనా ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు అతన్ని ఆటను పొగుడుతూ ట్వీట్ చేశారు. రైనా భార్య ప్రియాంక కూడా తన భర్త ఆటపై సంతోషం వ్యక్తం చేసిది. పాకిస్థాన్ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ కూడా రైనాను అభినందిస్తూ ట్వీట్ చేశాడు. చాలా కాలం తర్వాత టీమిండియాలో చోటు సంపాదించిన రైనా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కీలకమైన మూడో టి–20లో 27 బంతుల్లోనే వేగంగా 43 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు. ఆ తర్వాత బంతితోనూ సత్తా చాటాడు. అతని ప్రతిభకు గుర్తింపుగా మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కూడా దక్కింది. చాలా రోజుల తర్వాత రైనా ఓ మెరుగైన ప్రదర్శన కనబరచడం ఇదే తొలిసారి. నిర్ణయాత్మక మ్యాచ్‌లో బ్యాట్‌ను ఝులిపించి రైనా ఒక్కసారిగా హీరోగా మారి పోయాడు.

గర్వంగా ఉంది: కోహ్లి



కేప్‌టౌన్: సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో వరుసగా రెండు సార్లు చాంపియన్‌షిప్ గదను అందుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన టీమిండియాకు ఐసిసి చాంపియన్‌షిప్ గదను బహూకరించింది. దిగ్గజ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, గ్రేమి పొలాక్‌ల చేతుల మీదుగా కోహ్లి ఈ గదను అందుకున్నాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ సమష్టి పోరాటం వల్లే టెస్టుల్లో వరుసగా రెండో ఏడాది కూడా నంబర్‌వన్ నిలిచామన్నాడు. ఈ విజయంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉందన్నాడు. సహచర ఆటగాళ్లతో పాటు కోచ్, సహాయక సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో పర్యటించినా అక్కడి అభిమానులు వెన్ను ప్రోత్సహించడం అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. సౌతాఫ్రికాలో అభిమానులు చూపిన ఆదరణ చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. క్లిష్ట సమయాల్లో వారి ప్రోత్సాహం తమను గెలుపు బాటలో నడిపించిందన్నాడు. అభిమానుల సహకారాన్ని ఎప్పటికీ మరవలేమన్నాడు. ఇక, దక్షిణాఫ్రికా వంటి క్లిష్టమైన పర్యటనలో వన్డేలు, ట్వంటీ–20లలో సిరీస్‌లను దక్కించుకోవడం ఎంతో ఊరటనిచ్చిందన్నాడు. బౌలర్లు, బ్యాట్స్‌మెన్ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో గెలుపు దక్కిందన్నాడు. రానున్న ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో కూడా విజయాలు సాధిస్తామనే నమ్మకం పెరిగిందన్నాడు. తన కెరీర్‌లో సౌతాఫ్రికా సిరీస్ చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. బ్యాట్స్‌మన్‌గా, కెప్టెన్‌గా విజయవంతం కావడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు కోహ్లి వివరించాడు. కాగా, టెస్టుల్లో నంబర్‌వన్‌గా నిలిచిన భారత్‌కు ఐసిసి చాంపియన్‌షిప్ గదను అందజేసింది. అంతేగాక ఒక బిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని సైతం అందించింది.



సఫారీ గడ్డపై అదరగొట్టిన భారత్

మన తెలంగాణ/ క్రీడావిభాగం: దక్షిణాఫ్రికా సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన భారత క్రికెట్ చరిత్రలోనే చిరకాలం గుర్తుండి పోతుందని చెప్పవచ్చు. సుదీర్ఘకాలం పాటు సాగిన సిరీస్‌లో భారత జట్టు అసాధారణ ఆటతో ఆకట్టుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సౌతాఫ్రికా పర్యటనలో టీమిండియా అద్భుతంగా రాణించింది. టెస్టుల్లో చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన భారత్ వన్డే, ట్వంటీ–20 సిరీస్‌లను గెలుచుకొని చరిత్ర సృష్టించింది. తొలి రెండు టెస్టుల్లో చివరి వరకు పోరాడి స్వల్ప తేడాతో ఓటమి పాలైన కోహ్లి సేన తర్వాత చిరస్మరణీయ పోరాట పటిమతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆఖరి టెస్టుతో మొదలైన టీమిండియా విజయపరంపర ట్వి–20 సిరీస్‌తో ముగిసింది. గతంలో సౌతాఫ్రికా సిరీస్ అంటేనే ముందుగానే భారత్ తేలిపోయేది. కానీ, ఈసారి దానికి విరుద్ధంగా భారత్ తన ప్రదర్శన కొనసాగించింది. సఫారీలతో జరిగిన మూడు టెస్టుల్లో కూడా భారత్ ఆధిపత్యం చెలాయించింది. కానీ, చివరి దశలో ఒత్తిడికి గురి కావడంతో తొలి రెండు టెస్టుల్లో ఓటమి తప్పలేదు. ఇక, మూడో టెస్టులో సౌతాఫ్రికాను చిత్తు చేసి తన సత్తా ఎంటో నిరూపించింది. మూడు టెస్టుల్లోనూ సౌతాఫ్రికాను రెండేసి సార్లు ఆలౌట్ చేసి పెను ప్రకంపనలే సృష్టించింది. విరాట్ కోహ్లి సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. టెస్టుల్లో, వన్డేల్లో అతనికి ఎదురే లేకుండా పోయింది. రెండు ఫార్మాట్‌లలో కూడా వరుస శతకాలతో జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఇక, బౌలింగ్‌లో కూడా భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా, అశ్విన్, జడేజా, ఇషాంత్, షమి తదితరులు చెలరేగి పోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు టెస్టుల్లో కూడా సౌతాఫ్రికాను రెండు ఇన్నింగ్స్‌లలో కూడా ఆలౌట్ చేశారు. ఇక, వన్డే సిరీస్‌లో యువ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌ల ప్రతిభను ఎంత పొగిడినా తక్కువే. ఇద్దరు ఏకంగా 30కి పైగా వికెట్లు పడగొట్టి భారత్‌కు సిరీస్ అందించడంలో కీలకపాత్ర పోషించారు.

ఒక్క మ్యాచ్‌లో తప్ప వీరిద్దరూ సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను హడలెత్తించారు. భువనేశ్వర్, బుమ్రాలు కూడా బౌలింగ్‌లో సత్తా చాటి తమవంతు సహకారం అందించారు. రోహిత్ శర్మ కూడా కీలక సమయంలో సెంచరీతో కదం తొక్కాడు. అజింక్య రహానె కూడా కీలక ఇన్నింగ్స్‌లతో జట్టుకు అండగా నిలిచాడు. ఇక, కెప్టెన్ విరాట్ కోహ్లితో కలిసి ఓపెనర్ శిఖర్ ధావన్ అద్భుత భాగస్వామ్యాలు నెలకొల్పాడు. వీరిద్దరి బ్యాటింగ్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోవైపు ట్వంటీ–20 సిరీస్‌లో సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా ఆకట్టుకున్నాడు. మూడు మ్యాచుల్లో కూడా మెరుగైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచాడు. కీలకమైన మూడో టి–20 మ్యాచ్‌లో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అతని బ్యాటింగ్ వల్లే జట్టు సిరీస్‌లో పైచేయి సాధించిందని చెప్పవచ్చు. బుమ్రా, భువనేశ్వర్, హార్దిక్ పాండ్యలు కూడా పొదుపుగా బౌలింగ్ చేస్తూ భారత్‌కు టి–20 సిరీస్ అందించడంలో ముఖ్య భూమిక పోషించారని చెప్పాలి.

కివీస్ జయకేతనం

హామిల్టన్: ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 49.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. 27 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈదశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను సీనియర్ ఆటగాడు రాస్ టైలర్, వికెట్ కీపర్ టామ్ లాథమ్ తమపై వేసుకున్నారు. ఇద్దరూ ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా భారీ షాట్లతో స్కోరు వేగం తగ్గకుండా చూశారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన లాథమ్ ఆరు ఫోర్లతో 79 పరుగులు చేశాడు. చిరస్మరణీయ బ్యాటింగ్‌ను కనబరిచిన టైలర్ 12 ఫోర్లతో వేగంగా 113 పరుగులు సాధించాడు. చివర్లో సాంట్నర్ విధ్వంసక ఇన్నింగ్స్‌ను ఆడాడు. 27 బంతుల్లోనే 4 భారీ సిక్సర్లు, రెండు ఫోర్లతో అజేయంగా 45 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను వికెట్ కీపర్ బట్లర్ ఆదుకున్నాడు.



చెలరేగి ఆడిన బట్లర్ ఐదు ఫోర్లు, మరో ఐదు సిక్సర్లతో వేగంగా 79 పరులు చేశాడు. జోయ్ రూట్ (71), ఓపెనర్ జాసన్ రాయ్ (49) రాణించడంతో ఇంగ్లాండ్ స్కోరు 284కు చేరింది.

ఆంధ్రా పరాజయం

- ఫైనల్లో సౌరాష్ట్ర, విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ: ఆంధ్రా జట్టు విజయ్ హజారే ట్రోఫీలో సెమీఫైనల్లోనే ఓటమి పాలైంది. ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో సౌరాష్ట్ర 59 పరుగుల తేడాతో ఆంధ్రాను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 255 పరుగులకే ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా కేవలం 196 పరుగులకే కుప్పకూలింది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రాను సౌరాష్ట్ర బౌలర్లు హడలెత్తించారు. ముఖ్యంగా ధర్మేంద్ర సింగ్ అద్భుత బౌలింగ్ చెలరేగి పోయాడు. కీలక బౌలింగ్ ప్రదర్శన ఇచ్చిన ధర్మేంద్ర 40 పరుగులకే నాలుగు వికెట్లు తీసి ఆంధ్రా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. మరోవైపు శౌర్యకు రెండు వికెట్లు లభించాయి. ఆంధ్రా జట్టులో బి.సుమంత్ (42), రవితేజ (42), శ్రీకర్ భరత్ (29) తప్ప



మిగతావారు విఫలమయ్యారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్రను రవీంద్ర జడేజా (56), అర్పిత్ వస్వదా (58), ప్రేరక్ మన్కడ్ (40) ఆదుకున్నారు. ఓపెనర్ సమర్థ్ వ్యాస్ (46) తనవంతు పాత్ర పోషించాడు. మంగళవారం జరిగే ఫైనల్లో కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడుతుంది.

ఐపిఎల్ వల్లే రాటుదేలా: భువనేశ్వర్

కేప్‌టౌన్: ఇటీవల కాలంలో మూడు ఫార్మాట్‌లలో కూడా నిలకడైన ప్రదర్శన ఇవ్వడం ఎంతో సంతృప్తి ఇస్తుందని భారత స్పీడ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో భువనేశ్వర్ మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని తట్టుకొని బౌలింగ్ చేయడం ఎంతో ఊరటనిస్తుందన్నాడు. తనలో ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం ఐపిఎల్ టోర్నమెంట్ అనడంలో సందేహం లేదన్నాడు. ఐపిఎల్‌లో ఆడడం వల్ల తన బౌలింగ్ పూర్తిగా మారి పోయిందన్నాడు. డెత్ ఓవర్లలో పొదుపుగా ఎలా బౌలింగ్ చేయాలో ఇక్కడే నేర్చుకున్నానని తెలిపాడు. గత రెండేళ్లుగా ఐపిఎల్‌లో నిలకడైన బౌలింగ్‌ను కనబరచడంతో తన ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. భారత జట్టులో చోటు సంపాదించేందుకు ఐపిఎల్ ప్రదర్శన మైలురాయిగా నిలిచిందన్నాడు. ఇక, దక్షిణాఫ్రికా సిరీస్ తన కెరీర్‌లో చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. టెస్టుల్లో, వన్డేల్లో, టి–20లలో నిలకడగా రాణించడం ఎంతో ఆనందం కలిగించిందన్నాడు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందనే నమ్మకాన్ని భువనేశ్వర్ వ్యక్తం చేశాడు. కాగా, ప్రతి సిరీస్‌కు ముందు ఒక లక్ష్యాన్ని, ప్రణాళికను రూపొందించుకుంటానని, దాని ప్రకారం నడుచుకుంటూ మెరుగైన ప్రదర్శన ఇస్తున్నట్టు వివరించాడు. తనతో పాటు భారత బౌలర్లు మెరుగ్గా బౌలింగ్ చేయగలుగు తున్నారంటే దానికి ఐపిఎల్ ఓ ప్రధాన కారణంగా చెప్పేందుకు తాను



సందేహించనని భువీ స్పష్టం చేశాడు.

ధావన్ @ 28

ఐసిసి టి–20 ర్యాంకింగ్స్

దుబాయి: అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా ప్రకటించిన ట్వంటీ–20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ కెరీర్‌లోనే అత్యుత్తమమైన 28వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచిన ధావన్ ఏకంగా 14 ర్యాంక్‌లను మెరుగు పరుచుకొని 28వ స్థానాన్ని దక్కించుకున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ధావన్ 143 పరుగులు చేశాడు. దీంతో అతని ర్యాంక్ గణనీయంగా మెరుగు పడింది. మరోవైపు బౌలింగ్‌లో స్పీడ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్ కూడా తన ర్యాంక్‌ను మెరుగు పరుచుకున్నాడు. మెరుగైన బౌలింగ్‌తో ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును దక్కించుకున్న భువనేశ్వర్ తాజా ర్యాంకింగ్స్‌లో 12వ స్థానానికి చేరుకున్నాడు. భువనేశ్వర్ ఈసారి ఏకంగా 20 ర్యాంక్‌లను మెరుగు పరుచుకోవడం విశేషం. టి–20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. కివీస్ స్టార్ మున్రో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. టీమ్ విభాగంలో టీమిండియా మూడో ర్యాంక్‌ను కాపాడుకుంది. బౌలింగ్‌లో బుమ్రా ఐదో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.



సీనియర్లకు విశ్రాంతి

- రోహిత్‌కు పగ్గాలు, లంక టోర్నీకి టీమిండియా ఎంపిక
- సిరాజ్‌కు చోటు

ముంబయి: శ్రీలంకలో జరిగే ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. ఈ టోర్నీలో పాల్గొనే జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అతనికి డిప్యూటీగా శిఖర్ ధావన్ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, స్టార్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్ తదితరులను సిరీస్‌కు ఎంపిక చేయకుండా విశ్రాంతి కల్పించారు. శ్రీలంకలో మార్చి 6 నుంచి జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు లంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొంటున్నాయి. కొంత కాలంగా ఎడతెరిపి లేకుండా ఆడుతున్న సీనియర్లకు విశ్రాంతి ఇవ్వాలని సెలెక్టర్లు నిర్ణయించారు. ఇందుకోసం వారిని జట్టుకు ఎంపిక చేయలేదు. కాగా, హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్ జట్టులో చోటు లభించింది. విజయ్‌శంకర్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. చాహల్‌ను కూడా జట్టుకు ఎంపిక చేశారు. సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాకు మరో అవకాశం ఇచ్చారు.

జట్టు వివరాలు:

రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కెఎల్.రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.



- ముగిసిన వింటర్ ఒలింపిక్స్

దక్షిణ కొరియాలోని ప్యాన్‌చాంగ్‌లో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ క్రీడలు ఆదివారం ముగిసాయి. 16 రోజుల పాటు జరిగిన ఈ మెగా పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 95 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకుంటూ వందలాది మంది క్రీడాకారులు అద్భుత విన్యాసాలతో కనువిందు చేశారు. ఆదివారం క్రీడల ముగింపు వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా దేశాల క్రీడాకారులు, కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, సాహస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.







Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.